
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 331
బుధవారం 21-2-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



'ఆప్' అభ్యర్థే మేయర్

చండీగఢ్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో ఆప్-కాంగ్రెస్ అభ్యర్థిని విజేతగా సుప్రీం నిర్ధారించింది.

- వివరాలు 6లో



ముంచెత్తుతున్న మాంద్యం

యుద్ధాలు, పర్యావరణ మార్పులతో ప్రపంచమంతా క్రమంగా మాంద్యం మేఘాలు కమ్ముకుంటున్నాయి.

- వివరాలు 6లో



మరాఠాల బిల్లుకు ఓకే

మహారాష్ట్రలో మరాఠాలకు 10% రిజర్వేషన్ కల్పిస్తూ ఆ రాష్ట్ర అసెంబ్లీ బిల్లుకు ఆమోదం తెలిపింది.

- వివరాలు 6లో



మేడారానికి చేరుకుంటున్న భక్తులు

వన.. జనజాతరకు వేళాయె

నేటి నుంచి మేడారం మహాజాతర ప్రారంభం

- నేడు కన్నెపల్లి నుంచి సారలమ్మ రాక.. రేపు సమ్మక్క
- మేడారం బాటలో గోవిందరాజు, పగిడిద్దరాజు
- నాలుగు రోజులపాటు వనమంతా జనమే..

మేడారం ప్రత్యేకం

వివరాలు 11లో

మార్గదర్శి డిపాజిట్లు చట్ట విరుద్ధం



సుప్రీంకోర్టుకు నివేదించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సెక్షన్ 45ఎస్‌కు వ్యతిరేకంగా డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధం

మార్గదర్శి కూడా ఇలాగే డిపాజిట్లు సేకరించింది

హైకోర్టులో ప్రతివాది కాకపోవడంతో అక్కడ ఈ విషయాలు చెప్పలేదు

లిఖితపూర్వకంగా పూర్తి వివరాలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు

- వాటి ఆధారంగా పూర్తి స్థాయి విచారణ జరుపుతాం..
- ఇరుపక్షాలకు స్పష్టం చేసిన త్రిసభ్య ధర్మాసనం
- తదుపరి విచారణ ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా
- కేసు కోర్టు పరిధిలో ఉండగానే రూ. 2 వేల కోట్లు వసూలు..
- అంతకు ముందే చట్ట విరుద్ధంగా రూ.2,600 కోట్ల సేకరణ
- ఏపీ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి నివేదన
- డిపాజిట్లు వెనక్కి ఇచ్చేశారా.. లేదా? అన్నది ముఖ్యం కాదు.. చట్ట విరుద్ధంగా సేకరించారా.. లేదా? అన్నదే ముఖ్యం : ఉండవల్లి

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్ ఫండ్ డిపాజిట్ల వ్యవహారంలో తాము ఎక్కడా చట్ట నిబంధనలను ఉల్లంఘించలేదంటూ ఇన్ని రోజులు బొంకుతూ వచ్చిన రామోజీరావుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గట్టిగా మొట్టికాయ వేసింది. రామోజీరావు నోరు మూయించేలా మంగళవారం సుప్రీంకోర్టు ముందు ఆర్బీఐ అసలు వాస్తవాన్ని బయటపెట్టింది. హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) పేరు మీద డిపాజిట్లు సేకరించడం ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్‌కు విరుద్ధమని నివేదించింది. ఈ కేసులో మార్గదర్శి డిపాజిట్ల సేకరణ అలానే జరిగిందని, ఆర్‌బీఐ తరపు న్యాయవాది రమేష్ బాబు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాల్లోని తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, పూర్తి వివరాలతో ఓ నోట్‌ను తమ ముందుంచాలని ఆర్‌బీఐని ఆదేశించింది. అలాగే ఏపీ ప్రభుత్వంతోపాటు పిటిషనర్ ఉండవల్లి అరుణ్‌కుమార్‌ను సైతం మార్గదర్శి చిట్‌ఫండ్ డిపాజిట్ల సేకరణ విషయంలో నోట్‌ను తమ ముందుంచాలని ఆదేశిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా..

విభజనకు ఒక్క రోజు ముందు తీర్పు...

ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధంగా దాదాపు రూ.2,600 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించినందుకు గాను చట్ట ప్రకారం మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని యజమాని రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలంటూ 2008లో సీఐడీ అధీకృత అధికారి టి.కృష్ణరాజు నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు దాఖలు చేశారు. దీనిని కొట్టేస్తూ ఉమ్మడి హైకోర్టు విభజనకు ఒక్క రోజు ముందు (2018 డిసెంబర్ 31) అప్పటి న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజని (ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ సభ్యురాలు, అమరావతి బెంచ్) తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ మార్గదర్శి అక్రమాలను వెలుగులోకి తెచ్చిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ 2019లో సుప్రీంకోర్టులో

మిగతా 10వ పేజీలో ▶

దక్షిణ 'రింగ్'కూ ఓకే!

రీజనల్ రింగు రోడ్డు దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు ప్రతిపాదనలు

- సీఎం రేవంత్ విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి గడ్కరీ ఆదేశాలు
- భూసేకరణ, విధానపర ప్రక్రియల వేగవంతానికి కూడా ఓకే
- యుటిలిటీస్ తరలింపు భారాన్ని భరిస్తామన్న కేంద్ర మంత్రి
- గడ్కరీ నివాసంలో గంటన్నరపాటు భేటీ అయిన రాష్ట్ర బృందం
- పలు రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలని విజ్ఞప్తి



మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, న్యూఢిల్లీ: రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం (చౌటుప్పల్-ఆమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డి- 182 కిలోమీటర్లు)ను జాతీయ రహదారిగా గుర్తించేందుకు అడ్డంకులు తొలగిపోయాయి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని కేంద్రం ఇప్పటికే జాతీయ రహదారిగా ప్రకటించింది. తాజాగా దక్షిణ భాగాన్ని కూడా గుర్తించేందుకు ప్రతిపాదనలు కోరాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

గంటన్నర పాటు భేటీ..: సీఎం రేవంత్‌తోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉన్నతాధికారులతో కూడిన బృందం మంగళవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి గడ్కరీని ఆయన అధికారిక నివాసంలో కలిసింది. సుమారు గంటన్నర పాటు భేటీ అయింది. ఈ సందర్భంగా తెలంగాణలో జాతీయ రహదారులను విస్తరించాల్సిన ఆవశ్యకతను గడ్కరీ దృష్టికి సీఎం రేవంత్ తీసుకెళ్లారు. ఆర్ఆర్ఆర్‌తో పాటు ఇతర రోడ్లకు అనుమతి ఇవ్వాలని.. పలు ముఖ్యమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన జాబితాను కేంద్రమంత్రికి

మిగతా 5వ పేజీలో ▶

10, 12 తరగతుల పరీక్షలు
ఏటా రెండుసార్లు

- రెండింటి ఫలితాల్లో అధిక స్కోరే లెక్కలోకి.. విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించేందుకే...
- 2025–26 నుంచే అమల్లోకి..
- నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా నిర్ణయం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

- వివరాలు 6లో

రంజీ 'ప్లేట్' చాంపియన్ హైదరాబాద్



అజేయ రికార్డు కొనసాగిస్తూ రంజీ ట్రోఫీ 'ప్లేట్' డివిజన్ విజేతగా హైదరాబాద్ క్రికెట్ జట్టు అవతరించింది. మేఘాలయ జట్టుతో జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. 'ప్లేట్' డివిజన్ విన్నర్, రన్నరప్ హోదాలో హైదరాబాద్, మేఘాలయ జట్లు వచ్చే రంజీ ట్రోఫీ సీజన్‌లో 'ఎలైట్' డివిజన్‌లో పోటీపడేందుకు అర్హత సాధించాయి.

- వివరాలు 14లో

స్విట్జర్లాండ్‌కు పోటీగా జమ్మూకశ్మీర్



- కశ్మీర్ లోయను అద్భుతంగా తీర్చిదిద్దుదాం.. ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- జమ్మూకశ్మీర్‌లో రూ.32,000 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన

6లో

మంగళవారం మక్తల్‌లో బీజేపీ విజయ సంకల్పయాత్రలో అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఏపీ జితేందర్‌రెడ్డి, డీకే అరుణ తదితరులు



ఆ రెండు పార్టీల వల్లే ప్రజలకు అన్యాయం

బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి, కుటుంబ పార్టీలే..

బీజేపీ విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కొంపలు ముంచేందుకే కేసీఆర్ ఢిల్లీకి.. హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం: బండి సంజయ్
- ఏ పార్టీతోనూ పొత్తు ప్రసక్తే లేదు..: అస్సాం సీఎం హిమంత
- ప్రధాని మోదీతోనే తెలంగాణ అభివృద్ధి: గోవా సీఎం సావంత్
- ఒకేరోజున 4 ప్రాంతాల నుంచి యాత్రలు మొదలుపెట్టిన బీజేపీ
- ప్రారంభించిన ఇద్దరు సీఎంలు, ఇద్దరు కేంద్ర మంత్రులు
- రోడ్ షోలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు

2లో



వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకొని కాలం వెళ్లదీయాలని చూస్తోంది. కాంగ్రెస్ సర్కారు వచ్చి 70 రోజులు గడిచినా హామీల అమలుకు ఏర్పాట్లు చేయట్లేదు.

- తాండూరు సభలో బండి సంజయ్



పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 10 ఎంపీ సీట్లు బీజేపీ కైవసం చేసుకుంటుంది. దేశాభివృద్ధి, తెలంగాణ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యం అవుతుంది. జూటా గ్యారంటీలతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

- భువనగిరి సభలో గోవా సీఎం ప్రమోద్ సావంత్



తెలంగాణలో రోజురోజుకూ బీజేపీ బలపడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి 6.8% ఓట్లురాగా ఈసారి ఎన్నికల్లో ఏకంగా 13.9% ఓట్లు వచ్చాయి. రానున్న రోజుల్లో 80 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ సర్కారు ఏర్పాటు చేయడం ఖాయం. ఎంపీ ఎన్నికల్లోనూ మోదీ గ్యారంటీలకు ఓటు వేయాలి.

- భైంసా సభలో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ

గవర్నర్‌గా హ్యాండిల్ చేయలేననుకున్నారు

న్యూబార్న్ బేబీ, ట్విన్స్‌కు చికిత్స చేయడం నాకు తెలుసు..



- నాకు ఈ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది చదువే
- ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకున్న వారు దేశానికి తిరిగి ఇవ్వాలి
- ఐఐటీ హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై ఆసక్తికర వ్యాఖ్యలు
- రాష్ట్రంలోని మూడు జాతీయ విద్యాసంస్థల్లో భవనాలను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

10లో

జమ్మికుంట కౌన్సిలర్ అరాచకం



భూకబ్జాను అడ్డుకున్న ముగ్గురిపై దాడి

◀ దాడిలో గాయపడ్డ మర్రి మల్లయ్య

12లో

క్లుప్తంగా...

ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌పై లీగల్‌ చర్యలు తీసుకుంటాం

ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతాపాల్‌



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌ మున్షీపై ఆరోపణలు చేసినందుకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాతా పాల్‌ తెలిపారు. ప్రభాకర్‌కు మహిళా శక్తి గురించి తెలియదని, ఇందిరా, సోనియా గాంధీ నడిపిన కాంగ్రెస్‌ పార్టీలోని మహిళా నేతపై వ్యాఖ్యలు చేసే ముందు అన్నీ ఆలోచించుకోవాల్సిందని ఆమె అభిప్రాయపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, శ్రీకాంత్‌ యాదవ్, రియాజ్, లింగం యాదవ్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ, బీజేపీ మహిళా వ్యతిరేక పార్టీ అని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే తాజాగా చేసిన వ్యాఖ్యలతో మరోమారు రుజువయిందన్నారు. ప్రభాకర్‌ దగ్గర ఎలాంటి ఆధారాలున్నా బయటపెట్టాలని సవాల్‌ చేశారు.

ఓటమి గ్రహించి పిచ్చి మాటలు

బీజేపీపై ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌ గౌడ్‌ ధ్వజం



సాక్షి, హైదరాబాద్‌: పస లేని, పనికిరాని ఆరోపణలతో బీజేపీ నేతలు పూట గడుపుకొనే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ ఎద్దేవా చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ తెలంగాణలో స్వీప్‌ చేయబోతోందన్న అంచనాల నేపథ్యంలో బీజేపీకి ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదని గ్రహించి.. ఆ పార్టీ నేతలు పిచ్చి లేచినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ రాష్ట్ర ఇన్‌చార్జి మున్షీపై బీజేపీ నేత ప్రభాకర్‌ చేసిన ఆరోపణలు ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టన్నారు.

అప్పులు తీరేవరకు పోటీ చేయకుండా బీఆర్‌ఎస్‌ను నిషేధించండి

సీఈసీకి మాజీ ఎంపీ వీహెచ్‌ లేఖ

సాక్షి, హైదరాబాద్‌: 'తెలంగాణను అప్పుల పాలు చేసిన బీఆర్‌ఎస్‌ పార్టీ ఏ ఎన్నికల్లోనూ పోటీచేయకుండా అనర్హత వేటు వేయాలి' అని మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. రానున్న పదేళ్లలో రూ.2.35 లక్షల కోట్లకుపైగా అప్పులను తెలంగాణ చెల్లించాల్సి ఉందని కాగ్‌ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో 2035–36 సంవత్సరంలో ఈ అప్పులు తీరేవరకు బీఆర్‌ఎస్‌ పోటీ చేయకుండా నివారించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

ఇదండీ సంగతి



ఈ మధ్య అవి తప్ప ఏమీ మాట్లాడటం లేదు!

రాజ్యసభకు ఆ ముగ్గురూ ఏకగ్రీవం

రేణుకా చౌదరి, అనిల్‌ యాదవ్, వద్దిరాజు ఎన్నిక

- కాంగ్రెస్‌ నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్‌ నుంచి ఒక్కరు
- రిటర్నింగ్‌ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న అనిల్, వద్దిరాజు
- నేడు తీసుకుంటానని సమాచారమిచ్చిన రేణుకాచౌదరి





రిటర్నింగ్‌ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్న అనిల్‌ కుమార్‌ యాదవ్, వద్దిరాజు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ కోటాలో మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ద్వైవార్షిక ఎన్నికలో కాంగ్రెస్‌ నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్‌ నుంచి ఒక్కరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్‌ అధికారి ప్రకటించారు. రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో కాంగ్రెస్‌ నుంచి మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి, యూత్‌ కాంగ్రెస్‌ నాయకుడు అనిల్‌ కుమార్‌ యాదవ్, బీఆర్‌ఎస్‌ నుంచి సిట్టింగ్‌ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. అనిల్‌ కుమార్‌ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర మంగళవారం రిటర్నింగ్‌ అధికారి ఉపేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు. బుధవారం ధ్రువీకరణ పత్రం తీసుకుంటానని రేణుకా చౌదరి రిటర్నింగ్‌ అధికారికి సమాచారం ఇచ్చారు.

భారీ ప్రదర్శనగా వచ్చిన అనిల్‌

యువజన కాంగ్రెస్‌ జాతీయ కార్యదర్శి, సికింద్రాబాద్‌ డీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న అనిల్‌ కుమార్‌ యాదవ్‌ ధ్రువీకరణ పత్రాన్ని అందుకునేందుకు పార్టీ కార్యకర్తలతో భారీ ప్రదర్శనగా అసెంబ్లీకి చేరుకున్నారు. అనిల్‌ వెంట ఆయన తండ్రి, మాజీ ఎంపీ అంజన్‌ కుమార్‌ యాదవ్, ప్రభుత్వ విప్‌ బీర్ల అయిలయ్య తదితరులున్నారు. అనిల్‌కుమార్‌ యాదవ్‌ను అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుతో పాటు పలువురు అభినందించారు. ఈ సందర్భంగా అనిల్‌ మీడియాతో మాట్లాడుతూ.. తాను రాజ్యసభకు వెళ్లే అవకాశం దక్కడం తన విజయం కాదని, తెలంగాణ యువజన కాంగ్రెస్‌ విజయమని వ్యాఖ్యానించారు. ఒక బీసీ బిడ్డను పెద్దల సభకు పంపి కాంగ్రెస్‌ అధిష్టానం బీసీలందరికీ తగిన గౌరవం ఇచ్చిందని చెప్పారు.

కేసీఆర్‌కు రుణపడి ఉంటానన్న వద్దిరాజు

రాజ్యసభకు 2022లో జరిగిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌ తరఫున తొలిసారిగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర మరోమారు రాజ్యసభలో అడుగు పెడుతున్నారు. రెండోమారు రాజ్యసభకు ఎన్నికైన ఆయన రిటర్నింగ్‌ అధికారి చేతుల మీదుగా ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్‌ గుప్తాతో పాటు పార్టీ నాయకులు ఉన్నారు. తనను రెండోసారి రాజ్యసభకు పంపిన పార్టీ అధినేత కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని, తెలంగాణకు రావాల్సిన విభజన హామీలపై పార్లమెంటులో గొంతెత్తుతానని వద్దిరాజు ప్రకటించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌ బలోపేతానికి కృషి చేయడంతో పాటు కేసీఆర్‌ మరోమారు ముఖ్యమంత్రి అయ్యేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. కాగా, ఈ నెల 8న రాష్ట్రం కోటాలో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్‌ విడుదల కాగా 15 వరకు నామినేషన్లు స్వీకరించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా కాంగ్రెస్‌కు రెండు, బీఆర్‌ఎస్‌ ఒక స్థానం దక్కాయి. మూడు స్థానాలకు ముగ్గురు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడం.. పరిశీలన, విత్‌డ్రా గడువు ముగియడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం రిటర్నింగ్‌ అధికారి ప్రకటించారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌.. మోసకారి పార్టీలు!

రెండూ అవినీతి, కుటుంబ పార్టీలే.. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న గోవా సీఎం ప్రమోద్‌సావంత్, ఈటల



విజయ యాత్ర రథంపై హిమంత బిశ్వశర్మ, కె.లక్ష్మణ్‌



అభివాదం చేస్తున్న బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఎల్‌వర్మ, రాణి రుద్రమ

సాక్షి, హైదరాబాద్‌/ సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌/ సాక్షి, యాదాద్రి/ తాండూరు/ నిర్మల్‌: కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ రెండూ ప్రజలను మోసం చేసే దొంగల పార్టీలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ రెండూ అవినీతి, కుటుంబ పార్టీలు అని, వాటితో ప్రజలకు అన్యాయమే జరుగుతుందని ఆరోపించారు. ఇన్నాళ్లూ తెలంగాణను కేసీఆర్‌ కుటుంబం దోచుకుంటే.. ఇప్పుడు రాహుల్‌ గాంధీ దోచుకుంటున్నారని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అత్యధిక సీట్లు సాధించే లక్ష్యంతో.. మంగళవారం ఒకేరోజున రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల నుంచి బీజేపీ 'విజయ సంకల్ప రథయాత్ర'లు మొదలయ్యాయి. అస్సాం, గోవా రాష్ట్రాల సీఎం హిమంత బిశ్వశర్మ, ప్రమోద్‌ సావంత్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బీఎల్‌ వర్మ లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఆయా ప్రాంతాల్లోని ముఖ్యమైన దేవాలయాలు, పుణ్యక్షేత్రాల్లో పూజలు చేశాక.. రోడ్‌షోలు, మినీ సభలు, కార్నర్‌ మీటింగ్‌లు నిర్వహించారు. ఆయా ప్రాంతాల బీజేపీ సీనియర్‌ నేతలు వీటిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు ప్రజలను, బీజేపీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు.

రాష్ట్రం నుంచి ఢిల్లీకి సూట్‌కేసులు..: కిషన్‌రెడ్డి

ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా మక్తల్‌లో కృష్ణానది తీరాన దత్తాత్రేయుడు, కృష్ణమ్మ విగ్రహాలకు పూజలు చేసి బీజేపీ విజయ సంకల్పయాత్రను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. మక్తల్‌ బస్టాండ్‌ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్‌ మీటింగ్‌లో మాట్లాడారు. కేసీఆర్‌ కుటుంబం, నాయకుల దోపిడీ తప్ప తెలంగాణలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేసిందేమీ లేదని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇన్నాళ్లూ కేసీఆర్‌ కుటుంబం దోచుకుంటే.. ఇప్పుడు రాహుల్‌గాంధీ దోచుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ సర్కారు తెలంగాణ ప్రజల సంపదను దోచి ఢిల్లీలో కాంగ్రెస్‌ ఎన్నికల ప్రచారం నిమిత్తం సూట్‌కేసులు పంపిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలపై 'రాహుల్‌ ట్యాక్స్‌' వేస్తున్న పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. అదే కేంద్రంలో తొమ్మిదిన్నరేళ్ల బీజేపీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదన్నారు. కాగా.. 500ఏళ్ల హిందువుల కల రామమందిరాన్ని మోదీ సర్కారు సాకారం చేసిందని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా చెప్పారు. అన్ని పార్టీలు తమ కుటుంబ సభ్యులను అందలం ఎక్కించాలని చూస్తుంటే.. ప్రధాని మోదీ సర్కారు ప్రజల సంక్షేమం కోసం ఆలోచిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ అంటేనే డేంజర్‌: బండి సంజయ్‌

కేసీఆర్‌ అంటేనే డేంజర్‌ అని, ఆయన వల్ల బీజేపీ తీవ్రంగా నష్టపోయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్‌.. పార్లమెంట్‌ ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని కాలం వెళ్లదీయాలని చూస్తోందని మండిపడ్డారు. మంగళవారం తాండూరులో కేంద్ర మంత్రి బీఎల్‌ వర్మ, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సంజయ్‌ కలసి విజయ సంకల్పయాత్రను ప్రారంభించారు. తర్వాత స్ట్రీట్‌ కార్నర్‌ మీటింగ్‌లో సంజయ్‌ మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం జరగడంతోనే.. కేసీఆర్‌ ఎమ్మెల్యేలను పిలిపించుకుని, బీజేపీతో పొత్తు అంటున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు కొంపలు ముంచడం ఒక్కటే పని అని, మళ్లీ ఢిల్లీకి వెళ్లి ఎవరి కొంప ముంచుతారో అర్థంకావడం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మంత్రి బీఎల్‌ వర్మ ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వాల హయాంలో అంతా అవినీతి, అక్రమాలేనని ఆరోపించారు.

కాంగ్రెస్‌ చెప్పేవన్నీ అబద్ధాలే..: హిమంత బిశ్వశర్మ

ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చే హామీలన్నీ అబద్ధాలేనని.. రాహుల్‌గాంధీ రాజకీయాల్లో అబద్ధాలు తప్ప ఏదీ నేర్చుకోలేదని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ ఆరోపించారు. తెలంగాణలో భవిష్యత్తు బీజేపీదేనని, ఎవరితోనూ పొత్తు ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిర్మల్‌ జిల్లా బాసరలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను హిమంత బిశ్వశర్మ ప్రారంభించారు. అనంతరం భైంసాలో నిర్వహించిన సభలో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీలో ఉండే ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎనిమిది మంది అయ్యారని.. రానున్న రోజుల్లో 80మందితో బీజేపీ సర్కారు ఏర్పాటు చేయడం ఖాయమని పేర్కొన్నారు. ప్రధాని మోదీకి తెలుగు అంటే ఇష్టమని, తెలంగాణవాడైన మాజీ ప్రధాని పీవీకి భారతరత్నతో గౌరవించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్, ఎంపీ సోయం బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పది ఎంపీ సీట్లు బీజేపీకే: ప్రమోద్‌ సావంత్‌

పార్లమెంట్‌ ఎన్నికల్లో తెలంగాణలో పది ఎంపీ సీట్లు బీజేపీ కైవసం చేసుకుంటుందని గోవా సీఎం ప్రమోద్‌ సావంత్‌ చెప్పారు. ఆయన యాదాద్రి జిల్లా భువనగిరిలో విజయ సంకల్ప యాత్రను ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌.. అవన్నీ తమ కుటుంబానికే ఇచ్చుకున్నాడని విమర్శించారు. కాంగ్రెస్‌ అబద్ధపు గ్యారంటీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాగా.. దేశంలో ప్రధాని మోదీ శకం నడుస్తోందని బీజేపీ సీనియర్‌ నేత ఈటల రాజేందర్‌ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భువనగిరి కోట కేంద్రబిందువని.. ఇక్కడ బీజేపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

తమిళనాటా 'సిద్ధం' వైరల్‌

తమిళ మీడియాలో మార్మోగిన రాప్తాడు సభ

- జన సునామీని కళ్లకు కట్టినట్టు చూపిన చానళ్లు, పత్రికలు



என்னைப்போல் தனித்து போட்டியிட தயாரா?

తమిళ పత్రిక దినకరన్‌లో మంగళవారం ప్రచురితమైన వార్త

సాక్షి,చెన్నై: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన వైఎస్సార్‌ సీపీ 'సిద్ధం' సభకు తమిళనాడులోని ప్రముఖ వార్తా చానళ్లు, పత్రికల్లోనూ ప్రముఖ ప్రాధాన్యం లభించింది. సభకు తరలివచ్చిన జన సందోహ దృశ్యాలను అక్కడి చానళ్లు ఆది, సోమ, మంగళవారాల్లో పదేపదే చూపించాయి. తమిళ మీడియా ఏపీ సీఎం వైఎస్‌ జగన్‌ అమలు చేస్తున్న నవరత్నాలకు తొలి నుంచి ప్రాధాన్యం ఇస్తోంది. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి సంబంధించిన కథనాలు, వార్తలకు ప్రముఖంగా చోటు కల్పిస్తోంది. ఫలితంగా తమిళనాడులోని తెలుగు వారే కాకుండా తమిళులూ వైఎస్‌ జగన్‌కు అభిమానులుగా మారారు. సామాజిక మాధ్యమాల్లో తమకూ ఇలాంటి సీఎం కావాలన్న నినాదాలతో పోస్టులను వైరల్‌ చేస్తున్నారు. ఆది, సోమ, మంగళవారాల్లో పుదియ తలైమురై, సన్‌ న్యూస్, పాలిమర్‌ తదితర చానళ్లు రాప్తాడు జన సునామీని కళ్లకు కట్టినట్టు వార్తలను ప్రసారం చేశాయి. ఓ రాజకీయ సభకు 12 లక్షల మందికిపైగా జనం రావడం ఇదే ప్రప్రథమమని పుదియ తలైమురై కితాబిచ్చింది. దినకరన్‌ వంటి ప్రముఖ వార్తా పత్రికలూ సిద్ధం సభ జనసందోహం ఫొటోలను ప్రముఖంగా ప్రచురించాయి. కొన్ని యూట్యూబ్‌ ఛానళ్లూ సభ వీడియోలను వైరల్‌ చేశాయి.

రాష్ట్ర కేబినెట్‌ విస్తరణపై ఫోకస్‌

ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌తో రేవంత్, భట్టి చర్చలు

- లోక్‌సభ అభ్యర్థులు, నామినేటెడ్‌ పోస్టుల భర్తీపై కూడా మంతనాలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణే ప్రధానాంశంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో చర్చలు జరిపినట్టు తెలిసింది. మంగళవారం రాత్రి 7 గంటలకు ఈ ఇద్దరూ కేసీ వేణుగోపాల్‌ నివాసానికి వెళ్లి కలిశారు. సుమారు గంటకుపైగా భేటీ అయి.. పార్టీకి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. కేబినెట్‌ విస్తరణతోపాటు లోక్‌సభ టికెట్ల కేటాయింపు, నామినేటెడ్‌ పోస్టుల భర్తీపైనా వారు మంతనాలు జరిపినట్టు తెలిసింది.

కేబినెట్‌లో చోటు ఎవరికి?

మంత్రివర్గంలో మరో ఆరుగురికి చోటు దక్కనుంది. ప్రస్తుతమున్న కేబినెట్‌లో కొన్ని జిల్లాలకే ప్రాతినిధ్యమున్న నేపథ్యంలో.. ఇప్పుడు ఏయే జిల్లాలకు చెందిన, ఏ నేతలకు ప్రాతినిధ్యం కల్పించాలన్న దానిపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్, భట్టి చర్చించినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో తమ తమ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ తీసుకువచ్చిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలా? సామాజిక సమీకరణాల మేరకు ఇవ్వాలా? అన్నదీ ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి రావడానికి ఆసక్తి చూపుతున్న నేతల అంశంపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దింపే అభ్యర్థుల ఎంపికపైనా నేతలు మంతనాలు జరిపినట్టు సమాచారం. కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల కోసం తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో.. ఎవరెవరికి సీటు కేటాయించాలనే అంశంపై కేసీ వేణుగోపాల్‌ పలు సలహాలు, సూచనలు చేసినట్టు తెలిసింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి, ఇకపై వచ్చేవారికి సీట్ల సర్దుబాటుపైనా దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. ఇప్పటికే కొన్ని నామినేటెడ్‌ పోస్టులను భర్తీ చేశారు. ఇంకా భర్తీ చేయాల్సి ఉంది. దీనిపైనా రాష్ట్ర నేతలకు కేసీ వేణుగోపాల్‌ ఒక స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం కోసం సోనియా, రాహుల్, ప్రియాంకతోపాటు అగ్ర నేతలు పర్యటించేలా చూడాలని వేణుగోపాల్‌ను రేవంత్, భట్టి కోరినట్టు సమాచారం. కాగా.. సోమవారం హైదరాబాద్‌ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలసి మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తిరుగుప్రయాణమయ్యారు.

లెంపలేసుకుని యాత్ర చేయండి

బీజేపీపై సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను చేపట్టకముందే గత పదేళ్లలో రాష్ట్ర ప్రజలకు చేసిన అన్యాయాలకు ఆ పార్టీ నేతలు లెంపలేసుకోవాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. కొందరు తమ సొంత రాజకీయ ఆరాటాన్ని పోరాటమనుకుంటున్నారని, యాత్రల పేరుతో హడావుడి చేయాలనుకుంటున్నారని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన ఎద్దేవా చేశారు. సంకల్పమనేది చాలా పవిత్రమైన మాట అని, ఆ సంకల్పాన్ని ప్రచార ఆర్భాటం, డాంబికాల కోసం కాకుండా తెలంగాణ ప్రజల అభివృద్ధి, భవిష్యత్‌ కోసం బీజేపీ నేతలు తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్రంలో మంత్రిగా ఉన్నారని, పాలమూరు జిల్లా నుంచి డీకే అరుణ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారని, ఈ ఇద్దరి ఇత్తడి కిరీటాలతో తెలంగాణ ప్రజలకు ఒరిగింది శూన్యమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ప్రజల కోసం ఫలానా ప్రాజెక్టు తెచ్చామని, ఫలానా అభివృద్ధి చేశామని చెప్పే దమ్ము, ధైర్యం బీజేపీ నేతలకు ఉన్నాయా? అని ప్రశ్నించారు.

నోటిఫికేషన్ల రద్దు... రేవంత్‌ కుట్రే

- గ్రూప్‌–1 నోటిఫికేషన్‌ వెనుక కోచింగ్‌ సెంటర్ల మాఫియా
- బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌ ధ్వజం



సాక్షి, హైదరాబాద్‌: గతంలో నాటి కేసీఆర్‌ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లను రద్దు చేసి వాటినే తిరిగి కొత్త నోటిఫికేషన్లుగా పేర్కొంటూ లబ్ధి పొందేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్‌వీ) అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌ యాదవ్‌ విమర్శించారు. కొత్త నోటిఫికేషన్ల జారీకి బదులుగా పాత నోటిఫికేషన్ల షెడ్యూల్‌నే కొనసా గిస్తూ పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్‌ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో గెల్లు శ్రీనివాస్‌ మీడియాతో మాట్లాడారు. కొత్త నోటిఫికేషన్ల జారీతో నిరుద్యోగులపై ఆర్థిక భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థులు మళ్లీ కోచింగ్‌ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తాజాగా జారీ చేసిన గ్రూప్‌–1 పరీక్ష నోటిఫికేషన్‌ వెనుక కోచింగ్‌ సెంటర్ల మాఫియా ఉందనే అనుమానం ఆయన వ్యక్తం చేశారు. గ్రూప్‌–1 పరీక్ష నిర్వహణపై సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసును పట్టించుకోకుండా పదుల సంఖ్యలో పోస్టులను కలుపుతూ నోటిఫికేషన్‌ ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మోసపూరిత ప్రకటనలతో నిరుద్యోగులను నమ్మించి అధికా రంలోకి వచ్చిన రేవంత్‌ నేటికీ జాబ్‌ క్యాలెండర్‌ ప్రకటనపై నిర్ణయం తీసుకోలేదన్నారు. గతంలో జాబ్‌ క్యాలెండర్‌ గురించి ప్రస్తావించిన కోదండరాం ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌ సన్నాహక సమావేశాలు

నెలాఖరులోగా లోక్‌సభ సన్నద్ధత భేటీల పూర్తికి యోచన

మంగళవారం 'షాద్‌నగర్‌' పార్టీ శ్రేణులతో హరీశ్‌రావు సమీక్ష

- విదేశాల నుంచి తిరిగొచ్చాక సమావేశాల్లో పాల్గొననున్న కేటీఆర్‌
- ఈ భేటీలు ముగిశాక.. తెలంగాణభవన్‌లో విస్తృతస్థాయి సమావేశం
- బీఆర్‌ఎస్‌ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్‌



సాక్షి, హైదరాబాద్‌: అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాయిదాపడిన భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్‌) నియోజకవర్గ స్థాయి సమీక్ష, లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యాయి. వాస్తవానికి గత నెల 27వ తేదీనే ఈ భేటీలను మొదలుపెట్టారు. ఫిబ్రవరి 10 నాటికి పూర్తి చేయాలని భావించారు. కానీ 40కిపైగా నియోజకవర్గాల్లో ముగిశాక.. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాయిదాపడ్డాయి. మంగళవారం నుంచి వాటిని పునః ప్రారంభించిన బీఆర్‌ఎస్‌.. ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని భావిస్తోంది. దీనిపై సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ ఎమ్మెల్యేలకు బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది. మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం జరిగిన షాద్‌నగర్‌ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. విదేశ పర్యటనలో ఉన్న కేటీఆర్‌ తిరిగొచ్చాక ఈ భేటీల్లో పాల్గొననున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్షలు ముగిశాక.. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ ఆధ్వర్యంలో.. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతో తెలంగాణ భవన్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు బీఆర్‌ఎస్‌ వర్గాలు తెలిపాయి. మార్చి మొదటివారంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదలవుతుందని భావిస్తున్న నేపథ్యంలో.. ఆలోగానే కీలక నేతలకు కేసీఆర్‌ దిశానిర్దేశం చేయనున్నట్టు వివరించాయి.

నియోజకవర్గ స్థాయిలోనూ పోస్టుమార్టం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పరిస్థితిపై బీఆర్‌ఎస్‌ పోస్టుమార్టం మొదలుపెట్టింది. జనవరి 3 నుంచి 22వ తేదీ వరకు మూడు విడతల్లో 17 లోక్‌సభ సెగ్మెంట్లపై సుదీర్ఘంగా సమీక్షించిన పార్టీ ముఖ్యులు.. నేతలు, కార్యకర్తల నుంచి అందిన ఫీడ్‌బ్యాక్‌ను నివేదికల రూపంలో కేసీఆర్‌కు అందజేశారు. తర్వాత లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమావేశాలతో లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావడంపై బీఆర్‌ఎస్‌ దృష్టి సారించింది. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 మధ్య రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి భేటీలు జరపాలని నిర్ణయించింది. 40కి పైగా సెగ్మెంట్ల భేటీలు ముగిశాయి. వాయిదాపడిన మిగతా నియోజకవర్గాల సభలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పార్టీ అధినేత కేసీఆర్‌ తాజాగా ఆదేశించారు.

లోక్‌సభ ఎన్నికల తర్వాతే సంస్థాగత కమిటీలు

పార్టీకి 65 లక్షలకుపైగా క్రియాశీల, సాధారణ సభ్యత్వమున్నా.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు లేకపోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో నష్టం జరిగినట్టు బీఆర్‌ఎస్‌ గుర్తించింది. పార్టీని అన్నిస్థాయిల్లో బలోపేతం చేసేందుకు సంస్థాగత కమిటీల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడటంతో.. ఆ తర్వాతే సంస్థాగత కమిటీల ఏర్పాటు ఉంటుందని బీఆర్‌ఎస్‌ వర్గాలు చెప్తున్నాయి.

వ్యూహాలు, అభిప్రాయాలు స్వీకరించి..

ఈ సమావేశాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తల సలహాలు, అభిప్రాయాలను స్వీకరిస్తున్నారు. ఈ భేటీల్లో వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.తారక రామారావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్‌.రమణ తదితరులు పాల్గొననున్నారు. సమావేశాల్లో అందిన సూచనలు, అభిప్రాయాలను పార్టీ అధినేత కేసీఆర్‌కు నివేదించనున్నారు.

రాజకీయాలకు రైతులను బలిచేయొద్దు

రుణమాఫీ చేసి, రైతుబంధు డబ్బులు వేయాలి

- మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

షాద్‌నగర్‌ (రంగారెడ్డి): రాజకీయాల కోసం రైతులను బలి చేయొద్దని, రుణమాఫీ చేయడంతోపాటు రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...చావు నోట్లో తల పెట్టి కేసీఆర్‌ తెలంగాణను సాధించారన్నారు. తెలంగాణ అమరవీరులకు ఒక్కనాడు పువ్వు పెట్టని, జై తెలంగాణ అనని, ఉద్యమకారులపైకి తుపాకీ పట్టుకుని వెళ్లిన వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తుచేసుకుంటే బాధేస్తోందని తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను వదిలే ప్రసక్తే లేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చినా..బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని మండిపడ్డారు.

పాలమూరును 80 శాతం పూర్తి చేశాం

పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి బీఆర్‌ఎస్‌ హయాంలోనే 80శాతం పనులు పూర్తి చేశామని, కాల్వలు తవ్వితే పొలాలకు నీళ్లు వస్తాయని, ఈ పని పూర్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్‌ ప్రభుత్వంపైనే ఉందని హరీశ్‌ తెలిపారు. పాలమూరు ప్రాజెక్టు విషయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు మోసం చేశాయని, జాతీయ హోదా సాధించడంలో ఈ రెండు పార్టీలు విఫలమయ్యాయని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లి కేఆర్‌ఎంబీకి ప్రాజెక్టుకు అప్పగించారన్నారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో 1984 నుంచి 2014 వరకు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్‌ ద్వారా రైతుకు సాగు నీరు అందించలేదని అన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 36 లక్షల ఎకరాలకు నీరందించిందని తెలిపారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జైకా రుణం రూ.1,336 కోట్లు

- ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం
- ఢిల్లీలో కేంద్రంతో జైకా ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో భాగంగా 'జపనీస్ అఫీషియల్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్'(ఓడీఏ) కింద రూ.1,336 కోట్ల రుణాన్ని అందించేందుకు జపాన్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ ఏజెన్సీ (జైకా) ముందుకు వచ్చింది. రాష్ట్రంలో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్ ఈకోసిస్టమ్‌ను ప్రోత్సహించడం ద్వారా ఉద్యోగావకాశాల కల్పన, ఆర్థికాభివృద్ధి సవాళ్లను అధిగమించేందుకు ఈ నిధులు దోహదపడనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి వికాస్ షీల్, జైకా ఇండియా ముఖ్యప్రతినిధి సైటో మిట్సునోరీ మంగళవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. పట్టణ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలే కాకుండా మహిళలు, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ప్రాజెక్టులో భాగంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించడం..స్టార్టప్‌లు, వాటి వాణిజ్యానికి, వ్యాపార విస్తరణకు సహకరించడమనే మూడు దశల్లో సహకారం అందించనున్నారు.

రాష్ట్ర ఐటీ శాఖ ద్వారా ఇక్కడ అమలు

తెలంగాణలో జపనీస్ స్టార్టప్‌లు పెట్టుబడులు పెట్టేందుకు సహకరించడంలో జైకా కీలకంగా వ్యవహరించనుంది. ఆ స్టార్టప్‌లకు ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీఓసీ) నిర్వహించనుంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పరిశోధనలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర సామాజిక–ఆర్థికాభివృద్ధికి సహకరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని జైకా ఇండియా ముఖ్యప్రతినిధి సైటో మిట్సునోరీ తెలిపారు. ఓడీఏ రుణం ద్వారా ఇలాంటి ప్రాజెక్టును చేపట్టడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి అని వెల్లడించారు. రాష్ట్ర ఐటీ శాఖ ద్వారా ఈ ప్రాజెక్టును తెలంగాణలో అమలు చేయనున్నారు.

ఆ పని కాలాన్ని సర్వీస్ పీరియడ్‌గా గుర్తించాలి

- పంచాయతీరాజ్ కమిషనర్‌కు జేపీఎస్‌ల వినతి

సాక్షి, హైదరాబాద్: తాము నాలుగేళ్ల పాటు పనిచేసిన కాలాన్ని సర్వీస్ పీరియడ్‌గా గుర్తించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌కు విజ్ఞప్తిచేశారు. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని, స్పోర్ట్స్ కోటా జేపీఎస్‌లకు న్యాయం చేయాలని కోరారు. మంగళవారం పీఆర్ కమిషనర్‌కు టీఎస్‌పీఎఫ్ కోశాధికారి శశిధర్ ఆధ్వర్యంలో పలు జిల్లాల సంఘ అధ్యక్షులు వినతిపత్రం అందించారు. ప్రసూతి సెలవులపై వెళ్లిన జేపీఎస్‌లకు జీతాలతో పాటు పెండింగ్‌లో ఉన్న కొందరి జేపీఎస్‌ల జీతాల చెల్లింపు విషయం కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ వివరాలను సమర్పిస్తే వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు టీఎస్‌పీఎఫ్ నేతలు తెలిపారు. తన దృష్టికి తీసుకొచ్చిన జేపీఎస్‌ల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఆమె చెప్పారన్నారు. అలాగే మంగళవారం ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమంలో టీఎస్‌పీఎఫ్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు శశిధర్ తెలిపారు.

వరదలతో బ్యారేజీలకు ముప్పు!

అన్నారం, మేడిగడ్డకు మరింత నష్టం జరిగే అవకాశం

- నష్టనివారణ చర్యలపై నీటిపారుదల శాఖ దృష్టి
- రెండు బ్యారేజీలను సందర్శించిన డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్
- త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం: వచ్చే వానాకాలంలో గోదావరికి వచ్చే వరదలతో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు మరింత నష్టం వాటిల్లకుండా పరిరక్షించడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ దృష్టిసారించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ చట్టం కింద ఏర్పాటైన 'డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్' మంగళవారం రెండు బ్యారేజీలను సందర్శించింది. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(అడ్మిన్) అనిల్ కుమార్ నేతృత్వంలో డిజైన్ ఎక్స్‌పర్ట్ టి.రాజశేఖర్, సీఈ సీడీఓ, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్‌ఓ) ఇంజనీర్ల బృందం రెండు బ్యారేజీలను పరిశీలించిన అనంతరం సత్వరంగా తీసుకోవాల్సిన నష్టనివారణ చర్యలపై చర్చించింది. గోదావరిలో మళ్లీ 20 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పోటెత్తితే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందనే అనుమానాలు ఉండటంతో ఈ బృందం అక్కడ పర్యటించింది. నష్టనివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. దీని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అన్నారం బ్యారేజీకి శాశ్వత మరమ్మతులు నిర్వహించిన తర్వాతే నీళ్లు నింపాలని గతంలోనే ఎన్డీఎస్‌ఏ సూచించింది. మరమ్మతులు జరిగే వరకు బ్యారేజీలో నీళ్ల నిల్వ చేసే అవకాశం లేదు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఇంజనీర్లతో మాట్లాడుతున్న నిపుణుల బృందం

మళ్లీ అన్నారం బ్యారేజీకి ఎన్డీఎస్‌ఏ

ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకు కుంగిపోగా, మళ్లీ భారీ వరదలొస్తే ఇతర బ్లాకులు సైతం ప్రమాదానికి లోనయ్యే అవకాశం ఉన్నట్టు నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు నెలల్లో అన్నారం బ్యారేజీకి రెండు పర్యాయాలు బుంగలు ఏర్పడి పెద్ద మొత్తంలో నీళ్లు లీకయ్యాయి. అన్నారంబ్యారేజీ పునాదుల (రాఫ్ట్) కింద నిర్మించిన కటాఫ్ వాల్స్‌కి పగుళ్లు వచ్చి ఉంటాయనడంలో అనుమానాలు లేవని.. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ గత అక్టోబర్‌లో బ్యారేజీని పరిశీలించిన అనంతరం తన నివేదికలో చెప్పింది. బ్యారేజీకి నిర్దిష్టంగా లీకేజీలు పునరావృతం కావడాన్ని చూస్తే ఎగువ, దిగువ కటాఫ్ వాల్స్‌లో ఏదో ఒకదానికి లేదా రెండింటికీ పగుళ్లు వచ్చి ఉంటాయని స్పష్టం చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ దక్షిణాది ప్రాంతీయ డైరెక్టర్ ఆర్.తంగమణి, కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) హైదరాబాద్ డైరెక్టర్లు ఎం.రమేశ్‌కుమార్, పి.దేవేందర్ రావు కమిటీ అప్పట్లో ఈ నివేదిక ఇచ్చింది. గత శుక్రవారం అన్నారం బ్యారేజీకి మళ్లీ బుంగలు పడటంతో ఎన్డీఎస్‌ఏ సూచన మేరకు బ్యారేజీని పూర్తిగా ఖాళీ చేశారు. ఈ వారం చివరిలోగా నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం రెండోసారి అన్నారం పరిశీలనకు రానుంది. కటాఫ్‌వాల్స్‌కి లేదా కటాఫ్‌వాల్స్–ర్యాఫ్ట్ మధ్య పగుళ్లు ఎక్కడ వచ్చాయో నిర్ధారించడానికి గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్స్(జీపీఆర్) వంటి సాంకేతిక పద్ధతులను వినియోగించాలని గతంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫారసు చేయగా, ఇప్పటివరకు అలాంటి చర్యలేమీ తీసుకోలేదు.

- గురుకుల విద్యా సంస్థల్లో అర్హులైన టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లకు తక్షణమే పదోన్నతి కల్పించాలని గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది.



“చాలామంది వస్తుగతంగా పేదవాళ్లు అయినప్పటికీ తమ దృక్పథం కారణంగా చాలా ధనవంతులు. అదే సమయంలో చాలామంది వస్తుగతంగా అత్యంత ధనవంతులు అయినప్పటికీ, ఉన్నది ఎన్నడూ చాలని కారణంగా నిరుపేదలుగా ఉండిపోతారు.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 21 ఫిబ్రవరి 2024

సరికొత్త సాంకేతిక సవాలు

మరో సంచలనాత్మక సాంకేతిక ప్రయోగం జరిగింది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో ఒకడుగు ముందుకేసి, విప్లవాత్మకమైన ఛాట్‌బాట్ ‘ఛాట్ జీపీటీ’ని సృష్టించిన ‘ఓపెన్ ఏఐ’ సంస్థ గురువారం మరో ముందంజ వేసింది. సరికొత్త జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జెన్‌ఏఐ) మోడల్‌ను ఆవిష్కరించింది. రాతపూర్వక సమాచారాన్ని వీడియోగా మార్చే ‘సోరా’ అనే ఈ మోడల్ ఆసక్తి రేపుతోంది. సోరా అంటే జపనీస్‌లో ఆకాశమని అర్థం. సృజనకు ఆకాశమే హద్దంటూ ఏఐ వినియోగంతో చేసిన ఈ కొత్త ప్రయోగం ఏ మంచికి, ఎంత చెడుకు దారితీస్తుందనే చర్చ జరుగుతోంది.

యూజర్ ఇచ్చిన సమాచారానికి కట్టుబడి ఉంటూ, నాణ్యతలో రాజీ లేకుండా గరిష్ఠంగా ఒక నిమిషం నిడివి వీడియోలను సృష్టించడం ‘సోరా’ ప్రత్యేకత. కోరినట్టుగా జెన్‌ఏఐ వేదికలు బొమ్మల్ని సృష్టించడం, సమాచార ప్రతిస్పందనలు అందించడమనేది కొన్నేళ్ళుగా జరుగుతున్నదే, అంతకంతకూ మెరుగవుతున్నదే. టెక్స్ట్ నుంచి బొమ్మలను ఇప్పటికే సృష్టిస్తున్నప్పటికీ వీడియో తయారీ సంక్లిష్టమైనది. అందుకే, ఆ పని వెనుకబడింది. తీరా ఇప్పుడు ఓపెన్‌ఏఐ ప్రయోగాత్మకంగా ‘సోరా’ను ముందుకు తెచ్చింది. దాని పని తీరుకు ఉదాహరణగా మంచు కురుస్తున్న టోక్యో నగర వీధుల దృశ్యాల్ని సృష్టించింది. వాస్తవికమని భ్రమింపజేస్తున్న ఆ వీడియోను చూసి అబ్బురపడనివారు లేరు.

నిజానికి, టెక్స్ట్ నుంచి వీడియో సృష్టి అనే సాంకేతిక ప్రయోగం బరిలోకి ఇప్పటికే కొన్ని ఇతర సంస్థలూ ప్రవేశించాయి. గూగుల్, మేటా, అంకురసంస్థ రన్‌వే ఎంఎల్ లాంటివి ఈ సాంకేతికతను ఇప్పటికే చూపాయి. గూగుల్ ‘లూమియర్’ గత నెలలో విడుదలైంది. సమాచారం, లేదంటే ఛాయా చిత్రాల ఆధారంగా 5 సెకన్ల నిడివి వీడియోను సృష్టించడాన్ని ‘లూమియర్’ చేసి చూపింది. అలాగే, రన్‌వే, పికా లాంటి ఇతర సంస్థలు సైతం తమవైన వీడియో సృష్టి మోడల్స్‌ను ముందుకు తెచ్చాయి. నిమిషం నిడివి గల వీడియోలు సృష్టించే ‘సోరా’ విషయానికొస్తే, సంక్లిష్ట సన్నివేశాలు, పలు రకాల పాత్రలు, ప్రత్యేక తరహా కదలికలు, కచ్చితమైన నేపథ్యంతో కూడిన దృశ్యాలు ఈ ‘సోరా’తో సాధ్యమట. వస్తువులనూ, మనుషులనూ అచ్చంగా భౌతిక ప్రపంచంలో ఉన్నట్టే చూపుతుందట.

అయితే, ఈ మోడల్ ఇంకా నిర్దుష్టంగా తయారుకాలేదనీ, సంక్లిష్ట సమాచారమిస్తే గందరగోళ పడవచ్చనీ దాన్ని రూపొందించిన ఓపెన్‌ఏఐ సైతం ఒప్పుకుంటోంది. అలాగే, కుడి, ఎడమల విషయంలో కాస్తంత తడబాటుకు గురికావడం లాంటి బలహీనతలూ ‘సోరా’లో లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో ఇది తప్పుడు, విద్వేషపూరిత సమాచారాలకు వేదిక కాకుండా ఉండేలా... భద్రతా నిపుణులతో, విధాన నిర్ణేతలతో ఓపెన్‌ఏఐ చర్చించనుంది. అందుకే, ప్రస్తుతానికి ‘సోరా’ను సామాన్యులకు అందుబాటులో ఉంచలేదు. విజువల్ ఆర్టిస్టులు, డిజైనర్లు, సినీ రూపకర్తలకు మాత్రం దీన్ని వాడుకొనే వీలు కల్పించింది. సృజనశీలురకు మరింత ఉపయోగపడేలా చేయాల్సిన మార్పులు చేర్పులపై వారి స్పందన తీసుకోనుంది.

మొత్తానికి, ఏఐతో ప్రపంచం మారిపోతోంది. గత రెండు దశాబ్దాల్లో ఇంటర్నెట్, సోషల్ మీడియా రాకతో అపరిమిత డేటా సేకరణ, సమాచార విప్లవం వచ్చింది. ఇటీవలి జెన్‌ఏఐ పుణ్యమా అని ఆ భారీ డేటాను ఆసరాగా చేసుకొని, కీలక నిర్ణయాలు తీసుకొనేలా ఏఐ వ్యవస్థలు, అప్లికేషన్ల అభివృద్ధి జరిగింది. దాదాపు 30 వేల కోట్ల పదాలను వాడుకొని ఛాట్‌జీపీటీ సిద్ధమైంది. సుమారు 580 కోట్ల చిత్రాలు – రాతపూర్వక సమాచారం ఆధారంగా ఏఐ ఆధారిత ఇమేజ్–జనరేటింగ్ అప్లికేషన్లు డాల్–ఇ, మిడ్‌జర్నీ లాంటివి శిక్షణ పొందాయి. ఏఐ వినియోగం పలు రంగాల్లో ఉపయుక్తమైనా, దాని వల్ల సమాజానికి సవాళ్ళూ అధికమే. సృజనశీలుర కృషిని అనుమతి లేకుండానే ఏఐ మోడల్స్ శిక్షణకు వాడుకోవడంపై పెద్ద కంపెనీలపై పలువురు కేసులేశారు. ఏఐని సర్వసిద్ధం చేయడానికి ఇప్పుడున్న డేటా సరిపోక, కొరత వస్తుందనీ అంచనా. ట్విట్టర్‌ను కొన్న ఎలాన్ మస్క్ నుంచి ప్రసిద్ధ రచయిత యువల్ నోవా హరారీ దాకా పలువురు ‘భారీ ఏఐ ప్రయోగాలకు విరామం ఇవ్వా’లంటూ నిరుడు బహిరంగ లేఖ రాయడం గమనార్హం.

అమెరికా నుంచి ఇండియా దాకా ఎన్నికలు జరగనున్న వేళ ఈ ఏఐ సృష్టి వీడియోలతో మోసపుచ్చే ప్రమాదం ఉంది. తప్పుడు ప్రచారంతో నైతిక, సామాజిక సమస్యలు తలెత్తుతాయి. ప్రతి రంగంలో ఏఐతో చిక్కులు రాక మానవు. అయినా ఇప్పటికీ ఏఐ పర్యవేక్షణ టెక్ సంస్థల చేతిలోనే నడుస్తోంది. ప్రభుత్వాలింకా నిద్ర మేల్కోలేదు. యూరోపియన్ యూనియన్ మాత్రం డిసెంబర్‌లో ఒక ఒప్పందం చేసుకుంది. ప్రపంచంలోనే తొలిసారిగా సమగ్రమైన ఏఐ నిబంధనలవి. అయితే, తుది ఆమోదం పొందిన రెండేళ్ళ తర్వాత కానీ చట్టం అమలులోకి రాదు. ఇక, ఏఐ దుర్వినియోగంపై రచ్చతో ఓపెన్‌ఏఐ, మరో 19 టెక్ సంస్థలు ఎన్నికల డీప్‌ఫేక్‌ల నిరోధానికి కృషి చేస్తామన్నాయి.

పైకి ఏమంటున్నా, సోరా లాంటి ఏఐ టూల్స్ శిక్షణకు ఎక్కడ నుంచి, ఎంత వీడియోలు వాడుకున్న సంగతి కూడా ఓపెన్‌ఏఐ లాంటి సంస్థలు బయటపెట్టడం లేదు. ఛాట్‌జీపీటీ లాంటి జెన్‌ఏఐ టూల్స్ శిక్షణకై తమ కాపీరైట్ ఉల్లంఘించారంటూ ఇప్పటికే పలువురు రచయితలే కాదు, సాక్షాత్తూ న్యూయార్క్ టైమ్స్ సైతం ఓపెన్‌ఏఐ, దాని వ్యాపార భాగస్వామి మైక్రోసాఫ్ట్‌పై కేసులు పెట్టాల్సి వచ్చింది. అమెరికన్ సంపన్నులు, వారి వెంట చైనీయులు ఇప్పటికే ఏఐ రేసులోకి దిగారు. ప్రస్తుతానికి భారతీయులం వెనుకబడివున్నా, అనివార్యమవుతున్న ఈ మార్పును అందిపుచ్చుకోక తప్పదు. ఏఐ ఓ సరికొత్త పారిశ్రామిక విప్లవానికి దారి తీస్తుందని నిపుణుల అభిప్రాయం. అందుకే, కేవలం ఏఐ వినియోగదారులుగా మిగిలిపోకుండా, ఏఐ ఆవిష్కర్తలం కావాలన్నది వారి సూచన.

నిజమైన తపస్వి విద్యాసాగరులు



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ సమాధిని పొంది మనందరినీ విషాదంలో ముంచెత్తారు. జ్ఞానం, కరుణ, సేవల త్రివేణీ సంగమంగా పూజ్య ఆచార్యులు ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన నిజమైన తపస్వి. ఆయన జీవితం భగవాన్ మహావీరుని ఆదర్శాలకు ప్రతీక. జైన సామాజిక వర్గంలో ఆయన ఉన్నత స్థానంలో నిలిచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాలేదు. మతాలు, ప్రాంతాలు, సంస్కృతులకు అతీతంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చేవారు. ప్రకృతికి నష్టాన్ని తగ్గించే జీవన విధానానికి ఆయన పిలుపునిచ్చారు. నిబద్ధత పునాదులపైనే ఒక బలమైన దేశం నిర్మితమవుతుందని విశ్వసించారు.

లోతైన జ్ఞానం, ఎల్లలెరుగని దయ, మానవాళిని ఉద్ధరించాలన్న అచంచలమైన నిబద్ధతతో ఆచార్య విద్యాసాగర్ జీ (10 అక్టోబర్ 1946 – 18 ఫిబ్రవరి 2024) జీవితం ఆధ్యాత్మికంగా సుసంపన్నం అయింది. అనేక సందర్భాల్లో ఆయన ఆశీస్సులు అందుకున్న గౌరవం నాకు దక్కింది. అందువలన, నాతో సహా లెక్కలేనన్ని ఆత్మలకు మార్గాన్ని ప్రకాశవంతం చేసిన మార్గదర్శక కాంతిని కోల్పోయినట్లుగా నేను తీవ్రమైన లోటును అనుభవిస్తున్నాను. ఆయన అనురాగం, ఆప్యా యత, ఆశీస్సులు కేవలం సుహృద్భావ సంకేతాలు మాత్రమే కాదు, ఆయనతో సన్నిహితంగా మెలిగిన అదృష్టవంతులందరి మీదా ఆధ్యాత్మిక శక్తిని ప్రసరింపజేసి, స్ఫూర్తిని కలిగిస్తాయి.

ఆయన జీవితం జైన మత మూల సూత్రాలకు ఉదాహరణగా నిలిచింది. దాని ఆదర్శాలను తన సొంత చర్యలు, బోధనల ద్వారా ప్రతిబింబింప జేశారు. సకల జీవరాశుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, జైన మతానికి జీవితం పట్ల ఉన్న అమితమైన గౌరవానికి అద్దం పట్టింది. ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో నిజాయితీకి జైన మతం ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తూ ఆయన తన జీవితాన్ని గడిపారు. సరళమైన జీవనశైలిని అనుసరించారు. జైనమతం, భగవాన్ మహావీరుని జీవితం నుంచి ప్రపంచం ప్రేరణ పొందడానికి ఆయన వంటి మహానుభావులే కారణం. ఆధ్యాత్మిక జాగృతికి, ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారు.

విద్య ఆయన హృదయానికి చాలా దగ్గరైన రంగం. విద్యాధర్ (ఆయన చిన్ననాటి పేరు) నుండి విద్యాసాగర్ వరకు ఆయన చేసిన ప్రయాణం జ్ఞానాన్ని సంపాదించడం, అందించడంలో లోతైన నిబద్ధతతో సాగింది. న్యాయమైన, జ్ఞానవంతమైన సమాజానికి విద్య మూలస్తంభమని ఆయన ప్రగాఢ విశ్వాసం. వ్యక్తులను శక్తిమంతం చేయడానికీ, లక్ష్యం, సహకారంతో కూడిన జీవితాలను గడపడానికీ వీలు కల్పించే సాధనంగా ఆయన జ్ఞానాన్ని సమర్థించారు. విద్యను వ్యక్తులకు సాధికారత కల్పించి ఒక ప్రయోజనం, సేవాభావంతో జీవితం గడిపేందుకు దోహదపడే సాధనంగా ఆయన భావించారు. వారి బోధనలు స్వీయ అధ్యయనం, స్వీయ అవగాహన ప్రాముఖ్యతను నిజమైన జ్ఞానానికి మార్గాలుగా నొక్కిచెప్పాయి. జీవితకాల అభ్యాసం, ఆధ్యాత్మిక ఎదుగుదలలో నిమగ్నం కావాలని వారి అనుచరులకు ప్రబోధించాయి.

మన సాంస్కృతిక విలువలతో ముడిపడిన విద్యను మన యువత పొందాలని విద్యాసాగర్ జీ ఆకాంక్షించారు. నీటి ఎద్దడి వంటి కీలక సవాళ్లకు పరిష్కారం కనుగొనలేక పోయామనీ, గతం నుంచి నేర్చుకున్న పాఠాలకు దూరంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందనీ ఆయన తరచూ చెప్పేవారు. సంపూర్ణ విద్య అనేది నైపుణ్యం, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించేదిగా ఉంటుందని ఆయన విశ్వసించారు. భారతదేశ భాషా వైవిధ్యం పట్ల ఆయన ఎంతో గర్వ పడ్డారు. భారతీయ భాషలను నేర్చుకోవడానికి యువతను ప్రోత్స హించారు. పూజ్య ఆచార్యులు స్వయంగా సంస్కృతం, ప్రాకృతం, హిందీలో విస్తృతంగా రచనలు చేశారు. ఒక సాధువుగా చేరుకున్న శిఖరాలు, భూమిపై ఎంతగా నిలదొక్కుకున్నారు అనేవి ఆయన ప్రతిష్ఠాత్మక రచన ‘మూక్‌మతి’లో స్పష్టంగా కనిపిస్తుంది. తన రచనల ద్వారా అణగారిన వర్గాలకు గళం అందించారు.



సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్: అభివాదం చేస్తున్న నరేంద్ర మోదీ (ఫైల్ ఫొటో)

ఆరోగ్య సంరక్షణ రంగంలో కూడా ఆచార్యుల కృషి చిరస్మరణీయం. ముఖ్యంగా నిరుపేదల నివాస ప్రాంతాల్లో ఆయన అనేక ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ఆయన విధానం సంపూర్ణమైనది. శారీరక శ్రేయస్సును ఆధ్యాత్మిక శ్రేయస్సుతో మిళితం చేస్తుంది. తద్వారా వ్యక్తి మొత్తం అవసరాలను తీరుస్తుంది.

విద్యాసాగర్ జీ దేశ నిర్మాణం పట్ల చూపిన నిబద్ధత గురించి రాబోయే తరాలు విస్తృతంగా అధ్యయనం చేయాలని నేను ప్రత్యేకంగా కోరుతున్నాను. పక్షపాత ఆలోచనలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించాలని ఆయన ప్రజలను ఎల్లప్పుడూ కోరేవారు. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో భాగస్వామ్య వ్యక్తీకరణగా భావించిన ఓటును బలంగా విశ్వసించేవారిలో ఆయన ఒకరు. ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన రాజకీయాలను సమర్థించారు. విధాన రూపకల్పన ప్రజా సంక్షేమం గురించి ఉండాలి కానీ స్వప్రయోజనాల గురించి కాదనీ అనేవారు.

నివాళి

పౌరులకు తమ పట్ల, తమ కుటుంబాల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల ఉండే బాధ్యతల నిబద్ధత పునాదులపైనే ఒక బలమైన దేశం నిర్మితమవుతుందని ఆయన విశ్వసించారు. నిజాయితీ, చిత్త శుద్ధి, స్వావలంబన వంటి సుగుణాలను పెంపొందించుకోవాలని వ్యక్తులను ప్రోత్సహించారు. న్యాయమైన, దయగల, అభివృద్ధి చెందు తున్న సమాజ నిర్మాణానికి అవి అవసరమని భావించారు. మనం వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నందున విధుల పట్ల ఈ ప్రాధాన్యత చాలా ముఖ్యం.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ క్షీణత తీవ్రంగా ఉన్న ఈ కాలంలో, పూజ్య ఆచార్యులు ప్రకృతికి నష్టాన్ని తగ్గించే జీవన విధానానికి పిలుపునిచ్చారు. అదేవిధంగా, మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి ఉన్న అత్యంత ముఖ్యమైన పాత్రను ఆయన గుర్తించారు. వ్యవసాయాన్ని ఆధునికంగా, సుస్థిరంగా మార్చాలని నొక్కి చెప్పారు. జైలు ఖైదీల సంస్కరణకు ఆయన చేసిన కృషి కూడా చెప్పుకోదగినది.

వేల సంవత్సరాలుగా మన నేల ఇతరులకు వెలుగులు చూపించి మన సమాజాన్ని బాగు చేసిన మహానుభావులను అందించింది. సాధువులు, సంఘ సంస్కర్తల ఈ మహోన్నత పరంపరలో విద్యాసాగర్ జీ మహోన్నత వ్యక్తిగా నిలుస్తారు. ఆయన ఏం చేసినా వర్తమానం కోసమే కాకుండా భవిష్యత్తు కోసం కూడా చేసేవారు. గత ఏడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని డోంగర్‌గఢ్‌లో ఉన్న చంద్రగిరి జైన మందిరాన్ని సందర్శించే అవకాశం నాకు లభించింది. అప్పటి సందర్శనే ఆయనతో నా చివరి సమావేశం అవుతుందని నాకు తెలియదు. ఆ క్షణాలు చాలా ప్రత్యేకమైనవి. ఆయన నాతో చాలాసేపు మాట్లాడి, దేశానికి సేవ చేయడంలో నేను చేసిన కృషిని ఆశీర్వదించారు. మన దేశం తీసుకుంటున్న దిశ, ప్రపంచ వేదికపై భారత్‌కు లభిస్తున్న గౌరవం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తాను చేస్తున్న పని గురించి మాట్లాడేటప్పుడు ఉత్సాహం చూపించారు. అప్పుడూ, ఎప్పుడూ, వారి సున్నితమైన చూపులు, నిర్మలమైన చిరునవ్వు... శాంతి, సేవా భావనను కలిగిస్తాయి. ఆయన ఆశీస్సులు మనసుకు ఓదార్పునిచ్చే ఔషధంలా, మనలోని, చుట్టుపక్కల ఉన్న దైవిక ఉనికిని గుర్తుచేసేలా ఉంటాయి.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ లేని లోటును ఆయన గురించి తెలిసిన వారు, ఆయన బోధనలు, జీవితం స్పృశించినవారు శూన్యంగా భావిస్తారు. అయితే, ఆయన వల్ల స్ఫూర్తి పొందినవారి హృదయాల్లో వారు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు. ఆయన స్మృత్యర్థం వారు బోధించిన విలువలను పాటించడానికి మేము కట్టుబడి ఉంటాము. ఈ విధంగా, మనం ఒక గొప్ప ఆత్మకు నివాళులు అర్పించడమే కాకుండా, మన దేశం కోసం, ప్రజల కోసం ఆయన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తాము.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఎక్కడైనా సరే!



కొన్ని రోజుల క్రితం ఇప్పటి తరం ఒక భారతీయ వ్యవస్థాపకుడు తన కంపెనీని శాన్ ఫ్రాన్సిస్కో (అమెరికా)లో ఉంచాలా, ఇండియాలోనా అని అడిగాడు. ఇండియాలో స్టార్టప్ కంపెనీలు వర్ధిల్లుతున్నట్టున్నాయి కాబట్టి, వెనక్కి వెళ్తే బానే ఉంటుందని చెప్పాను.

– పాల్ గ్రాహమ్, అమెరికా సైంటిస్ట్

మరింత విస్తరణ



మా పెట్టుబడులను స్పెయిన్‌లోకి విస్తరింపజేసే పథకాలను ప్రకటించాం. పబ్లిక్, ప్రైవేటు రంగాల్లో బాధ్యతాయుతమైన కృత్రిమ మేధను ప్రోత్సహించడంలో భాగస్వాములం కావడాన్ని కొనసాగిస్తాం.

– సత్య నాదెళ్ల, మైక్రోసాఫ్ట్ సీఈఓ

రావాల్సిన విప్లవం



ఒక ప్లాస్టిక్ సీసా పూర్తిగా భూమిలో కలిసిపోవడానికి 400 ఏళ్లు పడుతుంది. అలాంటిది ప్లాస్టిక్ వ్యర్థాలను వేగంగా తినే ఒక ఎంజైమ్‌ను జపాన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. రీసైక్లింగ్ ప్రక్రియలో ఇది విప్లవాత్మకమైన మార్పును తేగలదు.

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

ఏదీ వద్దు



ఇండియా సిక్కుల మాతృభూమి. మేము అందులో జీవిస్తాం, దాన్ని పాలిస్తాం. ఖలిస్తాన్ వద్దు. హిందూ రాజ్యం వద్దు.

– అశోక్ సింగ్, యాక్టివిస్ట్

అంతేనా?



అసలు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తారా? లేదా బీజేపీ గెలిచిందని అనుకునేసి, మన పనుల్లో మనం పడిపోవాలా?

– రమేశ్ శ్రీవత్స్, సెటైరిస్ట్

జానపద గాథల్లో... సమ్మక్క

ఇంతింతై వటుడింతయై...

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జన జాతరగా ప్రసిద్ధిగాంచిన ‘మేడారం సమ్మక్క జాతర’కు కారకులైన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కూతురు సారలమ్మల పుట్టుపూర్వోత్తరాల గురించి అందుబాటులో గల ఆధారాలతో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. 13వ శతాబ్దానికి చెందిన కాకతీయ రాజు ప్రతాపరుద్రునితో జరిగిన పోరాటంలో కుట్రతో ఒక సైనికుడు దొంగ చాటుగా బల్లెంతో చేసిన దాడిలో సమ్మక్క క్షతగాత్రురాలై చిలకలగుట్ట వద్ద అదృశ్యమైనట్టు జనసామాన్యంలో ప్రచారంలో ఉన్న కథల ద్వారా తెలుస్తోంది.

కానీ కాకతీయ రాజ్య చరిత్రలో మేడారం పోరాటం, సమ్మక్క– పగిడిద్దరాజుల సామంత రాజ్యం గురించిన ప్రస్తావన లేదు. గిరిజనుల ఆశ్రిత కులం వారు డోలీలు. వీరు ‘పడిగె’ అనే త్రికోణాకార గుడ్డపటం సాయంతో గిరిజన పూర్వీకుల చరిత్ర, వీర గాథలను ‘డోలి’ వాయిస్తూ గానం చేస్తారు. మణుగూరు ప్రాంతంలోని గూడెంకు చెందిన డోలి కళాకారుడు ‘సకిన రామచంద్రయ్య’ చెప్పే పడిగె కథ ప్రకారం: పేరంబోయిన కోయ రాజు వంశానికి చెందిన ఆరవ గట్టు సాంబశివ రాజు– తూలు ముత్తి దంపతులకు ఐదుగురు సంతానం – సమ్మక్క పెద్దకూతురు. ఆమెకు యుక్త వయస్సు రావడంతో బస్తరు ప్రాంతానికి వెళ్లి పగిడిద్ద రాజును చూసి ఆయనతో పెళ్లి చేయ నిశ్చయించాడు తండ్రి. మేడారం దగ్గరి కామారం గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు మైపతి అరుణ్ కుమార్ తన క్షేత్ర పర్యటనలు, పూర్వీకుల మౌఖిక కథల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం... కోయత్తూర్ సమాజంలోని ఐదవ గట్టు ‘రాయి బండని రాజు’ వంశానికి చెందిన ఆడబిడ్డ సమ్మక్క.



‘చందా’ ఇంటి పేరు గల రాయి బండాని రాజుకు ఇద్దరు భార్యలు. ఆ రాజుకు వెదురు పొదల వద్ద ముద్దులొలికే పసిపాప కనిపిస్తుంది, ఆ పాపను ఇంటికి తెచ్చి సమ్మక్క అని పేరు పెట్టి పెంచుకున్నారు. ఈ రాజుకు నాగులమ్మ అనే మరో కుమార్తె జన్మించింది. కోయ వారి సంప్రదాయం ప్రకారం తొలిసూరి బిడ్డను ఇంటి వేల్పుగా కొలుస్తారు. అందుకే సమ్మక్క చందా వారి ఇలవేల్పు అయ్యింది. ఈ రెండు కథనాల్లోనూ పగిడిద్దరాజుతో సమ్మక్క వివాహాన్ని ఆమె తండ్రి కుదుర్చుతాడు. అయితే నాటకీయ పరిణామాల మధ్య సమ్మక్క, నాగులమ్మలను ఇద్దరినీ పగిడిద్దరాజు వివాహం చేసుకుంటాడు. స్వాతంత్ర్యానికి పూర్వం నైజాం రాజ్యంలో చందా, సిద్ధబోయిన ఇంటిపేర్లున్న గిరిజన కుటుంబాలు మాత్రమే చేసుకునే చిన్న జాతర ఇది. ప్రతి ఏటా జాతర చేసే స్థోమత లేక రెండేళ్లకోమారు అది కూడా చందాలు వేసుకునీ, అవీ చాలక వరంగల్‌లోని వర్తకులు దగ్గర వడ్డీలకు డబ్బులు తెచ్చి ఈ జాతర నిర్వహించేవారు. 1961లో నాటి రాష్ట్ర ప్రభుత్వం జాతర నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టింది. 1996లో ‘రాష్ట్ర అధికారిక పండుగ’గా గుర్తించింది. పాలకులు, భక్తుల కృషితో నేడు ఉన్న స్థితికి ఈ జాతర చేరింది.

– డా॥ అమ్మిన శ్రీనివాసరాజు, పరిశోధక రచయిత

(నేటి నుంచి ఫిబ్రవరి 23 వరకు మేడారం జాతర)

కుంకుమ భరిణ రూపంలో...

సమ్మక్క ఓ కోయరాజు కుమార్తెగా జానపద కథలు చెబుతున్నాయి. ప్రతాపరుద్రునితో జరిగిన యుద్ధంలో తమ వారంతా మరణించడంతో సమ్మక్క వీరావేశంతో శత్రుమూకలను సంహరించింది. కానీ ఒక సైనికుడు ఆమెను వెన్నుపోటు పొడవడంతో రక్తపు టేరుల మధ్య అడవి వైపు వెళ్తూ అదృశ్యమయ్యింది. గిరిజనులు ఆమె కోసం వెదుకుతుండగా చిలకల గుట్టపై నెమలినార చెట్టుకింద కుంకుమ భరిణ కనిపించింది.

తన శక్తియుక్తులనూ, ధైర్యసాహసాలనూ సమ్మక్క ఆ భరిణలో నిలిపిందని భావించి ఆమె ప్రతి రూపంగా భావించారు గిరిజనులు. అక్కడే గద్దెలను నిర్మించి అప్పటినుండి సమ్మక్క సారలమ్మ జాతర జరిపించ సాగారు.

మాఘశుద్ధ పౌర్ణమి నుండి నాలుగు రోజులు ఈ జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. మొదటిరోజు కన్నెపల్లి నుండి సారలమ్మకు ప్రతి రూపమైన పసుపు భరిణను మేళ తాళాలతో తీసుకువచ్చి వెదురు కర్రకు పట్టుదారంతో కడతారు. రెండవ రోజు సమ్మక్కకు ప్రతిరూపంగా భావించే కుంకుమభరిణను చిలకల గుట్టనుండి తీసుకువచ్చి వెదురుకర్రకు అలంకరిస్తారు.

రెండు గద్దెలపై రెండు వెదురు కర్రలను సమ్మక్క, సారలమ్మలుగా ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. ఈ సమయంలో భక్తులు పూనకాలతో ఊగిపోతారు. మూడవ రోజు ‘వనదేవతలు’గా భక్తులకు దర్శనమిస్తారు. భక్తులు బెల్లాన్ని బంగారంగా భావించి అమ్మవార్లకు నివేదిస్తారు. జంపన్న వాగులో స్నానం చేసి, తలనీలాలు సమర్పించుకుంటారు. కోరికలు నెరవేరాలని వేడుకుంటారు. నాలుగవ రోజు సమ్మక్క, సారలమ్మల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

– అయిత అనిత, రచయిత్రి

భాషా అవరోధాలను అధిగమించి న్యాయం

సందర్భం



డా॥ మంగారి రాజేందర్

ఈ మధ్య భాష గురించిన రెండు వార్తలు నా దృష్టిని ఆకర్షించాయి. మొదటిది వీడియో. రెండవది వార్త. వీడియో ప్రకారం ఓ వ్యక్తి ఇలా అంటాడు – ‘మన దేశంలో ఇంగ్లీష్ మాతృభాషగా కలిగిన వ్యక్తుల సంఖ్య 2 లక్షల 70 వేల మంది. మిగతా వ్యక్తులవి విభిన్న భాషలు. అయితే సుప్రీంకోర్టు మాత్రం తన తీర్పులను ఇంగ్లీష్‌లో ప్రకటిస్తుంది. ఇంగ్లీష్‌లోనే వాదనలను వింటుంది. నా భాషలో సుప్రీంకోర్టులో నేను మాట్లాడలేను. ప్రజాస్వామ్యం అంటే అర్థం ఏమిటి? కేసు నాది. నాకు హిందీ వచ్చు. నా న్యాయవాది ఇంగ్లీష్‌లో ఏవో వాదనలు చేస్తాడు. న్యాయమూర్తి కూడా ఇంగ్లీష్‌లో ఏవో అడుగుతాడు. ఆ తరువాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తాడు. వాళ్ళు ఏం వాదనలు చేశారో నాకు తెలియదు. కోర్టు ఏమి తీర్పును ప్రకటించిందో అంతకంటే తెలియదు. ఈ ప్రక్రియలో నా పాత్ర లేదు. ఇది బాధ కలిగించే విషయం.’

ఇది ఇలా ఉంటే 2022 జనవరిలో మరో సంఘటన గుజరాత్ హైకోర్టులో జరిగింది. అప్పుడు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్. ఆయన కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తి. ఆయన మాతృభాష కన్నడ. ఆయనకు గుజరాతీ భాష తెలియదు. ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్‌లోని మరో న్యాయమూర్తి జస్టిస్ అశుతోష్ జె. శాస్త్రి. ఓ కోర్టు ధిక్కరణ నోటీసుని ఎదుర్కొంటున్న ఓ జర్నలిస్ట్ గుజరాతి భాషలో తన వాదనలను వినిపించడానికి ఆ బెంచ్ ముందు ప్రయత్నం చేశారు. అతని వాదనలను వినడానికి కోర్టు అంగీ కరించలేదు. ‘కోర్టుకు మరీ ముఖ్యంగా నాకు (ప్రధాన న్యాయమూర్తికి) అర్థం కాని భాషలో వాదనలను మేం అంగీకరించలేము. రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 ప్రకారం హైకోర్టు అధికార భాష ఇంగ్లీష్. అందుకని అతను తన వాదనలను గుజరాతీలో చెప్పడానికి మేం అంగీకరించం’ అని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

సుప్రీంకోర్టులో అన్ని రాష్ట్రాలకు సంబంధించిన న్యాయమూర్తులు ఉంటారు. వారి మాతృభాషలు వేరు. అదే విధంగా హైకోర్టులలో ఎక్కువ శాతం ఆ రాష్ట్రానికి చెందిన న్యాయమూర్తులే ఉన్నప్పటికీ కొంతమంది వేరే రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉంటారు. ఈ రెండు పరిస్థితులను గమనించినప్పుడు రెండిటిలోనూ న్యాయం కనిపిస్తుంది. ఈ పరిస్థితిని అధిగమించడం ఎలా?



రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 (1) (ఎ) ప్రకారం పార్లమెంటు మరో విధంగా చెప్పనంత వరకు సుప్రీంకోర్టు, హైకోర్టులలోని కార్య కలాపాలు ఇంగ్లీష్‌లోనే జరగాలి. ఆర్టికల్ 348 (2) ప్రకారం 348 (1)తో సంబంధం లేకుండా రాష్ట్రపతి పూర్వ అనుమతితో ఆ రాష్ట్ర గవర్నర్ హైకోర్టులోని కార్య కలాపాలను హిందీలో గాని ఇతర భాషలలో గాని జరపడానికి ఆ యా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. తమిళనాడు రాష్ట్రం కూడా ఆ దిశగా ప్రయత్నం చేస్తోంది. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో హిందీని ప్రాథమిక భాషగా రాజ్యాంగం గుర్తించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21ల ప్రకారం ప్రతి లిటిగెంట్‌కీ కోర్టు కార్యకలాపాలు అర్థం చేసుకునే హక్కు వుంటుంది. అది ప్రాథమికమైనది. అదే విధంగా కోర్టులో తన భాషలో మాట్లాడే హక్కు కలిగి వుంటాడు. అప్పుడే అతనికి న్యాయం గురించి తెలుసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. సుప్రీంకోర్టు దాకా వ్యక్తిగతంగా కక్షిదారులు వెళ్ళే అవకాశాలు తక్కువ. కానీ హైకోర్టులకు వెళ్ళే అవకాశం ఎక్కువగా ఉంది. తన భాష తెలిసిన న్యాయమూర్తుల ముందు అతను వాదనలు వినిపించే అవకాశం కల్పిస్తే ఈ పరిస్థితులను కొంతమేరకైనా అధిగమించవచ్చు.

జిల్లా కోర్టుల పరిస్థితి వేరు. అక్కడ కోర్టు కార్యకలాపాలు తెలుగులో జరపడానికి ఎలాంటి ఆటంకాలూ లేవు. సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 137 ప్రకారం తెలుగు భాషను కోర్టు భాషగా హైకోర్టుని సంప్రదించి ప్రభుత్వం నిర్ధారించింది. అదే విధంగా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 272 ప్రకారం తెలుగును కోర్టు భాషగా ప్రభుత్వం నిర్ధారించింది.

సుప్రీంకోర్టు ఈ మధ్య ‘ఎలక్ట్రానిక్ కోర్టు రిపోర్ట్స్’ అనే ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులను ఉచితంగా అందచేస్తోంది. దేశంలోని 99.9 శాతం ప్రజలకు ఇంగ్లీష్ రాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్రచూడ్ అన్నారు. ప్రాంతీయ భాషలో తీర్పులను తీసుకొని రావడానికి ఆయన కృషి చేస్తున్నారు. ఈ చర్యలను ప్రధానమంత్రి కూడా ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ ఇచ్చిన స్ఫూర్తితో ఓ మహిళా న్యాయమూర్తి తన తొలి తీర్పును తెలుగులో ప్రకటించటం తెలుగు భాషాభిమానులకే కాదు, కోర్టుకు వచ్చే వ్యక్తులకూ ఆనందం కలిగించింది. మరెంతో మంది న్యాయమూర్తులు ఆ దిశగా తెలుగులో న్యాయపాలన కొనసాగించి ప్రజలకు చేరువ అవుతారని ఆశించవచ్చు.

వ్యాసకర్త రచయిత, విశ్రాంత జిల్లా సెషన్స్ జడ్జి

(నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.12.39 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పునర్వసు ప.3.32 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.12.07 నుండి 1.47 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.51 నుండి 12.39 వరకు, **అమృత ఘడియలు:** ప.1.02 నుండి 2.44 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.29, **సూర్యాస్తమయం:** 5.58.



సీఎం వైఎస్ జగన్‌తో ఆళ్ల రామకృష్ణారెడ్డి, అయోధ్యరామిరెడ్డి

ఎవరికి సీటిచ్చినా మద్దతిస్తా

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- సొంత గూటికి తిరిగి చేరిక

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించడం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తన చేతిలో ఓడిన నారా లోకేశ్ ఈసారి బీసీ అభ్యర్థి చేతిలో ఓడిపోవడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండాలనేదే తన బలమైన ఆకాంక్ష అని తెలిపారు. అందుకోసం మంగళగిరిలో ఏ అభ్యర్థికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం కృషి చేస్తానని వెల్లడించారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఆళ్ల వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బిల్లులు రాకపోవడంతో బాధపడి రెండు నెలలు వైఎస్సార్‌సీపీకి దూరమయ్యానన్నారు. సీఎం వైఎస్ జగన్ తన సమస్యను పరిష్కరించార ని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవి పాల్గొన్నారు.

మొండిగౌరెల్లిలో రిమోట్ సెన్సింగ్ సెంటర్

యాచారం: మండల పరిధిలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మొండిగౌరెల్లిలో డ్రోన్ పోర్ట్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. వారం క్రితమే ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ ఆర్ఎస్సీ)తో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ డ్రోన్ పైలట్లకు అధునాతన శిక్షణపై ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, యాచారం తహసీల్దార్ అయ్యప్పతో కలిసి మొండిగౌరెల్లి సర్వే నంబర్ 19లోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు.

యూరియా ఉత్పత్తి 'గండం' దాటేనా?

ఆర్ఎఫ్‌సీఎల్‌లో సాంకేతిక లోపం..

- తరచూ ఉత్పత్తికి విఘాతం
- ఫలితమివ్వని విదేశీ పరిజ్ఞానం
- స్టీమ్‌లైన్ లోపాలతో మూణ్నెళ్లకోసారి సమస్యలు

ఫెర్టిలైజర్‌సిటీ (రామగుండం): స్వదేశీతో పాటు విదేశీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్థాపించిన రామగుండం ఫెర్టిలైజర్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)లో యూరియా ఉత్పత్తికి తరచూ అంతరాయం కలుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సుమారు రూ.6,350 కోట్లు వెచ్చించి కర్మాగారం నిర్మించారు. ఇందుకోసం ఇటలీ, డెన్మార్క్ నుంచి ఆధునిక యంత్ర,సామగ్రి తెప్పించారు. రోజుకి 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా, 3,850 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మించారు. 2023 డిసెంబర్ 31 నాటికి 8,19,344.70 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేశారు. ఇక్కడి యూరియాకు జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉంది. కేంద్ర ఎరువులు, రసాయన శాఖ రామగుండంలోని ఈ ప్లాంట్‌ను పర్యవేక్షిస్తుంది.



పైప్‌లైన్లలో లీకేజీలతో ఉత్పత్తికి బ్రేక్

స్టీమ్ ఆధారంగానే ఇక్కడ యూరియా ఉత్పత్తి అవుతోంది. అయితే స్టీమ్ పైప్‌లైన్ లోపాలతో ప్రతీమూడు నెలలకోసారి ప్లాంట్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. సామర్థ్యానికి మించి పైపుల్లో స్టీమ్(ఆవిరి) సరఫరా కావడంతో తరచూ పైపులైన్లలో లీకేజీలు ఏర్పడి, యూరియా ఉత్పత్తి నిలిచిపోతోంది. గతేడాది నవంబర్ 15న ఇలాంటి సమస్య తలెత్తితే.. సుమారు 15 రోజులపాటు మరమ్మతులు చేసి ప్లాంట్‌ను పునరుద్ధరించారు. ప్లాంట్ ప్రారంభమైన కాసేపటికే మళ్లీ సాంకేతిక సమస్య తలెత్తడంతో మరో మూడురోజుల పాటు మరమ్మతులు చేయాల్సి వచ్చింది. నవంబర్ 25న ఉత్పత్తి పునఃప్రారంభమై యూరియా, అమ్మోనియా ఉత్పత్తి సాఫీగానే సాగింది. కానీ, ఈనెల 9న హీట్ స్టీమ్ పైప్‌లైన్‌లో మళ్లీ సమస్య తలెత్తింది. దీంతో ఉత్పత్తి నిలిచిపోవడంతో ప్లాంట్ షట్‌డౌన్ చేశారు. ఈనెల 24లోగా పనులు పూర్తిచేసి యూరియా ఉత్పత్తి పునరుద్ధరిస్తామని అధికారులు చెబుతున్నారు.

గ్యారంటీ గడువు ముగిసిపోవడంతో

గ్యాస్ ఆధారంగా నడిచే రామగుండం ఫెర్టిలైజర్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారం నిర్మాణంలో విదేశీ పరిజ్ఞానం వినియోగించిన విషయం తెలిసిందే. ఇటలీ, డెన్మార్క్‌నుంచి తెచ్చిన యంత్ర, సామగ్రి గ్యారంటీ గడువు ముగిసిపోవడంతో మరమ్మతులు, నిర్వహణ భారమంతా కర్మాగారంపైనే పడుతోంది.

ప్లాంట్‌పై ఒత్తిడి

మన రాష్ట్రంతోపాటు ఆంధ్రా, కర్ణాటక, మహారాష్ట్రల్లో యూరియాకు డిమాండ్ పెరగడంతో రామగుండం ప్లాంట్‌లో నిరంతరంగా ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో ప్లాంట్‌లో తరచూ సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరడం, డిమాండ్‌కు సరిపడా యూరియా ఉత్పిత్తి చేయలేకపోవడంతో అధికారులపై ఒత్తిడి పెరుగుతోందన్న వాదన వినపడుతోంది.

దక్షిణ 'రింగ్'కూ ఓకే!

▶ మొదటి పేజీ తరువాయి

అందజేశారు.

యుటిలిటీస్ తరలింపుపై..: ఆర్ఆర్ఆర్ నిర్మించే మార్గంలో చౌటుప్పల్–భువనగిరి–తుప్రాన్–సంగారెడ్డి–కంది పరిధిలో యుటిలిటీస్ (విద్యుత్ స్తంభాలు, లైన్లు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల) తొలగింపు వ్యయం విషయంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై ఈ భేటీలో చర్చించారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పదినెలల క్రితం ఎన్‌హెచ్ఏఐ అధికారులు పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ప్రతిష్టంభన నెలకొంది. కాంగ్రెస్ సర్కారు వచ్చాక యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్రం భరించేందుకు సిద్ధమంటూ ఎన్‌హెచ్ఏఐకు లేఖ పంపింది. సీఎం రేవంత్ ఈ అంశాన్ని కేంద్ర మంత్రి వద్ద ప్రస్తావించగా.. ఆయన ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆరా తీశారు. యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మెలిక పెట్టినదెవరని అధికారులపై కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని భరిస్తే భవిష్యత్‌లో టోల్ ఆదాయంలో సగం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని రాష్ట్ర బృందానికి గడ్కరీ వివరించారు.

రెండు రోడ్లను విస్తరించండి..

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరసలుగా.. హైదరాబాద్–కల్వకుర్తి మార్గాన్ని నాలుగు వరసలుగా విస్తరించాలని కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్ కోరారు. ఇక నల్లగొండ జిల్లాలో ట్రాన్స్‌పోర్టు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వీటిని సానుకూలంగా పరిశీలిస్తామని గడ్కరీ రాష్ట్ర బృందానికి హామీ ఇచ్చారు. ఇక సీఆర్ఐఎఫ్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నిధుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని సీఎం కోరిన రోడ్లు ఇవీ..

1. మరికల్–నారాయణపేట్–రామసముద్ర: 63 కి.మీ.
2. పెద్దపల్లి–కాటారం: 66 కి.మీ
3. పుల్లూర్–అలంపూర్–జటప్రోలు–పెంట్లవెల్లి–కొల్లాపూర్–లింగాల్–అచ్చంపేట–డిండి–దేవరకొండ–మల్లేపల్లి–నల్లగొండ: 225 కి.మీ.
4. వనపర్తి–కొత్తకోట–గద్వాల–మంత్రాలయం:110 కి.మీ.
5. మన్నెగూడ–వికారాబాద్–తాండూర్–జహీరాబాద్–బీదర్: 134 కి.మీ.
6. కరీంనగర్–సిరిసిల్ల–కామారెడ్డి–ఎల్లారెడ్డి–పిట్లం: 165 కి.మీ.
7. ఎర్రవెల్లి క్రాస్‌రోడ్–గద్వాల–రాయచూర్: 67 కి.మీ.
8. జగిత్యాల–పెద్దపల్లి–కాల్వశ్రీరాంపూర్–కిష్టంపేట–కల్వపల్లి–మోరంచపల్లి–రామప్ప దేవాలయం–జంగాలపల్లి: 164 కి.మీ
9. సారపాక–ఏటూరునాగారం: 93 కి.మీ
10. దుద్దెడ–కొమురవెల్లి–యాదగిరిగుట్ట–రాయగిరి క్రాస్‌రోడ్: 63 కి.మీ.
11. జగ్గయ్యపేట–వైరా–కొత్తగూడెం: 100 కి.మీ.
12. సిరిసిల్ల–వేములవాడ–కోరుట్ల: 65 కి.మీ
13. భూత్పూర్–నాగర్‌కర్నూల్–మన్ననూర్–మద్దిమడుగు (తెలంగాణ)–గంగలకుంట –సిరిగిరిపాడు: 166 కి.మీ.
14. కరీంనగర్–రాయపట్నం: 60 కి.మీ.

రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

- అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారు
- మంత్రి పొంగులేటికి గోనె ప్రకాశ్‌రావు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిందని, ప్రభుత్వ రహదారిని ఆక్రమించిందని, పేదలకు కేటాయించిన స్థలాల్లోకి వారిని అనుమతించలేదనే అంశాలపై లేఖలో ప్రస్తావించారు. ఈనాడు అధినేత రామోజీరావు మూడువేల ఎకరాల్లో నిర్మించిన ఫిలింసిటీలో దాదాపు 1,700 ఎకరాలు ప్రభుత్వ అదీనంలో ఉండే కోర్ట్ ఆఫ్ వార్డ్స్, భూదాన్ భూములు, దళితులు, పేదలకు కేటాయించిన అసైన్డ్‌భూములు, చెరువులు, కుంటలు ఉన్నాయని పేర్కొన్నారు. అసైన్డ్ భూములు కొనుగోలు చేయడం, వాటిలో నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరమని గుర్తుచేశారు. నాగన్‌పల్లి రెవెన్యూ గ్రామం సర్వే నం.189, 203 కింద 14 ఎకరాల 30 గుంటల భూమిని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బలహీనవర్గాలకు చెందిన 606 మందికి కేటాయించారన్నారు. ఇప్పుడు వారికి కేటాయించిన స్థలాల్లోకి వారిని అనుమతించడం లేదని ఆయన ఆరోపించారు. ఫిలింసిటీ యాజమాన్యం ప్రభుత్వం నిర్మించిన రహదారిని సైతం అక్రమించిందన్నారు. నాగన్‌పల్లి, పొల్కంపల్లి మీదుగా ఉన్న ప్రజా రహదారికి అడ్డంగా అనాజ్‌పూర్ దగ్గర ఒక గేటు, నాయన్‌పల్లి దగ్గర మరో గేటు ఏర్పాటు చేసి ఐదు కి.మీ. మేరకు ఎస్టేట్లో కలుపుకొన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఓకే

- ప్రజాభిప్రాయ సేకరణలో మెజార్టీ ప్రజలు, అఖిలపక్ష నాయకుల ఆమోదం



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, చిత్రంలో జెన్‌కో సీఎండీ రిజ్వీ తదితరులు

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పూర్తిస్థాయి నిర్మాణ పనులకు ప్రజామోదం లభించింది. ప్లాంట్ నిర్మాణంతో తలెత్తే పర్యావరణ సమస్యలపై మంగళవారం కలెక్టర్ హరిచందన అధ్యక్షతన జెన్‌కో సీఎండీ రిజ్వీ, సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రశాంతంగా ముగిసింది. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న సమీప గ్రామాల ప్రజలు, అఖిలపక్ష నాయకుల్లో ఒకరిద్దరు మినహా అందరూ ప్లాంట్ నిర్మాణాన్ని ఆమోదించారు. దామరచర్ల మండల పరిధిలోని వీర్లపాలెం వద్ద సుమారు రూ.30 వేల కోట్లతో టీఎస్‌జెన్‌కో నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయి. ప్లాంట్ ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి కోరారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌తో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించమని జెన్‌కో డైరెక్టర్ అజయ్ తెలిపారు.

జగజ్యోతి ఇంట్లో 3.6 కిలోల బంగారం.. రూ.65 లక్షల నగదు స్వాధీనం

- పలు భూముల పత్రాలు సీజ్
- మంగళవారం సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: లంచం తీసుకుంటూ ఏసీబీ చేతికి చిక్కిన గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) కె.జగజ్యోతి ఇంట్లో భారీగా నగదు, బంగారం పట్టుబడ్డాయి. మెహిదీపట్నంలోని వెంకటసాయి అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 202 జగజ్యోతి నివాసంలో మంగళవారం ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో రూ.1,51,08,175 విలువ చేసే దాదాపు 3.6 కిలోల బంగారు ఆభరణాలు, రూ.65.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ఓపెన్ ప్లాట్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు సీజ్‌చేశారు. సోదాలు ముగిసిన అనంతరం జగజ్యోతి ని కోర్టులో ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో జగజ్యోతి అస్వస్థ తకు గురవ్వగా...వెంటనే ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తర లించారు. ఛాతీనొప్పి వచ్చిందని చెప్పడంతో ఆమెకు డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వ హించారు. వైద్యుల సూచన మేరకు బుధవారం ఉదయం డిశ్చార్జ్ చేయించి ఆమెను కోర్టులో హాజరు పరుచనున్నారు. జగజ్యోతి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది.

సదాశివపేట మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటైనట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో 197 వ్యవసాయ మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గాల ఏర్పాటుకు ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మొదటగా సదాశివపేట మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సంబంధించి వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు.



రోలింగ్ హిల్స్‌లో గల సాహితీ సితార ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శేరిలింగంపల్లి, గచ్చిబౌలిలోని సర్వే నం. 32(పార్ట్)లో ఉన్న భూమిని అటాచ్‌చేస్తూ కోర్టు జారీచేసిన నోటీసు బోర్డును పోలీసుల సహకారంతో బాధితులు మంగళవారం సంబంధిత స్థలం వద్ద ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బాధితులు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ (హైదరాబాద్)కు ధన్యవాదాలు తెలిపారు.

కమలం.. సర్వేలే ప్రమాణం

- లోక్‌సభకు పోటీ చేసేందుకు లెక్కకు మించి అభ్యర్థులు
- దాంతో ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న నాయకత్వం
- అమిత్ షా పర్యవేక్షణలో ఓ స్వతంత్ర సంస్థ సర్వే
- సర్వేల ఆధారంగానే టికెట్ల కేటాయింపు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లలో అభ్యర్థుల ఎంపికకు వివిధ అంశాల ప్రాతిపదికన నిర్వహిస్తున్న సర్వేలనే బీజేపీ జాతీయనాయకత్వం ప్రామాణికంగా తీసుకుంటోంది. రాష్ట్రంలోని పలు సీట్లకు లెక్కకు మించి అభ్యర్థులు పోటీపడుతున్న నేపథ్యంలో సర్వేల్లో వెల్లడయ్యే ప్రజాభిప్రాయం ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక చేపట్టాలని నిర్ణయించిందని తెలుస్తోంది. లోక్‌సభ నియోజకవర్గాల్లో పరిస్థితులు, బీజేపీ బలం, వివిధ వర్గాల ప్రజల్లో ప్రధాని నరేంద్ర మోదీ పట్ల సానుకూలత, పార్టీబలానికి తోడు అభ్యర్థుల బలాబలాలు తదితర అంశాల ప్రాతిపదికగా వివిధ సర్వేలు నిర్వహిస్తున్నారు. కాగా, బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి, అమిత్‌షా కనుసన్నల్లో మరో సర్వే సాగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. సదరు సర్వే ఫలితాలను కేవలం ఆయనకే సమర్పిస్తారని తెలుస్తోంది.

నెలాఖరుకల్లా సగం మంది అభ్యర్థుల పేర్లు ఖరారు

వచ్చే నెల మొదటివారం లేదా పదో తేదీలోగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చుననే అంచనాల నేపథ్యంలో... ఈ నెలాఖరు కల్లా రాష్ట్రంలోని సగం స్థానాలకు అభ్యర్థుల పేర్లు ప్రకటించే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ నుంచి కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారంటూ తాజాగా బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ చేసిన ప్రకటన సంచలనం కలిగించింది. ఒకవేళ ఆయన అన్నట్టుగానే సిట్టింగ్ ఎంపీలు వస్తే వారి బలాబలాలను కూడా పరిగణనలోకి తీసుకుని కచ్చితంగా గెలిచే అవకాశాలున్న వారికి టికెట్లు కేటాయిస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సిట్టింగ్ స్థానాలపై స్పష్టత!

రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో.. సిట్టింగ్ సీట్లలో సికింద్రాబాద్– కిషన్‌రెడ్డి, నిజామాబాద్– అర్వింద్ ధర్మపురి, కరీంనగర్–బండి సంజయ్ పేర్లు ఇప్పటికే ఖరారు కాగా ఆదిలాబాద్–సోయం బాపూరావు లేదా మరో అభ్యర్థికి ఇవ్వొచ్చుననే ప్రచారం జరుగుతోంది

ఆ సీట్ల నుంచి సీనియర్లు

మల్కాజిగిరి ఎంపీ సీటుకు అత్యధికంగా పది మందికి పైగానే పోటీపడుతున్నారు. వారిలో ఈటల రాజేందర్, మురళీధర్‌రావు, ఎన్.రామచంద్రరావు, చాడ సురేష్‌రెడ్డి కూడా ఉన్నారు. ఆ తర్వాత జహీరాబాద్ సీటుకు కూడా పోటీ భారీగానే ఉంది. ఇక్కడి నుంచి ఓ బీసీ నాయకుడిని పోటీకి దింపే అవకాశాలున్నాయని అంటున్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కూడా పోటీ చేయించే అవకాశముందని తెలుస్తోంది. మహబూబ్‌నగర్ సీటు విషయంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పోటీలో ముందు వరసలో ఉన్నట్టుగా పార్టీనేతలు చెబుతున్నారు. చేవెళ్ల నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే అవకాశాలు మెండుగా ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్‌కు సైతం పోటీనే

పెద్దగా గెలిచే అవకాశాలు లేకపోయినా హైదరాబాద్ లోక్‌సభ స్థానానికి కూడా పలువురు పోటీపడుతున్నట్టు తెలుస్తోంది. గతంలో పోటీచేసిన భగవంతరావు, ఇంకా పార్టీలో చేరని మాధవీలత, ఇతర నాయకులు హైదరాబాద్ సీటును ఆశిస్తున్నారు. కాగా, హిందువుల ఓట్లను పోలరైజ్ చేసేందుకు గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్‌ను పోటీకి దింపాలనే యోచనలో కూడా నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్, భువనగిరి సీట్లలో పార్టీకి బాగా సానుకూలత ఉన్నట్టుగా భావిస్తున్నారు. ఇక వరంగల్, నల్లగొండ, మెదక్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్ సీట్లలో ఇంకా పార్టీపరంగా మరింత బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని అంచనా వేస్తున్నారు.

ఈనెల 24 లేదా మార్చి 2న రాష్ట్రానికి అమిత్ షా!

బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 24, 25 తేదీల్లో.. లేదంటే మార్చి 2న రాష్ట్ర పర్యటనకు వచ్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల సమాచారం. తెలంగాణకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై అమిత్‌షా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో...పార్టీపరంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా రాష్ట్ర పార్టీకి ఆయన ఎన్నికల దిశానిర్దేశం చేయనున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగానే...అమిత్ షా రాష్ట్రంలో పర్యటిస్తారని చెబుతున్నారు, మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల్లో పర్యటించడంతోపాటు పార్టీపరంగా నిర్వహిస్తున్న విజయసంకల్ప రథయాత్రల్లో పాల్గొంటారని తెలుస్తోంది.

ఏళ్ల తరబడి అద్దె చెల్లించకుండా ఉపశమనం కోరడమా?

- అలా ఆదేశాలు ఇవ్వలేం
- లీజు వివాదంపై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు

సాక్షి, హైదరాబాద్: ఏళ్ల తరబడి అద్దె చెల్లించకుండా లీజుకు తీసుకున్న ఆస్తిని తమ వద్దే ఉంచుకోవాలని భావించిన అద్దెదారులను రక్షించే ప్రయత్నం చేయలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. లీజుకు తీసుకున్న ఆస్తికి సంబంధించిన వివాదాలను నేరుగా ఇక్కడ విచారణ జరపలేమని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి కారణం కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ద్విసభ్య ధర్మాసనం మంగళవారం తీర్పునిచ్చింది. నాంపల్లి చేనేత భవన్‌లోని సెల్లార్ పోర్షన్‌ను ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కోసం మహిళా పారిశ్రామికవేత్తల సంఘం మూడేళ్లపాటు 2011లో అద్దెకు తీసుకుంది. కొంతకాలం అద్దె చెల్లించిన సంఘం ఆ తర్వాత అద్దె చెల్లించకుండా అక్కడే కొనసాగుతూ వస్తోంది. దీంతో రూ.49,78,810 చెల్లించాలని 2022లో తెలంగాణ స్టేట్ టెక్స్‌టైల్స్ కాంప్లెక్స్ కో–ఆపరేటివ్ సొసైటీ నోటీసులు జారీ చేసింది. అద్దెదారు నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో స్థలాలను సొసైటీ స్వాధీనం చేసుకుంది. దీంతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సొసైటీ సిబ్బంది అద్దె ఇంటి తాళాన్ని పగలగొట్టి విలువైన వస్తువులన్నింటినీ ఎత్తుకెళ్లారని పోలీసులకు అద్దెదారు ఫిర్యాదు చేశారు. అయితే, దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ప్రభుత్వ రంగ టెక్స్‌టైల్స్ సొసైటీ అధికారులను బెదిరించిన ఆరోపణలపై అద్దెదారులపై కేసు నమోదు చేశారు. ఆస్తిని తిరిగి ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ మహిళా పారిశ్రామికవేత్తల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన సింగిల్ జడ్జి అటువంటి ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పారు. ఈ ఉత్తర్వులను మహిళా పారిశ్రామికవేత్తల సంఘం ద్విసభ్య ధర్మాసనం వద్ద సవాల్ చేసింది.

ముంచెత్తుతున్న మాంద్యం

మరో 18 దేశాల్లో మాంద్యం ఛాయలు

జాబితాలో ఎక్కువగా యూరప్ దేశాలే

ఒకవైపు యుద్ధాలు. మరోవైపు పర్యావరణ మార్పులు. కారణాలేమైతేనేం... ప్రపంచాన్ని క్రమంగా మాంద్యం మేఘాలు కమ్ముకుంటున్నాయి. జపాన్ ఇటీవలే ఆర్థిక మాంద్యపు ఛాయల్లోకి జారుకుంది. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో మూడు నుంచి నాలుగో స్థానానికి దిగజారింది. బ్రిటన్ కూడా సాంకేతికంగా మాంద్యంలోకి జారుకుంది. అయితే ఇది ట్రైలర్ మాత్రమేనని ఆర్థికవేత్తలంటున్నారు. పదుల సంఖ్యలో దేశాలు ఆర్థిక ఒడిదొడుకులతో విపరీతంగా సతమతమవుతూ మాంద్యం దిశగా సాగుతున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే కనీసం మరో 18 దేశాలు ఈ జాబితాలోకి చేరడం కలవరపరుస్తోంది...



ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం వరుసగా రెండు త్రైమాసికాల్లో దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తగ్గుదల నమోదైతే సాంకేతికంగా దాన్ని మాంద్యం కిందే పరిగణిస్తారు. 2023 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికానికి జపాన్, బ్రిటన్ రెండూ ఈ మాంద్యం బారిన పడ్డాయి. ఇవి అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కావడంతో ఈ పరిణామం సర్వత్రా చర్చనీయంగా మారింది. కానీ ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల చాలా దేశాల్లో మాంద్యం ఛాయలు ప్రస్ఫుటమవుతున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఇప్పటికే మాంద్యం బారిన పడ్డవి కొన్ని కాగా మరికొన్ని అతి త్వరలో ఆ ముప్పు దిశగా సాగుతున్నాయని హెచ్చరిస్తున్నారు.

జపాన్, బ్రిటన్‌తో పాటు ఐర్లండ్, ఫిన్లండ్ కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసికంలో సాంకేతిక ఆర్థిక మాంద్యం బారిన పడ్డాయి. ఐర్లండ్ జీడీపీ మూడో త్రైమాసికంలో 0.7 శాతం తగ్గగా నాలుగో త్రైమాసికంలో ఇప్పటికే ఏకంగా 1.9 శాతం తగ్గుదల నమోదు చేసింది! ఫిన్లండ్ జీడీపీలో వరుసగా 0.4, 0.9 శాతం తగ్గుదల నమోదైంది. నిజానికి చాలా దేశాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. చాలా దేశాల నాలుగో త్రైమాసిక జీడీపీ గణాంకాలు ఇంకా రావాల్సి ఉంది. అవి వెల్లడయ్యాక సాంకేతిక మాంద్యం జాబితాలోని దేశాల సంఖ్య బాగా పెరిగేలా కన్పిస్తోంది. అయితే కనీసం మరో 10 దేశాలు జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ తగ్గుదలను చవిచూశాయి. ఈ జాబితాలో కెనడా, న్యూజిలాండ్‌తో పాటు డెన్మార్క్, లగ్జెంబర్గ్, మాల్డోవా, ఎస్టోనియా, ఈక్వెడార్, బహ్రెయిన్, ఐస్‌లాండ్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. వీటిలో డెన్మార్క్, లగ్జెంబర్గ్, మాల్డోవా, ఎస్టోనియా మూడో త్రైమాసికంలోనే ఆర్థిక మాంద్యం నమోదు చేశాయి! ఇవేగాక తాజాగా నాలుగో త్రైమాసిక ఫలితాలు విడుదలైన మరో 9 దేశాల్లో కూడా జీడీపీ తగ్గుదల నమోదైంది. వీటిలో ఆరు దేశాల్లో ఇటీవలి కాలంలో జీడీపీ తగ్గుదల నమోదవడం ఇదే తొలిసారి! జీడీపీ తగ్గుదల జాబితాలో జర్మనీ వంటి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కూడా ఉండటం యూరప్‌ను మరింత కలవరపెడుతోంది. ఇది మొత్తం యూరప్ ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేయడం ఖాయమన్న అంచనాలు వెలువడుతున్నాయి. నాలుగో త్రైమాసికంలో యూరోజోన్ జీడీపీ వృద్ధి సున్నాగా నమోదవడం వాటికి మరింత బలం చేకూరుస్తోంది. ఫ్రాన్స్ కూడా మాంద్యం బాట పడుతున్న సంకేతాలు ఇప్పటికే వెలువడుతున్నాయి.

భారత్‌పై ప్రభావమెంత...?

ఆర్థిక వృద్ధి విషయంలో భారత్‌కు ప్రస్తుతానికి పెద్ద సమస్యేమీ లేదు. మూడో త్రైమాసికంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటు నమోదైంది. నాలుగో త్రైమాసిక అంచనా 6 శాతంగా ఉంది. కాకపోతే ప్రపంచీకరణ యుగంలో ప్రపంచవ్యాప్త పరిణామాలు భారత్‌పైనా కచ్చితంగా ప్రభావం చూపనున్నాయి. పైగా మన మొత్తం ఎగుమతుల్లో 10 శాతం వాటా మాంద్యం జాబితాలోని ఆరు పెద్ద దేశాలదే! వీటిలో బ్రిటన్‌కు 11 బిలియన్ డాలర్లు, జర్మనీకి 10 బిలియన్ డాలర్ల మేరకు మన ఎగుమతులున్నాయి. సేవలు, ఐటీ రంగంలో అతి పెద్ద ఎగుమతిదారుల్లో భారత్ ఒకటన్నది తెలిసిందే. ఇక మాంద్యం కారణంగా ఆయా దేశాల్లో నమోదయ్యే ధరల పెరుగుదల మన దిగుమతులపైనా ప్రభావం చూపనుంది. మన దిగుమతుల్లో మాంద్యం బారిన పడ్డ జపాన్, ఆ ముప్పున్న జర్మనీ వాటా చెరో 17 బిలియన్ డాలర్లు!

దేశం	జీడీపీలో తగ్గుదల
కెనడా	0.3 శాతం
న్యూజిలాండ్	0.3 శాతం
డెన్మార్క్	0.7 శాతం
ఫిన్‌లాండ్	0.9 శాతం
ఐస్‌లాండ్	3.8 శాతం
ఎస్టోనియా	1.3 శాతం
లిథువేనియా	0.3 శాతం
ఐర్లండ్	1.9 శాతం
రొమేనియా	0.4 శాతం
జర్మనీ	0.3 శాతం
కొలంబియా	0.2 శాతం
ఈక్వెడార్	1.3 శాతం
లగ్జెంబర్గ్	0.1 శాతం
బహ్రెయిన్	2.4 శాతం
మాల్డోవా	0.8 శాతం
మలేసియా	2.1 శాతం
దక్షిణాఫ్రికా	0.2 శాతం
బ్రిటన్	0.1 శాతం
థాయ్‌లాండ్	0.6 శాతం
జపాన్	0.8 శాతం

(నోట్: జీడీపీ తగ్గుదల శాతం గణాంకాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో/నాలుగో త్రైమాసికానివి)

– సాక్షి, నేషనల్ డెస్క్

సోనియా, నడ్డా ఏకగ్రీవం





న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇటీవలే బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, కేంద్ర మంత్రులు అశ్వనీ వైష్ణవ్, ఎల్.మురుగన్ సహా 41 మంది ఏకగ్రీవంగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. పోటీ అనివార్యమైన మిగతా 15 స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్నాయి. ఏకగ్రీవంగా గెలిచిన వారిలో బీజేపీ నుంచి అత్యధికంగా 20 మంది ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఆరుగురు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి నలుగురు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు, ఆర్జేడీ నుంచి ఇద్దరు, బీజేడీ నుంచి ఇద్దరు, ఎన్సీపీ, శివసేన, బీఆర్ఎస్, జేడీ(యూ)లకు చెందిన ఒక్కొక్కరు చొప్పున రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుజరాత్‌లో ఖాళీ అయ్యే నాలుగు స్థానాలకు నడ్డా, మరో ముగ్గురు బీజేపీ నేతలే నామినేషన్ వేశారు. ఇంకెవరూ లేకపోవడంతో ఈ నలుగురూ గెలిచారు. రాజస్తాన్‌లో పోటీ లేకపోవడంతో సోనియాతో పాటు మరో ఇద్దరు బీజేపీ నేతలు విజయం సాధించారు. ఉత్తర ప్రదేశ్‌లో 10, హిమాచల్‌లో 1, కర్ణాటకలో 4 స్థానాలకు 27న పోలింగ్ జరగనుంది.

'తేజస్' పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన డిజిటల్ ఫ్లై–బై–వైర్ ఫ్లైట్ కంట్రోల్ కంప్యూటర్(డీఎఫ్‌సీసీ)తో అనుసంధానించిన తేజస్ యుద్ధ విమానాన్ని మంగళవారం విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ శాఖ తెలిపింది. 'తేజస్ ఎంకే1ఏ అభివృద్ధిలో ఇది కీలక ముందడుగు. డీఎఫ్‌సీసీతో అనుసంధానించిన ప్రొటోటైప్ ఎల్ఎస్‌పీ7ని 19న బెంగళూరులోని నేషనల్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్ నుంచి విజయవంతంగా పరీక్షించాం' అని రక్షణ శాఖ తెలిపింది. ఈ పరీక్ష అన్ని పరామితులను అందుకున్నట్లు చెప్పింది. దేశీయంగా అభివృద్ధి చేసిన సింగిల్ ఇంజిన్ తేజస్ విమానాన్ని అన్ని వాతావరణ పరిస్థితుల్లో నడుపొచ్చు. వాయు, సముద్రజలాల గస్తీకి ఉపయోగపడుతోంది.

మరాఠాల రిజర్వేషన్‌కు ఓకే

ముంబై: మహారాష్ట్రలో విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆ రాష్ట్ర శాసనసభ సంబంధిత బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇందుకోసం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమైన రాష్ట్ర అసెంబ్లీలో మహారాష్ట్ర రాష్ట్ర విద్య, సామాజిక వెనుకబాటు బిల్లు–2024ను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే ప్రవేశపెట్టారు. రాష్ట్రజనాభాలో మరాఠాలు 28 శాతం మంది ఉన్నారు. రాష్ట్రంలో మరాఠాలకు అమలయ్యే 10 శాతం రిజర్వేషన్‌ను పదేళ్ల తర్వాత సమీక్షిస్తారు. ''రాష్ట్రంలో భిన్న కులాలు, వర్గాలకు ఇప్పటికే 52 శాతం రిజర్వేషన్‌లు అమలవుతున్నాయి. ఇందులోనే ఓబీసీలకు19 శాతం రిజర్వేషన్ కలిసి ఉంది. అంటే దేశంలో పరిమిత 50 శాతం మార్కును దాటి రిజర్వేషన్లు అమలవుతున్నాయి'' అని బిల్లులో పేర్కొన్నారు. ''తమిళనాడులో 69 శాతం, హరియాణాలో 67 శాతం, రాజస్తాన్‌లో 64 శాతం, బిహార్‌లో 69 శాతం, గుజరాత్‌లో 59 శాతం, పశ్చిమబెంగాల్‌లో 55 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఓబీసీ కోటాలో కాకుండా రాష్ట్రంలో మరాఠాలకు విడిగా రిజర్వేషన్ ఇస్తున్నాం'' అని సీఎం అన్నారు. వ్యవసాయ ఆధారిత కుంబీ కులానికి చెందిన మరాఠాలకు, వారి రక్తసంబంధీలకు మాత్రమే కుంబీ కుల ధ్రువీకరణ పత్రమిస్తామని ప్రభుత్వం ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది.

విడిగా కోటా వద్దు: జరాంగే

మరాఠాలకు విడిగా కాకుండా ఓబీసీ రిజర్వేషన్లలోనే కోటా కావాలని ఉద్యమనేత మనోజ్ జరాంగే డిమాండ్ చేశారు.

స్విట్జర్లాండ్‌కు పోటీగా కశ్మీర్

అద్భుతంగా తీర్చిదిద్దుతాం: మోదీ
- రూ.32,000 కోట్ల పై చిలుకు ప్రాజెక్టులకు శంకుస్థాపన
- దేశంలోనే అతి పెద్దదైన రైల్వే సొరంగం ప్రారంభం



జమ్మూ: ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి వేగం పుంజుకుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సామాజిక న్యాయం, సమీకృత అభివృద్ధి అనే కొత్త శకంలోకి కశ్మీర్ అడుగుపెట్టిందన్నారు. ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కశ్మీర్ లోయను పర్యాటకానికి గమ్యస్థానంగా, స్విట్జర్లాండ్‌కు పోటీగా అన్ని విషయాల్లోనూ అద్భుతంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లో కొత్త శకం ఆరంభమైందని, ఇక్కడి ప్రజలు వారసత్వ రాజకీయాల నుంచి విముక్తి పొందారని పేర్కొన్నారు. గతంలో అధికారం చెలాయించిన వారసత్వ పాలకులు సొంత ప్రయోజనాలు తప్ప ప్రజల బాగోగులు ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. మోదీ మంగళవారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. రూ.32,000 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వోద్యోగాలు పొందిన వారితో, పథకాల లబ్ధిదారులతో ముచ్చటించారు. ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్‌లో దేశంలోనే అతిపెద్దదైన 12.77 కిలోమీటర్ల పొడవైన రైల్వే సొరంగాన్ని ప్రారంభించారు. అనంతరం జమ్మూలో బహిరంగ సభలో ప్రసంగించారు. గల్ఫ్ దేశాల నుంచి జమ్మూకశ్మీర్‌కు భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. కశ్మీర్‌ను రైలు మార్గం ద్వారా కన్యాకుమారితో అనుసంధానించే రోజు దగ్గర్లో ఉందన్నారు.

ఆ అడ్డుగోడ కూల్చేశాం..

జమ్మూకశ్మీర్‌లో నిత్యం బాంబులు, తుపాకులు, కిడ్నాప్‌లు, వేర్పాటువాదం వార్తలొచ్చే రోజులు పోయాయని, సమతులాభివృద్ధితో కూడిన నూతన కశ్మీర్ కనిపిస్తోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. పర్యాటక రంగ ప్రగతితోపాటు అక్కడి పుణ్య క్షేత్రాలను దర్శించుకొనే భక్తుల సంఖ్య పెరుగుతుండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 370 సీట్లు కట్టబెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఐఐఎం క్యాంపస్‌లు ప్రారంభం

ఐఐఎం–జమ్మూ, ఐఐఎం–బోధ్‌గయ, ఐఐఎం–విశాఖపట్నం క్యాంపస్‌లను మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఐఐటీ–భిలాయ్, ఐఐటీ–తిరుపతి, ఐఐటీ–జమ్మూ తదితర ప్రతిష్టాత్మక విద్యాసంస్థల క్యాంపస్‌లను జాతికి అంకితం చేశారు. 20 కేంద్రీయ విద్యాలయాలు, 13 నవోదయ పాఠశాలల శాశ్వత క్యాంపస్‌లకు శంకుస్థాపన చేశారు. విద్యా రంగంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తున్నామన్నారు.

'ఆప్' అభ్యర్థే చండీగఢ్ మేయర్

సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- ఆ 8 ఓట్లు ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థికే పడినట్లు గుర్తింపు
- ఎన్నికల ప్రక్రియనే తారుమారు చేశారంటూ ఆర్వోపై ధ్వజం
- ఆయనపై విచారణకు ఆదేశం


కులదీప్ కుమార్


ఆర్వో అనిల్ మాసి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక విషయంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి అత్యున్నత న్యాయస్థానంలో ఘన విజయం లభించింది. కొన్ని వారాలుగా కొనసాగుతున్న వివాదానికి తెరపడింది. ఈ ఎన్నికల్లో ఆప్–కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కులదీప్ కుమార్‌ను విజేతగా సుప్రీంకోర్టు నిర్ధారించింది. బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్ మేయర్‌గా ఎన్నికైనట్లు గతంలో రిటర్నింగ్ ఆఫీసర్ అనిల్ మాసి విడుదల చేసిన ఫలితాలను న్యాయస్థానం తిరస్కరించింది. రిటర్నింగ్ అధికారి 'క్రాస్' గుర్తు రాసి, చెల్లనివిగా ప్రకటించిన 8 ఓట్లు కులదీప్ కుమార్‌కు పడినట్లు గుర్తించింది. చండీగఢ్ మేయర్‌గా ఆప్–కాంగ్రెస్ అభ్యర్థి కులదీప్ కుమార్ ఎన్నికైనట్లు తేల్చిచెబుతూ సంచలన తీర్పు వెలువరించింది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకు సంక్రమించిన ప్రత్యేక అధికారాలను సుప్రీంకోర్టు ఉపయోగించుకుంది.

ఎన్నిక ప్రక్రియను తారుమారు చేశారు

మేయర్ ఎన్నిక ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'ఆప్' నేత, మేయర్ అభ్యర్థి కులదీప్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. చెల్లనివిగా రిటర్నింగ్ ఆఫీసర్ ప్రకటించిన 8 బ్యాలెట్ పేపర్లను స్వయంగా పరిశీలించింది. అవి ఎక్కడ పాడైపోయాయి? ఎందుకు చెల్లుబాటు కావో చెప్పాలని అనిల్ మాసిని ప్రశ్నించింది. ఆ 8 ఓట్లు కులదీప్ కుమార్‌కు పడినట్లు తేల్చింది. పిటిషనర్‌కు అనుకూలంగా పడిన ఓట్లను రిటర్నింగ్ అధికారి ఉద్దేశపూర్వకంగానే చెల్లనివిగా గుర్తించినట్లు ఆక్షేపించింది. ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొంది. మేయర్ ఎన్నిక విషయంలో రిటర్నింగ్ ఆఫీసర్ వైఖరి సక్రమంగా లేదని వెల్లడించింది. మేయర్ ఎన్నిక ప్రక్రియను ఆయన చట్టవిరుద్ధంగా తారుమారు చేశారని, అంతేకాకుండా కోర్టులో తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చారని, ఇందుకు ఆయన బాధ్యత వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. అనిల్ మాసిపై సీఆర్‌పీఎస్ సెక్షన్ 340 కింద ధర్మాసనం విచారణ ప్రారంభించింది.

అసలేం జరిగింది?

చండీగఢ్ మేయర్ ఎన్నికను జనవరి 30న నిర్వహించారు. కార్పొరేషన్‌లో మొత్తం 36 ఓట్లు ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి ఓడిపోయే అవకాశం ఉండడంతో రిటర్నింగ్ అధికారి అనిల్ మాసీ 8 ఓట్లపై రహస్యంగా 'క్రాస్' గుర్తు రాసి, చెల్లనివిగా ప్రకటించారు. ఈ వీడియో బయటకు వచ్చింది. మిగిలిన ఓట్లను లెక్కించగా ఆప్–కాంగ్రెస్ అభ్యర్థి కులదీప్ కుమార్‌కు 12, బీజేపీ అభ్యర్థికి 16 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి గెలిచినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ప్రకటించారు. దీంతో కులదీప్ కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడింది: కేజ్రీవాల్

సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని సుప్రీంకోర్టు కాపాడిందన్నారు. ఇదో చరిత్రాత్మక తీర్పు అన్నారు. విపక్ష 'ఇండియా' కూటమి కలిసికట్టుగా పని చేస్తే బీజేపీని ఓడించడం సులువేనని తాజా పరిణామం స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలయ్యే 90 కోట్లకు పైగా ఓట్లను బీజేపీ ఎలా దొంగిలిస్తుందని ప్రశ్నించారు.

నీచ రాజకీయాలను ఎదిరించాలి: ఖర్గే

సుప్రీంకోర్టు తీర్పు పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హర్షం వ్యక్తం చేశారు. నిరంకుశ బీజేపీ కబంధ హస్తాల నుంచి ప్రజాస్వామ్యాన్ని న్యాయస్థానం రక్షించిందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. బీజేపీ నీచ రాజకీయాలను ప్రజలంతా కలిసికట్టుగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడానికి బీజేపీ పన్నిన కుట్రలో రిటర్నింగ్ అధికారి అనిల్ మాసి ఒక పావు మాత్రమేనని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ఉన్న అసలు ముఖం నరేంద్ర మోదీ అని ఆరోపించారు.

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్?

న్యూఢిల్లీ: కీలకమైన లోక్‌సభతో పాటు పలు రాష్ట్రాలకు ఎన్నికల తేదీలను మార్చి 9వ తేదీ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎన్నికల షెడ్యూల్ ఈసారి కూడా 2019లో మాదిరిగానే ఉంటుందని చెబుతున్నారు. 2019లో మార్చి 10వ తేదీన ఈసీ ఎన్నికల తేదీలను ప్రకటించగా ఏప్రిల్ 11, మే 19 మధ్యన ఏడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. తాజాగా, ఎన్నికల సన్నద్ధతను తెలుసుకునేందుకు ఇప్పటికే ఎన్నికల అధికారులు రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. లోక్‌సభతోపాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీకు సైతం ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. మార్చి 8, 9 తేదీల్లో ఎన్నికల అధికారులు జమ్మూకశ్మీర్ యంత్రాంగంతో చర్చించి, అక్కడ భద్రతా సిబ్బంది అందుబాటుపై సమీక్ష చేపట్టనున్నారు. మరో రెండు మూడు రోజుల తర్వాత మరోమారు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేయనున్నారని సమాచారం.

సమాజ్‌వాదీ పార్టీకి మౌర్య గుడ్ బై

సొంత పార్టీని ప్రకటిస్తానన్న సీనియర్ నేత



లక్నో: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ)జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి వైదొలిగిన సీనియర్ నేత స్వామి ప్రసాద్ మౌర్య మంగళవారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, యూపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 22న ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సొంతంగా పార్టీని ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తల అభీష్టం తెలుసుకుని భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. ఈ మేరకు ఎస్‌పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌కు ఆయన ఒక లేఖ రాశారు. ఈ నెల 12వ తేదీన మీతో భేటీ అయ్యాను. 13న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశాను. ఆ తర్వాత మీ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. అందుకే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను'అని అందులో పేర్కొన్నారు. ఇండియా కూటమిలో చేరుతారా లేక ఎన్‌డీఏలోకి వెళతారా అన్న ప్రశ్నకు ఆయన..ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా కూటమి అవసరం ఎంతో ఉందని వ్యాఖ్యానించారు.

చిన్నారి దత్తత ప్రాథమిక హక్కు కాదు

న్యూఢిల్లీ: చిన్నారిని దత్తత తీసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లోని ప్రాథమిక హక్కు కిందికి రాదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. పెంపుడు తల్లిదండ్రులకు ఎవరిని దత్తత తీసుకోవాలో ఎంచుకునే హక్కు లేదని కూడా తేల్చి చెప్పింది. 'దత్తత ప్రక్రియ పూర్తిగా పిల్లల సంక్షేమం ప్రాతిపదికగానే ఉంటుంది. ఈ విషయంలో కాబోయే పెంపుడు తల్లిదండ్రుల హక్కులు పరిగణనలోకి రావు'అని పేర్కొంది. ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు, ఇతర ఇబ్బందులున్న పిల్లలను మాత్రమే దత్తత తీసుకోవాలన్న నిబంధనను సమర్థించింది. ఈ నిబంధన పిల్లల సంక్షేమంతోపాటు కాబోయే పెంపుడు తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణకు పనికొస్తుందని తెలిపింది. దత్తత నిబంధనలు–2022 ఏకపక్షంగా ఉన్నాయని, అవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు భంగకరమంటూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ సారథ్యంలోని ధర్మాసనం కొట్టివేస్తూ ఈ మేరకు తీర్పు వెలువరించింది.

నా కుమారుడి మృతదేహాన్ని అప్పగించండి

రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు నవాల్నీ తల్లి వినతి



మాస్కో: తన కుమారుడి మృతదేహాన్ని అప్పగించాలని ఇటీవల మృతి చెందిన రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నవాల్నీ తల్లి ల్యుద్మిలా నవాల్నయా అధ్యక్షుడు పుతిన్‌ను కోరారు. నవాల్నీ శుక్రవారం ఆకస్మికంగా చనిపోయినట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, అధికారులు నవాల్నీ మృతదేహాన్ని ఇప్పటికీ కుటుంబసభ్యులకు అప్పగించలేదు. మృతదేహం జాడను కూడా వెల్లడించడం లేదు. దీంతో, ల్యుద్మిలా నవాల్నయా శనివారం రాజధాని మాస్కోకు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్ప్‌కు వెళ్లారు. అక్కడ నవాల్నీ శిక్ష అనుభవించిన జైలు పీనల్ కాలనీ–3 అధికారులను, మృతదేహాన్ని ఉంచినట్లుగా భావిస్తున్న ఆస్పత్రి అధికారులను కలిశారు. నవాల్నీ మృతదేహాన్ని ఎక్కడుంచిందీ తెలిపేందుకు వారు నిరాకరించడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అధ్యక్షుడు పుతిన్‌ను ఉద్దేశించి ల్యుద్మిలా మాట్లాడిన వీడియోను నవాల్నీ బృందం ఆన్‌లైన్‌లో ఉంచింది. 'అయిదు రోజులుగా ఇక్కడ నిరీక్షిస్తున్నాను. ఇకనైనా నా కుమారుడి మృతదేహాన్ని అప్పగించండి. అతడికి గౌరవప్రదంగా అంత్యక్రియలు జరపనివ్వండి. ఇక నిర్ణయం తీసుకోవాల్సింది మీరే'అని అందులో ఆమె కోరారు.

టొరంటో–న్యూయార్క్ విమానంలో మంటలు

టొరంటో: కెనడాలోని టొరంటో నుంచి న్యూయార్క్‌కు బయలుదేరిన విమానంలో మంటలు రావడంతో తిరిగి టొరంటోలోనే అత్యవసరంగా ల్యాండయ్యింది. ఈ నెల ఫిబ్రవరి 3వ తేదీన జరగ్గా సోమవారం వెలుగులోకి వచ్చింది. డెల్టా ఎయిర్ లైన్స్ ఆధీనంలోని ఎండీవర్ ఎయిర్‌కు చెందిన జెట్ విమానం ఈ నెల 3న టొరంటోలోని పీయర్సన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టుకు టేకాఫ్ తీసుకుంది. కొద్దిసేపటికే కాక్‌పిట్‌లో వైర్లు మండుతున్న వాసన రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. కెప్టెన్ పక్కనుండే విండ్‌షీల్డ్ ఎలక్ట్రికల్ కంట్రోల్ యూనిట్‌లో నిప్పు రవ్వలు, మంటలు రావడం గమనించిన సిబ్బంది వెంటనే విండ్ షీల్డ్ హీటర్‌ను ఆపు చేశారు. పై అధికారుల సూచన మేరకు విమానాన్ని తిరిగి టొరంటోలో ల్యాండ్ చేశారు. ఘటనలో విమానంలోని 74 మందికి ఎటువంటి అపాయం కలగలేదని ఎండీవర్ ఎయిర్ తెలిపింది.

కిమ్‌కు లిమోజిన్ పంపిన పుతిన్



సియోల్: ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ విలాసవంతమైన లిమోజిన్ కారును కానుకగా పంపారు. కిమ్ వ్యక్తిగత అవసరాల కోసం అధ్యక్షుడు పుతిన్ దీనిని పంపించినట్లు రష్యా ప్రతినిధి పెస్కోవ్ తెలిపారు. ఇటీవల రష్యాలో పర్యటన సమయంలో అధ్యక్షుడు పుతిన్ ఈ లిమోజిన్‌ను ఆయనకు చూపించారని గుర్తు చేశారు. ఈ కానుకను కిమ్ సోదరి కిమ్ యో జోంగ్, మరో ఉన్నతాధికారి ఆదివారం స్వీకరించి, పుతిన్‌కు కిమ్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. రష్యా, ఉత్తరకొరియాల మధ్య బంధం బలోపేతం అవుతోందనేందుకు ఇది తాజా ఉదాహరణ అని పరిశీలకులు అంటున్నారు. పుతిన్ చర్య ఐక్యరాజ్యసమితి ఆంక్షల ఉల్లంఘన కిందికి వస్తుందని కూడా వ్యాఖ్యానిస్తున్నారు.

పుణేలో రూ.1,100 కోట్ల మెఫెడ్రిన్ స్వాధీనం

పుణే: మహారాష్ట్ర పోలీసులు మెఫెడ్రిన్ అనే సింథటిక్ డ్రగ్‌ను పెద్ద మొత్తంలో పట్టుకుని, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. 'ఆదివారం ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి ఎండీగా పిలిచే రూ.3.85 కోట్ల విలువైన 1.75 కిలోల మెఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నాం. విచారణలో వారు వెల్లడించిన సమాచారం మేరకు కుర్‌కుంభ్ ఏరియాలోని రెండు గోదాముల్లో సోదాలు జరిపి మరో 600 కిలోల ఎండీ డ్రగ్‌ను పట్టుకున్నాం. దీని విలువ రూ.1,100కోట్లు పైమాటే'అని పుణే పోలీస్ కమిషనర్ అమితేశ్ కుమార్ చెప్పారు. అంతకుమించి వివరాలను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు.

సీబీఎస్‌ఈ టెన్త్, 12వ తరగతి పరీక్షలు...

ఇక ఏడాదికి రెండుసార్లు

రాయ్‌పూర్: ఏడాదికి ఒక్కసారి మాత్రమే సీబీఎస్‌ఈ పదో, 12వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో కొందరు తీవ్ర పరీక్షల ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఇకపై ఏడాదికి రెండు సార్లు ఈ పరీక్షలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్‌లోని 211 పాఠశాలలను పీఎం శ్రీ(స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద నవీకరించే పథకాన్ని మంగళవారం రాయ్‌పూర్‌లో ప్రారంభించిన సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడారు. '' నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా విద్యార్థులపై అకడమిక్ ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో ఇకపై ఏడాదికి రెండుసార్లు పది, 12వ తరగతి బోర్డు పరీక్షలు రాయొచ్చు. రెండుసార్లు రాస్తే రెండింటి ఫలితాల్లో అధిక స్కోరు సాధించిన వాటినే లెక్కలోకి తీసుకుంటారు. విద్యార్థులకు మరింతగా ఎగ్జామ్స్‌కు సిద్ధమయ్యే సమయం, అవకాశం లభిస్తుంది. వారిపై పరీక్షల ఒత్తిడి సైతం తగ్గుతుంది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి దీనిని అమలుచేస్తాం'' అని ఆయన అన్నారు. అయితే, ఈ బోర్డు పరీక్షలు తొలి దఫా 2024 నవంబర్–డిసెంబర్‌లో, రెండో దఫా 2025 ఫిబ్రవరి–మార్చిలో జరుగుతాయని కేంద్ర విద్యా శాఖలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తాజా నిర్ణయంపై విద్యా శాఖ ఉన్నతాధికారి ఒకరు వివరణ ఇచ్చారు. ''విద్యార్థి ఒకవేళ మొదటి దఫా పరీక్షలోనే తాను అద్భుతంగా రాశానని భావిస్తే రెండో దఫాలో పరీక్ష రాయాలా వద్దా అనేది అతని ఇష్టమే. కచ్చితంగా రెండోసారి రాసి తీరాలనే నిబంధన లేదు'' అని ఆయన చెప్పారు.

రిటైరైన 5 నెలలకు తీర్పా?

మద్రాస్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర విస్మయం

న్యూఢిల్లీ: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఒకరు రిటైరైన ఐదు నెలలకు తీర్పు వెలువరించడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. దాన్ని పక్కనబెట్టి మళ్లీ విచారణ చేపట్టాలని మద్రాస్ హైకోర్టును ఆదేశించింది. రిటైర్డు జడ్జి నిర్వాకంపై ఏం చేయాలో నిర్ణయించాలని కోరింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మతివనన్ ఓ క్రిమినల్ కేసులో 2017 ఏప్రిల్ 17న ఏకవాక్య తీర్పు వెలువరించారు. మే 26న రిటైరయ్యారు. మరో 5 నెలలకు ఏక వాక్య తీర్పుపై 250 పేజీల తీర్పు వెలువరించారు. దీనిపై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం విస్మయం వెలిబుచ్చింది. తొలి తీర్పు నుంచి రిటైరయ్యే మధ్య ఐదు వారాల వ్యవధిలో ఆయన ఏం చేశారని ప్రశ్నించింది.

హైవేలపై ట్రాక్టర్–ట్రాలీలు వద్దు

పంజాబ్–హరియాణా హైకోర్టు

చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కోసం 'ఢిల్లీ చలో' చేపట్టిన పంజాబ్ రైతులు జాతీయ రహదారిపై ట్రాక్టర్–ట్రాలీల్లో తరలిరావడాన్ని పంజాబ్–హరియాణా హైకోర్టు తప్పుబట్టింది. ''మోటార్ వాహనాల చట్టం ప్రకారం హైవేలపై ఇలా ట్రాక్టర్–ట్రాలీ నడపకూడదు. ఢిల్లీకే వెళ్లాలనుకుంటే రైతులు బస్సులోనో, ప్రజారవాణా సదుపాయాన్నో వాడుకోవచ్చు. రైతులు సరిహద్దులపై గుమికూడకుండా చూడాల్సిన బాధ్యత పంజాబ్ ప్రభుత్వానిదే'' అని చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, జస్టిస్ లపితా బెనర్జీల ధర్మాసనం సూచించింది. ''రైతులతో ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రుల బృందం జరిపిన చర్చల తాలూకు సమగ్ర వివరాలతో కూడిన తాజా నివేదికను అఫిడవిట్ రూపంలో సమర్పించండి'' అని కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. పప్పు లు, మొక్కజొన్న, పత్తి పంటలను కనీస మద్దతు ధరకు ప్రభుత్వ ఏజెన్సీలు కొంటాయని, ఆ మేరకు ఐదేళ్ల ఒప్పందం చేసు కుందామని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను రైతుసంఘాలు తోసిపుచడం తెల్సిందే.

పార్లమెంట్‌లో చట్టం తెండి: పంథేర్

పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని శంభు బోర్డర్‌పాయింట్ వద్ద వందలాది మంది రైతులతో కలిసి రైతు సంఘం నేత శర్వాన్‌సింగ్ పంథేర్ ఉద్యమంలో పాల్గొన్నారు. '' మా డిమాండ్ల మేరకు బిల్లు తెచ్చి చట్టంగా మార్చండి. ప్రధాని మోదీ నిజంగా రైతుల బాగు కోరే వారే అయితే, సంకల్పబలం ఉంటే రోజంతా పార్లమెంట్ ప్రత్యేక సెషన్ నడిపి అయినా చట్టం తెండి. విపక్షాల్లో ఒక్క పార్టీ కూడా ఇందుకు అభ్యంతరం చెప్పబోదు'' అని పంథేర్ అన్నారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



- 5.5 లక్షలకు చేరిన ప్రయాణికులు
- తరుముకొస్తున్న ఎండలతో రద్దీ రెట్టింపయ్యే అవకాశం
- పెండింగ్‌లో నాగ్‌పూర్ మెట్రో బోగీలు

రద్దీ ఇలా...

కారిడార్-1 (మియాపూర్-ఎల్బీనగర్)- రోజువారీ ప్రయాణికులు సుమారు 2.70 లక్షలు
కారిడార్-2 (జేబీఎస్-ఎంజీబీఎస్) మధ్య ప్రయాణికులు రోజుకు - సుమారు 30 వేలు
కారిడార్-3 (రాయదుర్గం-నాగోల్) మధ్య ప్రయాణికుల రద్దీ సుమారుగా : 2.50 లక్షలు

ప్రయాణికుల రద్దీ అత్యధికంగా ఉన్న స్టేషన్లు

రాయదుర్గం: 32 వేలు
ఎల్బీనగర్: 30 వేలు
అమీర్‌పేట్: 29 వేలు
మియాపూర్: 23 వేలు

ఏవీ ఎక్స్‌ట్రా బోగీలు?

రద్దీ పెరిగినా అందుబాటులోకి రాని మెట్రో అదనపు సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న రూట్‌లలో ప్రతి 3 నిమిషాలకు ఒక మెట్రో అందుబాటులో ఉన్నా మరో రెండు మెట్రో రైళ్లకు సరిపడా ప్రయాణికులు స్టేషన్‌లలో పడిగాపులు కాస్తున్నారు. రాయదుర్గం-నాగోల్, ఎల్బీనగర్-మియాపూర్ రూట్‌లలో నడిచే రైళ్లు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ మేరకు మెట్రోలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఐటీ కారిడార్‌లలో పని చేసే ఉద్యోగులు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారు సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేకపోతున్నారు. అలాగే విద్యార్థులు కూడా ఇబ్బందులనెదుర్కొంటున్నారు. మరోవైపు రోజు రోజుకు ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నా అందుకు తగిన విధంగా మెట్రో సేవలు విస్తరణకు నోచడం లేదు. ప్రస్తుతం మూడు కారిడార్‌లలో రోజుకు సుమారు 1065 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి రోజు సుమారు 5.5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కనీసం మరో లక్షన్నర మంది అదనంగా మెట్రోపైన ఆధారపడే అవకాశం ఉంది. కానీ ఇందుకు తగినట్లుగా మెట్రో సేవలు మాత్రం విస్తరణకు నోచకపోవడం గమనార్హం.

నాగ్‌పూర్ మెట్రో అటకెక్కినట్లేనా....

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బోగీలను ఏర్పాటు చేసేందుకు గతేడాది ప్రణాళికలను రూపొందించారు. ప్రస్తుతం ఒక్కో ట్రైన్‌కు 3 బోగీలు మాత్రమే ఉన్నాయి. ఒక ట్రిప్పులో అతికష్టంగా వెయ్యి మంది ప్రయాణం చేసినా మరో రెండు వేల మంది మెట్రో కోసం ఎదురుచూడవలసి వస్తుంది. రాయదుర్గం, హైటెక్‌సిటీ, అమీర్‌పేట్, మియాపూర్, ఎల్బీనగర్, తదితర స్టేషన్‌లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలోనే ఇపుడు ఉన్న వాటికి తోడు మరో 4 రైళ్లను అదనంగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు నాగ్‌పూర్ మెట్రో నుంచి అద్దె ప్రాతిపదికన నగరంలో నడిపేందుకు అప్పట్లో కసరత్తు చేపట్టారు. కానీ ఈ ప్రతిపాదనల్లో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. దీంతో రైళ్ల కొరత ఒక సవాల్‌గా మారింది. నాగోలు నుంచి రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్ మధ్య ప్రతి 3 నిమిషాలకు ఒక ట్రిప్పు అందుబాటులో ఉంది. జేబీఎస్ -ఎంజీబీఎస్ మధ్య మాత్రం 10 నిమిషాల నుంచి 15 నిమిషాల మధ్య ఒకటి చొప్పున రైళ్లను నడుపుతున్నారు. 69 కిలోమీటర్లు ఉన్న మూడు మెట్రో కారిడార్‌లలో కలిపి 56 మెట్రో రైళ్లు ప్రతి రోజు సుమారు 25 వేల కిలోమీటర్లు తిరుగుతున్నట్లు అంచనా.

బోగీలు పెరిగితేనే రద్దీ నియంత్రణ...

ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న నాగోల్-రాయదుర్గం, మియాపూర్-ఎల్బీనగర్ కారిడార్‌లలో ప్రతి 3 నిమిషాలకు ఒక ట్రైన్ అందుబాటులో ఉన్నప్పటికీ బోగీల కొరత వల్ల ప్రయాణికుల రద్దీని నియంత్రించడం అసాధ్యంగా మారింది. ఇప్పుడు ఉన్న 3 బోగీలకు తోడు మరో 3 బోగీలను అదనంగా ఏర్పాటు చేస్తే ప్రయాణికుల డిమాండ్ మేరకు మెట్రో సేవలు పెరుగుతాయి. గతేడాది జూలై 4వ తేదీ నాటికే మెట్రో ప్రయాణికుల సంఖ్య 5.10 లక్షలకు చేరింది. ప్రస్తుతం ఇది 5.5 లక్షలు దాటి ఉండవచ్చునని అంచనా. మరి కొద్ది రోజుల్లోనే 6 లక్షలకు పైగా మెట్రోల్లో ప్రయాణం చేసే అవకాశం ఉంది. ఇందుకు తగినవిధంగా బోగీలను పెంచడం ఒక్కటే పరిష్కారం.

ఆమోదించిన బడ్జెట్

రెవెన్యూ ఆదాయం:	5938
రెవెన్యూ వ్యయం:	3458
రెవెన్యూ మిగులు:	2480
మూలధన ఆదాయం:	4479
మూలధన వ్యయం:	4479
బడ్జెట్:	7937



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి





అంకెల బడ్జెట్!

కాగితాల్లో తప్ప నిధులేవీ ?

- రూ.7937 కోట్లతో బల్దియా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం
- రూ.3,492 కోట్లివ్వాల్సిందిగా తీర్మానం ..ప్రభుత్వానికి వినతి
- నిర్లక్ష్యపు అధికారులను పంపేందుకు సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: కాగితాల్లో తప్ప వాస్తవంగా లేని నిధులతో బడ్జెట్‌ను రూపొందించారని సభ్యులు వాదించినప్పటికీ, రూ.7937 కోట్ల బడ్జెట్‌కు జీహెచ్ఎంసీ పాలకమండలి ఆమోదం తెలిపింది. బడ్జెట్‌లో ఆశించినట్లుగా ప్రభుత్వం నిధులందజేయాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో రావాల్సిన నిధులు, పరిహారాలు రూ. 3492 కోట్లిచ్చి ఆదుకోవాలని తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని , బడ్జెట్‌ను ఆమోదించాల్సిందిగా కోరుతూ ప్రభుత్వానికి పంపుతున్నట్లు మేయర్ తెలిపారు. బడ్జెట్‌ను ఏకగ్రీవంగా సభ ఆమోదించినట్లు ప్రకటించారు. అంతకుముందు..సోమవారం వాయిదా పడ్డ సాధారణ సమావేశాన్ని కొనసాగించారు. బడ్జెట్ భేటీ ముఖ్యాంశాలిలా..

జీహెచ్ఎంసీ అంచనా బడ్జెట్‌ను 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.7,937 కోట్లతో రూపొందించినా అందులో పేర్కొన్నట్లుగా ఆదాయ మార్గాలు లేవని, నిధులు లేకుండా బల్దియాను ఎలా నడుపుతారని సభ్యులు ప్రశ్నించారు. ఇది వాస్తవ బడ్జెట్ కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నుంచి తగిన ఆర్థికసహాయం అందనిదే మనుగడ కష్టమని పేర్కొన్నారు. వారి వాదనల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీహెచ్ఎంసీకి వివిధ రూపాల్లో రావాల్సిన నిధులు కోరుతూ, బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో జీహెచ్ఎంసీ ఆదాయంగా చూపిన దాదాపు రూ.3,600 కోట్లలో వేతనాలు, తదితరమైనవి పోను మిగిలే స్వల్ప నిధులతో బల్దియాను ఎలా నడుపుతారని ఎమ్మెల్యే, మాజీ మేయర్ మాజిద్ హుస్సేన్ ప్రశ్నించారు. కాగితాల్లో సంఖ్యలు తప్ప జీహెచ్ఎంసీకి నిధులు లేవన్నారు. గతంలో మిగులు నిధులతో ఉన్న జీహెచ్ఎంసీ అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు పొందనిదే జీహెచ్ఎంసీ నడవదన్నారు.

గతంలో నిధుల నిల్వ

- బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నరసింహారెడ్డి మాట్లాడుతూ, మహంతి కమిషనర్‌గా ఉన్నప్పుడు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉండేవని, 2014లో రూ.3 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉండగా, ప్రస్తుతం అప్పులు పెరిగి నవ్వులపాలవుతున్నామన్నారు. గత తొమ్మిదేళ్లుగా రాష్ట్రప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రానందున అప్పులు పెరిగాయన్నారు. ఆస్తిపన్ను బకాయిలపై పెనాల్టీలను పూర్తిగా ఎత్తివేస్తే రూ.500 కోట్లు వస్తాయని అందుకు ప్రభుత్వానికి నివేదించాలన్నారు.
- బీజేపీ సభ్యుడు శ్రవణ్ మాట్లాడుతూ, బడ్జెట్ లెక్కలన్నీ తప్పుల తడకలని, ఒక తప్పుసరిదిద్దుకోలేక వంద తప్పులు చేసినట్లుందంటూ రెవెన్యూ సర్‌ప్లస్ నిధులు రూ. 1300 కోట్ల నుంచి ఏకంగా రూ.2500 కోట్లకు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. కాకిలెక్కలు తప్ప వాస్తవ వివరాలు లేవన్నారు. మ్యుటేషన్ ఫీజు రూపేణా ఆదాయం రూ. 2.17 కోట్ల నుంచి ఒక్కసారిగా రూ.200 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు.

అప్పులే కాదు..అభివృద్ధినీ చూడాలి

గత ప్రభుత్వం వల్ల అప్పులయ్యాయంటున్నారని, జరిగిన అభివృద్ధిని చూడాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రతివాదనలకు దిగారు. ఫ్లై ఓవర్లు, తదితరమైనవి చూడాలని మాజీ మునిసిపల్ మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు గెలిచారన్నారు. టౌన్‌ప్లానింగ్‌లోని అక్రమాలను అరికడితే జీహెచ్ఎంసీకి ఆదాయం పెరుగుతుందని కాంగ్రెస్ సభ్యుడు జగదీశ్వర్ గౌడ్ సూచించారు. కిందిస్థాయి సిబ్బంది, మధ్యవర్తులు లంచాల ద్వారా పొందుతున్న కోట్ల రూపాయలు జీహెచ్ఎంసీకి వచ్చే మార్గం ఆలోచించాలన్నారు. జీహెచ్ఎంసీలో చేసిన పనులతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు గెలిచారని, అందుకు ఒక్కో ఎమ్మెల్యేకు జీహెచ్ఎంసీ రూ.296 కోట్లు అప్పు చేసిందని బీజేపీ సభ్యుడు తోకల శ్రీనివాసరెడ్డి అన్నారు.

- జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్నే అని , దాన్ని సక్రమంగా వసూలు చేయాలని, ఎంఐఎం ఎమ్మెల్యే జుల్ఫీకర్‌అలీ పేర్కొనగా, అమీర్‌పేట కార్పొరేటర్ స్పందిస్తూ, ఓల్డ్‌సిటీలో ఎన్ని ప్రాపర్టీలకు ఎంత మంది చెల్లించారో, పెండింగ్ బకాయిలెన్నో కమిషనర్ వెల్లడించాలన్నారు.
- మల్కాజిగిరి కార్పొరేటర్ మాట్లాడుతూ, తమ డివిజన్‌లో నాలాలోపడి బాలిక మరణించినా ఇప్పటికీ నాలా ఆధునీకరణ పనులు పూర్తికాలేదు. మల్కాజిగిరికి ఎంపీగా పనిచేసిన రేవంత్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గం మాదిరిగానే మల్కాజిగిరి నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ, నిధులు ఇవ్వాలని కోరారు.
- కాంగ్రెస్ కార్పొరేటర్ విజయారెడ్డి పదేపదే రన్నింగ్ కామెంటరీ చేస్తున్నారంటూ మేయర్ అసహనం వ్యక్తం చేశారు. అలాగే వ్యవహరిస్తే సస్పెండ్ చేయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు.

ఆస్తిపన్ను సవరణలు చేస్తాం

కమిషనర్ రోనాల్డ్‌రాస్

జీహెచ్ఎంసీ యాక్ట్ మేరకే ఆస్తిపన్ను విధింపు జరుగుతోంది. జరగబోయే రివిజన్‌లో మార్పులు చేస్తాం. జీఐఎస్ మ్యాపింగ్‌తో డోర్‌నెంబర్ల కోసం టెండర్లు పిలిచాం. సెల్లార్లలో వ్యాపారాలపై పోలీసు విభాగంతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహిస్తాం.నివాసభవనాల్లో వ్యాపార కార్యకలాపాలపై తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.



ప్రజల సొమ్ముతో జడ్సీల విలాసాలు

ప్రజల సొమ్ముతో విలాసాలు చేస్తున్న జోనల్ కమిషనర్లు, వారి కిందివారు కార్పొరేటర్ల ఫోన్లకు స్పందించరని సభ్యులు ధ్వజమెత్తారు. వారికంత అహంకారం పనికిరాదని మేయర్ సైతం పేర్కొన్నారు. సభ్యుల వేదనలు నిజమేనని అడిషనల్ కమిషనర్ యాదగిరిరావు రూఢీ చేశారు. మేయర్, కమిషనర్లు స్పందించినా వారు స్పందించరని వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ తీరును సభలో ప్రస్తావించారు. ఆ మేడమ్‌కు ఎవరన్నా లెక్కలేదని, కార్పొరేటర్లను హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉప్పల్ తిప్పలు తీర్చండి



ఉప్పల్ నియోజకవర్గ సమస్యలపై కౌన్సిల్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఇక్కడి చెరువులను అభివృద్ధి చేయాలి. గుర్రపు డెక్క తొలగించాలి. డ్రైనేజీ సమస్యలు, రోడ్లు, వీధి దీపాలు, గ్రేవ్‌యార్డ్, స్ట్రీట్ డాగ్స్, పార్కింగ్ తదితర ముఖ్యమైన అంశాలపై అధికారులు దృష్టిసారించాలి. వెంటనే పరిష్కారం చూపాలి. రహదారులు బాగు చేయక తరుచు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

– బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, ఉప్పల్

సెల్ఫ్ అసెస్‌మెంట్ల పేరిట అక్రమాలు

సెల్ఫ్ అసెస్‌మెంట్ల పేరిట అక్రమాలు జరుగుతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు జరపడం లేరని వారి తీరును సభ్యులు ఎండగట్టారు. పెనాల్టీలతో సహ పన్నులు వసూలు చేస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ధ్వజమెత్తారు. పారిశుధ్యం పరమ అధ్వాన్నంగా ఉందని, తగినంత మంది పారిశుధ్య కార్మికులు లేరన్నారు. నివాస భవనాలుగా పేర్కొంటూ రాత్రికి రాత్రే పబ్బులు, రెస్టారెంట్లు, ఓయో రూమ్స్, హాస్టళ్లు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, అక్రమ మార్గాల్లో వసూళ్లే అందుకు కారణమని ఆరోపించారు. ఎల్బీనగర్ జోన్‌లోని సాధారణ ప్రాంతాలకు, జూబ్లీహిల్స్‌లోని సంపన్న ప్రాంతాలకు ఒకేరకమైన ఆస్తిపన్ను ఉందని ఆక్షేపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను మాతృసంస్థలకు పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు మేయర్ తెలిపారు.

ఇంకా.. సభ్యులేమన్నారంటే..

- అధికారులపై విమర్శలు రావడంతో..అలాంటి అధికారుల వివరాలు సేకరించాలని, కార్పొరేటర్లు వారి పేర్లు ఇవ్వాలని మేయర్ సూచించారు. వారిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తామన్నారు.
- పటాన్‌చెరు-ఆర్‌సీపురం ప్రాంతాలకు సంబంధించి గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రూ.10 కోట్లు కేటాయించడంతో తాము పనులకు శంకుస్థాపనలు కూడా చేసుకున్నామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని నిలిపివేస్తూ జీఓ ఇచ్చిందని బీఆర్ఎస్ కార్పొరేటర్ సింధు తెలిపారు. ఇప్పుడు తమకు ఆ నిధులు ఏ రకంగానైనా జీహెచ్ఎంసీ నుంచైనా ఇచ్చేలా చూడాలని కోరారు.
- వాటర్‌బోర్డుకు జీహెచ్ఎంసీకి సమన్వయం లేదు. ప్రజలు ఎవరిని సంప్రదించాలో తెలియక అవస్థలు పడుతున్నారు.
- నగరంలో రెండు నెలలుగా పారిశుధ్యం బాగు లేదని బీఆర్ఎస్ సభ్యులు పేర్కొనడంతో అంతకుముందు బాగుందా అని కాంగ్రెస్ సభ్యులు ఎదురుదాడికి దిగారు. ఒక సందర్భంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.
- కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులే దాదాపు 1100 కోట్లున్నాయి. జీహెచ్ఎంసీలో నిధుల్లేవు. పనులెలా జరుగుతాయి? అప్పులు చూశాక జీహెచ్ఎంసీ పటిష్ఠంగా ఉందనగలమా?
- గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వం నుంచి రూ. 1700 కోట్లు మాత్రమే వచ్చాయి. దాంతో రూ.7 వేల కోట్లఅప్పులు చేయాల్సి వచ్చింది.

న్యూస్‌రీల్

ఏం కష్టమొచ్చిందో...?

- కొడుకుతో సహా వృద్ధురాలి ఆత్మహత్య

మల్కాజిగిరి: అరవై ఏడేళ్ల వయసున్న వృద్ధురాలు...42 ఏళ్ల వయసున్న ఆమె కుమారుడు ఆత్మహత్య చేసుకున్నారు. మల్కాజిగిరి పటేల్ నగర్‌లో మంగళవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వయసులో వారికి ఏం కష్టం వచ్చిందోనని స్థానికులు చర్చించుకోవడం కన్పించింది. మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ కృష్ణమల్ తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్‌కు చెందిన స్వరూప (67)కు కుమారుడు శ్రీకాంత్(42) ఉన్నాడు. ఇతడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని సోదరుడు రవి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. 15 ఏళ్ల క్రితం భర్తతో విభేదాలు రావడంతో స్వరూప విడిపోయి మల్కాజిగిరి పటేల్‌నగర్‌లో నివాసముంటున్నది. అలాగే శ్రీకాంత్‌కు వివాహం అయినప్పటికీ భార్యతో విభేదాలు రావడంతో విడిపోయి తల్లితో కలిసి ఉంటున్నాడు. కాగా గత రెండు రోజులుగా స్వరూప, శ్రీకాంత్‌లు కనిపించకపోవడంతో మంగళవారం ఇంటి యజమాని వారు ఉంటున్న పోర్షన్‌కు వెళ్లి కిటికీలోంచి చూడగా స్వరూప ఉరి వేసుకుని ఉండటం గమనించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలగొట్టారు. లోనికి వెళ్లి చూడగా మరొక రూములో శ్రీకాంత్ కూడా ఉరి వేసుకుని ఉండడం గమనించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్ నుంచి వచ్చిన రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణమల్ తెలిపారు.

స్టాండింగ్ కమిటీకి 9 నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు నామినేషన్ల తొలిరోజైన మంగళవారం 9 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు వేసిన వారిలో ఆవుల రవీందర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కంది శైలజ, సబితాబేగం, మన్నె కవితారెడ్డి, దూసరి లావణ్య, బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, చింతల విజయశాంతి, సబిత కిశోర్ ఉన్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ పేర్కొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం



ఔటర్‌పై నుంచి రెయిలింగ్‌ను ఢీ కొట్టి చెట్లలో పడిపోయిన కారు

ఔటర్‌పై రెయిలింగ్‌ను ఢీ కొట్టిన కారు

- ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి
- మరో వ్యక్తికి తీవ్ర, ముగ్గురికి స్వల్ప గాయాలు
- మద్యం మత్తులో డ్రైవింగ్‌తోనే ప్రమాదం



మృతుడు వంశీ(ఫైల్)

మణికొండ: అసలే ఔటర్ రింగురోడ్డు...ఓ వైపు మద్యం మత్తు..మరోవైపు అతివేగంతో కారు అదుపుతప్పింది. రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ను వేగంగా ఢీకొని రోడ్డు కిందకు దిగి పడిపోయింది. కారులోని ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా..మరొకరు తీవ్రంగా..ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ అకాడమీ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌లోని ఇందునగర్ కాలనీకి చెందిన వంశీ (26), తన మిత్రులు మధుకుమార్, శ్రీశైలం, సాయికిరణ్, సిహెచ్.రాములుతో కలిసి మధుకుమార్‌కు చెందిన ఐ10 కారులో తెల్లవారు జామున 3.30 గంటలకు గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్నారు. మధుకుమార్ అతిగా మద్యం తాగి కారును వేగంగా నడపటంతో అది పోలీసు అకాడమీ సమీపంలోని ట్రెక్‌పార్క్ వద్దకు రాగానే అదుపు తప్పి పక్కనున్న రెయిలింగ్‌ను ఢీ కొని కిందకు పడిపోయింది. దాంతో అందులో ఉన్న వంశీ అక్కడికక్కడే మృతి చెందగా..సాయికిరణ్ అనే యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి వచ్చిన మృతుని సోదరుడు ప్రకాష్ ఫిర్యాదు మేరకు కారును అతివేగంగా మద్యం తాగి నడపటంతో పాటు ఓ వ్యక్తి మృతికి కారణమైన మధన్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి, గాయాలపాలైన నలుగురిని సమీపంలోని షాదాన్ ఆసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం నిర్వహించి సాయంత్రం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కారును నడిపిన మధుకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భారీ కమర్షియల్ వాహనాలకు నో ఎంట్రీ

- నగరంలోకి వీటి రాకపోకలు పూర్తిగా నిషేధం
- ప్రతి కేటగిరీకీ నిర్ణీత సమయం కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన నగర పోలీసు కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. సిటీలోకి భారీ వాహనాల రాకపోకల్ని పూర్తిగా నిషేధిస్తూ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి ఉన్న వాహనాలకు సైతం నిర్ణీత సమయాలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. నగరంలో ఉన్న రహదారుల్ని మొత్తం 91 రకాలైన రూట్లుగా పోలీసులు విభజించారు. వీటిలో కొన్నింటిలో కొన్ని రకాలైన వాహనాలను నిషేధించడం, నిర్దేశిత సమయాలు కేటాయించడం చేశారు. ఈ మార్గాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆయా వాహనాలు ప్రయాణించాలంటే తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.



- ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే 10 టన్నుల కంటే ఎక్కువ బరువుతో కూడిన కమర్షియల్ వాహనాలు నగరంలోకి ప్రవేశించడాన్ని పూర్తిగా నిషేధించారు.
- లోకల్ లారీలతో పాటు నిర్మాణ సామాగ్రి తరలించే 10 టన్నుల కంటే ఎక్కువ బరువుతో కూడిన వాహనాలు రాత్రి 11 ఉదయం 7 గంటల మధ్య మాత్రమే నగరంలో సంచరించాలి.
- డీసీఎం, ఐచర్, స్వరాజ్ మజ్దా వంటి మధ్య తరహా గూడ్స్ వాహనాలు (3.5 టన్నుటు-12 టన్నుల మధ్య బరువుతో కూడినవి) మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 8 వరకు మాత్రమే తిరగాలి.
- ప్రైవేట్ బస్సులు కేవలం రాత్రి 10 నుంచి ఉ. 8 గంటల మధ్యనే నగరంలో ప్రయాణించాలి.
- అత్యంత నెమ్మదిగా నడిచే కేటగిరీకి చెందిన చేతితో తోసే బళ్లు, వివిధ రకాలైన జంతువులు లాగే బళ్లు, సైకిల్ రిక్షాలు, ట్రాక్టర్లు తదితరాల సంచారాన్ని నగరంలోని కీలకమైన 61 టూర్లలో నిషేధించారు.
- భవన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించే వాహనాల్లో 2 నుంచి 6 టన్నుల మధ్య బరువు కలిగినవి ఉ. 11.30 నుంచి సాయంత్రం 5, రాత్రి 10 నుంచి ఉదయం 9 మధ్య సంచరించాలి.
- వీటిలో 10 టన్నులు అంతకంటే ఎక్కువ బరువుతో కూడిన వాహనాలు కేవలం రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల మధ్య మాత్రమే నగరంలో సంచరించాలి.

తాగు నీటికి నో ఫికర్

నీటి నిల్వ, సరఫరాపై ఆరా

- అదనంగా 15 నుంచి 20 ఎంజీడీల నీటి సరఫరా
- తాగునీటి ఫిర్యాదులకు ప్రాధాన్యం
- వేసవి కార్యాచరణపై ఎండీ సుదర్శన్ రెడ్డి సమీక్ష



సమావేశంలో జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరంతో పాటు ఓఆర్ఆర్ పరిధి వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, అవసరం మేరకు తగినంత జలాశయాల్లో నీరు అందుబాటులో ఉందని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వేసవి కార్యాచరణ, ఎస్టీపీలపై జలమండలి ట్రాన్స్ మిషన్, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంతోపాటు ఓఆర్ఆర్ లోపలి గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జలమండలి ప్రస్తుతం రోజూ 565 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తుందని, వేసవి కాలం కోసం అదనంగా మరో 15 నుంచి 20 ఎంజీడీల నీరు అవసరముందని అంచనా వేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. సీజీఎం నుంచి మేనేజర్ స్థాయి వరకు.. క్షేత్రస్థాయిలో అధికారులు సొంతంగా ప్రణాళికలు వేసుకుని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరా, కలుషిత నీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ట్యాంకర్లు, అదనపు నీటి కోసం వచ్చే వినతులను పరిగణలోకి తీసుకుని సత్వరమే పరిష్కరించాలన్నారు.

ట్యాంకర్ల సరఫరాపై విజిలెన్స్ ఆరా

నగరంలో నీటి సరఫరా, ట్యాంకర్ల రవాణాపై విజిలెన్స్ అధికారులు డ్రైవ్ చేపట్టాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి సూచించారు. నగర వ్యాప్తంగా ప్రస్తుతం 70 మంచినీటి ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా.. అవసరమైతే అదనపు స్టేషన్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు పొందాలని సూచించారు. ఇప్పటికే అన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. అన్ని స్టేషన్ల కెమెరాలు ప్రధాన కార్యాలయానికి అనుసంధానమై ఉన్నట్లు వివరించారు. నిరంతరం వాటి ద్వారా అక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో రహదారులపై మురుగునీరు పొంగకుండా ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.

మోటార్లు బిగిస్తే చర్యలు

తాగునీటి సరఫరా సమయాల్లో నల్లాలకు మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు తప్పవని జలమండలి ఎండీ హెచ్చరించారు. కొన్ని ప్రాంతాల్లో నల్లాలకు మోటర్లు బిగించి నీటిని తోడుతున్నట్లు బోర్డు దృష్టికి వచ్చినట్లు తెలిపారు. దీనివల్ల లో-ప్రెజర్ సమస్య తలెత్తి.. మిగతా ప్రజలకు ఇబ్బందులు వస్తున్నట్లు వివరించారు. ఇలాంటి వారి కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కు ఆదేశించారు.

రంజాన్ నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

వేసవిలోనే రంజాన్ మాసం ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట్ల మసీదులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని జలమండలి ఎండీ సూచించారు. మసీదు ప్రాంతాల్లో సీవరేజీ ఓవర్ ఫ్లో లాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దీని కోసం డివిజన్ కొక మినీ జెట్టింగ్ మిషన్ ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీలపై సమీక్ష

నగరంలో మురుగు నీటి శుద్ధి కోసం నిర్మిస్తున్న ఎస్టీపీలపైనా సమీక్షించారు. చివరి దశలో ఉన్న ఎస్టీపీల పనుల్ని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. అంతర్గత రోడ్లు, లైటింగ్, గార్డెనింగ్, వాల్ పెయింటింగ్ తదితర పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈడీ డాక్టర్ ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు



న్యాయమూర్తిని వేద మంత్రాలతో ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయానికి మంగళవారం తెలంగాణా హైకోర్టు నాయమూర్తి జస్టిస్ ఎంజి ప్రియ దర్శిని హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ, పాలకమండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి న్యామూర్తి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పూజారులు ఘనంగా సన్మానించి వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను ఆమెకు అందజేశారు.

ఆ కేసు కథ కంచికేనా?

- అత్యాచారం కేసును అనుకూలంగా మార్చుకున్న ఖాకీ
- నిందితులకు వత్తాసు, బాధితురాలికి తీవ్ర బెదిరింపులు
- ఫిర్యాదు వెనక్కు తీసుకోకుంటే చోరీ కేసు పెడతానని
- గత ఏడాది వెలుగులోకి ఓ మాజీ ఇన్‌స్పెక్టర్ వ్యవహారం
- ఆయనపై కేసు నమోదుకు నిర్ణయించిన ఉన్నతాధికారులు
- ప్రస్తుతం దీనిపై మిన్నకుండిపోయిన నగర పోలీసు విభాగం



సాక్షి, సిటీబ్యూరో: ఇతర కేసుల మాట ఎలా ఉన్నా.. అత్యాచారం ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదులకు మాత్రం పోలీసులు ప్రాధాన్యం ఇస్తారు. బాధితురాలిని వెంటనే భరోసా సెంటర్‌కు పంపడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తారు. దీనికి తోడు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కూడా తోడయ్యే వాటి విషయంలో మరింత అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉంటారు. అయితే బంజారాహిల్స్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి, లంచం ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదై, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ఓ అధికారి తీరు మాత్రం దీనికి భిన్నం. తన వద్దకు వచ్చిన బాధితురాలికి న్యాయం చేయడం మాట అటుంచి 'పెద్ద లైన' నిందితులతో కలిసి ఆమెనే బెదిరించాడు. ఈ కారణంగానే దారుణమైన ఉదంతానికి సంబంధించిన ఈ కేసు నమోదు దాదాపు నాలుగు నెలలు ఆలస్యమైంది. ఎట్టకేలకు విషయం బయటకు రావడంతో తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు కేసును సీసీఎస్‌కు బదిలీ చేయడంతో పాటు సదరు ఇన్‌స్పెక్టర్‌ను నిందితుడిగా చేర్చాలని నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు.

అప్పట్లోనే ఫిర్యాదు చేసిన బాధితురాలు...

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మాజీ చైర్మన్ మురళీ ముకుంద్, ఆయన కుమారుడు ఆకర్ష్ కృష్ణ బంజారాహిల్స్ రోడ్ నెం.12లో నివసిస్తున్నారు. వీరి వద్ద పని చేస్తున్న ఓ దళిత యువతిపై (22) అత్యాచారం చేశారన్నది ప్రధాన ఆరోపణ. తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు గత ఏడాది జూన్‌లో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న మురళీ ముకుంద్ కుటుంబీకులు ఈ కేసు నమోదు కాకుండా చూడటానికి ఆ బాధితురాలినే బెదిరించాలని పథకం వేశారు. ఈ విషయాన్ని అప్పట్లో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన అధికారి దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన ప్రోద్బలంతో ముకుంద్ కుటుంబీకులు బాధితురాలిపై ఓ 'చిత్రమైన కేసు' పెట్టారు. ఆమె తమ ఇంట్లో పని చేస్తూ ఐఫోన్‌లోని సిమ్‌కార్డులు తస్కరించినట్లు అందులో ఆరోపించారు. ఈ ఫిర్యాదును బాధితురాలికి చూపించిన సదరు ఇన్‌స్పెక్టర్ బెదిరింపులకు దిగారు. ముకుంద్ కుటుంబీకులపై చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోకపోతే ఈ ఫిర్యాదు ఆధారంగా క్రిమినల్ కేసు నమోదు చేస్తానని బెదిరించాడు.

ఆమెకు జరిగిన అన్యాయానికి రేటు...

అక్కడితో ఆగకుండా ఆ కేసులో అరెస్టు చేసి జైలుకు పంపిస్తానంటూ హెచ్చరించాడు. పలుమార్లు ఆమెకు ఫోన్ చేసిన సదరు అధికారి పదేపదే బెదిరింపులకు దిగాడు. ఓ దశలో ఆమెకు జరిగిన అన్యాయానికి రూ.1.7 లక్షల రేటు కట్టిన ఇన్‌స్పెక్టర్ ముకుంద్ కుటుంబీకుల నుంచి ఆ మొత్తం ఇప్పిస్తానని చెప్పాడు. ఈ సెటిల్‌మెంట్ చేసినందుకు సదరు అధికారికి భారీ మొత్తమే ముకుంద్ కుటుంబీకుల నుంచి అందినట్లు తెలిసింది. ఈ ఖాకీ బెదిరింపులకు భయపడిన బాధితురాలు తన ఫిర్యాదును వెనక్కు తీసుకుని మిన్నకుండిపోయింది. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన పరిణామాలతో ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ విషయం మీడియా ద్వారా తెలుసుకున్న బాధితురాలు ధైర్యం చేసి మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న అధికారులు విషయాన్ని అప్పటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. వారి ఆదేశాల మేరకు ఈ కేసును మహిళ భద్రత విభాగం అధికారులకు అప్పగించారు.

ఒక్కొక్కటిగా వెలుగులోకి వాస్తవాలు..

తమ దర్యాప్తులో భాగంగా మహిళ భద్రత విభాగం బాధితురాలిని సంప్రదించింది. ఆమె నుంచి వాంగ్మూలం సైతం నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే గత ఇన్‌స్పెక్టర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై మహిళ భద్రత విభాగం అధికారులు నగర పోలీసు కమిషనర్‌కు నివేదిక అందించారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన బంజారాహిల్స్ మాజీ ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదుకు ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అత్యాచారం నిరోధక చట్టంలో ఓ కీలకాంశం ఉంది. ఈ ఆరోపణల కింద వచ్చే ఫిర్యాదులను స్వీకరించడానికి నిరాకరించిన, దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులనూ నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దీని ఆధారంగా ఆయనపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యలకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. అత్యాచారం కేసును దర్యాప్తు నిమిత్తం నగర నేర పరిశోధన విభాగానికి (సీసీఎస్) బదిలీ చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మురళీ ముకుంద్‌ను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మాజీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకునే అంశానికి అనివార్య కారణాల నేపథ్యంలో బ్రేక్ పడింది. ప్రస్తుతం ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

బిట్స్ పిలానీలో సరికొత్త పీజీ కోర్సులు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న ఆటోమోటివ్ ల్యాండ్‌స్కేప్‌కు సంబంధించి మూడు సరి కొత్త పీజీ డిప్లొమా కోర్సులను అందుబాటుకి తీసుకొచ్చినట్లు బిట్స్ పిలానీ ప్రకటించింది. వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ కింద స్మార్ట్ మొబిలిటీ, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఆటోమోటివ్ సైబర్ సెక్యూరిటీలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. ఆటోమోటివ్ డొమైన్‌లలో పనిచేసే ఇంజినీర్లకు మరింత నైపుణ్యత కోసం పీజీ డిప్లొమా కోర్సులు ఎంతో దోహదపడతాయని పేర్కొంది. కెరీర్ కు ఎలాంటి విరామం లేకుండా కొనసాగించగల ఈ ప్రోగ్రామ్‌లను ప్రధాన ఆటోమోటివ్ కంపెనీల సహకారంతో రూపొందించి, అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ల కోసం మార్చి 18 వరకు దరఖాస్తులు చేసుకొవచ్చని విజ్ఞప్తి చేసింది.

ఘనంగా ఇగ్నో స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఆచార్యులు

నాంపల్లి: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 37వ స్నాతకోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలను మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ప్రాంతీయ కేంద్రం హైదరాబాద్ సంచాలకులు డాక్టర్ బి.రాజగోపాల్ అధ్యక్షతన ప్రారంభించగా ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కె.సీతారామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రానికి సంబంధించి 2471 డిగ్రీ, డిప్లొమా సర్టిఫికెట్ డిగ్రీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రమేశ్, డాక్టర్ సీఎం సౌజన్య, డాక్టర్ రాజు బోల్ల, డీపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గోల్ఫ్ టోర్నమెంట్

- వికారాబాద్‌లోని ఊటీ మాస్టర్స్‌లో పోటీలు
- విజేతకు రూ.కోటి బహుమానం

మణికొండ: భారత గోల్ఫ్ రంగంలో ప్రఖ్యాతి గాంచిన ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా(పీజీటీఐ) భాగస్వామ్యంతో వికారాబాద్‌లోని ఊటీ మాస్టర్స్ గోల్ఫ్ గ్రౌండ్‌లో నేటి నుంచి శనివారం వరకు టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డ్రీమ్ వ్యాలీ గ్రూప్ సీఎండీ కె.సంతోశ్ రెడ్డి, పీజీటీఐ సీఈఓ ఉత్తమ్‌సింగ్ తెలిపారు. మంగళవారం నార్సింగిలోని డ్రీమ్ వ్యాలీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టోర్నమెంట్ విశేషాలను వారు వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా రెండోసారి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అయితే, గోల్ఫ్ క్రీడకు మన రాష్ట్రంలో అంతగా ప్రోత్సాహం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తే క్రీడాకారులు పెరిగే అవకాశం ఉందన్నారు. టోర్నమెంట్‌లో మొత్తంగా 126 మంది క్రీడాకారులు పాల్గొనుండగా రాష్ట్రానికి చెందిన వారు ఆరుగురు ఉన్నారని తెలిపారు. విజేతకు రూ.కోటి పురస్కారం ఉంటుందన్నారు. అనంతరం పూర్వ చాంపియన్లు మను గండాస్, అమన్‌రాజ్‌తో కలిసి టోర్నమెంట్ మెమొంటో ఆవిష్కరించారు.

భారత్-ఇరాన్ మధ్య సాంస్కృతిక మార్పిడి

సాక్షి, సిటీబ్యూరో: భారత్-ఇరాన్ దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడితో పాటు మహిళా సాధికారత, సంబంధాల బలోపేతం, చారిత్రక సంబంధాల పునరుద్ధరణ లక్ష్యంగా సోమాజిగూడలోని ది పార్క్ హోటల్ వేదికగా సాంస్కృతిక మహోత్సవం జరిగింది. సీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఇరాన్ దౌత్యవేత్తలు షొహ్రేహ్ ఫరీదొద్దీన్ ఫరీదాస్త్ర, అసఫ్ జాహీ వంశస్తులు నిజాం రౌనక్ యార్‌ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. 1980వ సంవత్సరం చివరి వరకు పర్షియన్ అధికారిక భాషగా ఉన్నందున ఇరాన్‌తో హైదరాబాద్‌కు సంబంధాలు మరింత బలపడ్డాయన్నారు. మహోత్సవంలో భాగంగా ఇరాన్ డిజైనర్లచే ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షో, సూఫీ సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులు ఇరానియన్ సాంస్కృతిక సున్నితత్వాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో కొరియా కాన్సుల్ జుల్ఫేకర్, చైనీస్ ఎంబసీ సాంస్కృతిక రాయబారి యాంగ్ యుహువా, సియాసత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అమీర్‌తో పాటు బేగ్, ఖలీక్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.40 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: వాట్సప్ ద్వారా వచ్చిన సందేశాల ఆధారంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ భారీ మొత్తంలో మోసపోతున్నారు. అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు ఓ మహిళకు గాలం వేశారు. ఆమెను 'టాప్ వీవీపీ స్టాక్ గ్రూప్ బీ04' అనే వాట్సప్ గ్రూప్‌లో యాడ్ చేశారు. వారు పంపిన లింక్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ద్వారా స్టాక్ మార్కెట్‌లో డబ్బును పెట్టుబడి పెట్టించి మొదట కొంత లాభాలు చూపించారు. ఏకంగా అప్పర్ సర్క్యూట్ స్టాక్‌లలో పెట్టుబడులు పెట్టించి ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. వచ్చిన లాభాలను విత్‌డ్రా చేసుకోవాలంటే 20 శాతం కమీషన్ చెల్లించాలని చెప్పారు. దీంతో విడతల వారిగా వారు చెప్పిన విధంగా మొత్తం రూ.33,35,000 పంపించింది. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేసింది. ఇదే తరహాలో ఆన్‌లైన్ ద్వారా వివిధ స్టాక్ మార్కెట్ నకిలీ యాప్‌ల ద్వారా నగరంలోని మోతినగర్ స్నేహపురి కాలనీకి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.7,20,000 (ఏడు లక్షల ఇరవై వేల) సైబర్ కేటుగాళ్లు మోసం చేశారు.ఈ పిర్యాదుల పై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య చనిపోయిందని మరో పెళ్లి

- భర్త ఇంటిముందు ఆందోళన చేసిన మొదటి భార్య
- ఆడపిల్లలు పుడుతున్నారని వేధింపులు



లింగోజిగూడ: మొదటి భార్యకు ఆడపిల్లలు తప్ప అబ్బాయిలు పుట్టడం లేదని ఓ వ్యక్తి మరో వివాహం చేసుకున్న సంఘటన నాగోలు డివిజన్ జైపురి కాలనీలో జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న మొదటి భార్య భర్త ఇంటి ముందు కుటుంబ సభ్యులతో మంగళవారం ఆందోళన చేసి సరూర్‌నగర్ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల, భాదితురాలు తెలిపిన మేరకు.. నాగోలు డివిజన్ జైపురి కాలనీకి చెందిన అమరేందర్ హైకోర్టు న్యాయవాదిగా పని చేస్తున్నాడు. 2017లో సిద్దిపేటకు చెందిన పల్లవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలే జన్మించారు. పల్లవికి ఆడపిల్లలే పుట్టే అవకాశం ఉందని అక్రమంగా చేయించిన పరీక్షలలో తెలవడంతో అబార్షన్ చేయించారు. పల్లవి గర్భ సంచిలో సమస్య రావడంతో పిల్లలు పుట్టే అవకాశాలు తక్కువగా ఉండడంతో 6 నెలల క్రితం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించారు. అప్పటి నుంచి వేధింపులకు గురి చేయడంతో ఇంట్లో నుంచి పల్లవి బయటకు వెళ్లింది.దీంతో గత సంవత్సరం నవంబర్‌లో తన మొదటి భార్య చనిపోయిందని అమరేందర్ సిద్దిపేటకు చెందిన మరో మహిళను వివాహం చేసుకున్నాడు.ఈ విషయం తెలుసుకున్న పల్లవి మంగళవారం జైపురి కాలనీలో భర్త ఇంటి ముందు కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం సరూర్‌నగర్ మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకోని విచారణ జరుపుతున్నారు.

మీది మొత్తం రూ.వెయ్యి అయింది..!

- ట్రాఫిక్ ఉల్లంఘనపై పోలీసుల ట్వీట్
- సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టు



సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఓ ద్విచక్ర వాహన చోదకుడికి సంబంధించి నగర పోలీసు విభాగం మంగళవారం చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. బుల్లెట్‌పై హెల్మెట్ లేకుండా వెళ్తూ సెల్‌ఫోన్ మాట్లాడుతున్న వాహనచోదకుడి ఫొటో ట్వీట్ చేసిన అధికారులు దానికి 'మీది మొత్తం వెయ్యి అయింది, యూజర్ చార్జెస్ ఎక్స్‌ట్రా' అంటూ వ్యాఖ్యను జోడించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో పాటు హెల్మెట్ లేకుండా వాహనం నడపటంతో మీపై రూ.1000 జరిమానా విధిస్తున్నామంటూ దీని ద్వారా పోలీసులు సందేశం ఇచ్చారు. ఈ పోస్టు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వేల మంది రీట్వీట్, షేర్ చేశారు. దీనికి సానుకూలంగా స్పందిస్తూ పలువురు వ్యాఖ్యలు చేశారు.

ప్రశ్న చదివేది ఒకరు.. సమాధానం రాసేది మరొకరు

- విదేశీ వర్సిటీలో సీటు కోసం కొత్త ఎత్తుగడ
- ప్రాక్సీ జాబ్స్ తరహాలో ఆన్‌లైన్‌లో పరీక్ష
- లాడ్జిలో డ్యూలింగో ఇంగ్లిష్ ఎగ్జామ్
- ఏడుగుర్ని అరెస్టు చేసిన ఎల్బీనగర్ ఎస్‌ఓటీ

సాక్షి, సిటీబ్యూరో: ఒకరికి బదులుగా మరొకరు ఉద్యోగం చేసే ప్రాక్సీ జాబ్స్ తరహాలోనే ఒక అభ్యర్థికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తూ విదేశీ యూనివర్సిటీలను బురిడీ కొట్టిస్తున్న ఏడుగురు సభ్యుల ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. నిందితుల నుంచి ల్యాప్‌టాప్‌లు, పాస్‌పోర్టులు, సెల్‌ఫోన్లు ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

◆ సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎడవల్లి అరవింద్ రెడ్డి, మహబూబ్‌నగర్‌కు చెందదిన నేనావత్ సంతోష్, నల్లగొండకు చెందిన ఆలకుంట్ల వినయ్‌లు బీటెక్, హన్మకొండకు చెందిన మల్లాది నవీన్ కుమార్ ఎంటెక్ చదువుతున్నారు. ఈ నలుగురు విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించాలని భావించారు. అయితే అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సీటు పొందాలంటే డ్యూలింగో ఆంగ్ల పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. దీంతో అక్రమ మార్గంలో ఉత్తీర్ణత సాధించాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో మధ్యవర్తులైన హయత్‌నగర్‌కు చెందిన త్రివేది హరినాథ్, బాణాల కృష్ణల సహాయంతో కందకట్ల ప్రవీణ్ రెడ్డిని సంప్రదించారు.

◆ హయత్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర లాడ్జిలో గదికి అద్దెకు తీసుకొని అసలు అభ్యర్థికి బదులుగా నకిలీ క్యాండిడేట్ సమాధానాలు ఉత్తీర్ణత సాధించేలా చేస్తున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5–10 వేలు వసూలు చేస్తున్నారు. ప్రధాన నిందితుడు ప్రవీణ్ ఇప్పటివరకు 25–30 మంది అభ్యర్థులను ఉత్తీర్ణత సాధించేలా చేశారని, వీరిలో ఎంత మంది విదేశీ వర్సిటీలకు వెళ్లారో నిందితుల విచారణలో తేలుతుందని ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు..

బురిడీ ఇలా..

అమెరికా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్ వంటి దేశాలలో అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలలో ప్రవేశం పొందాలంటే ఆన్‌లైన్‌లో డ్యూలింగో ఇంగ్లీష్ పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుంది. గంట వ్యవధిలో 160 ప్రశ్నలకు గాను 105 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులవుతారు. అయితే ఈ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. కంప్యూటర్ ముందు అభ్యర్థి గంట సేపు అటు ఇటు చూడకుండా కేవలం కంప్యూటర్ స్క్రీన్ మీద కనిపించే ప్రశ్నలకు సమాధానాలు టైప్ చేయాల్సి ఉంటుంది. ప్రశ్న చదివిన వెంటనే దిక్కులు చూసినా, కదలినా సరే వెంటనే లైన్ డిస్‌కనెక్ట్ అవుతుంది. అభ్యర్థి ఫెయిల్ అయినట్టు లెక్క. అయితే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు నిందితులు సరికొత్త ఎత్తుగడ వేశారు. కంప్యూటర్ ముందు అభ్యర్థితో పాటు కెమెరాకు కనిపించకుండా, స్క్రీన్‌కు సమాంతరంగా మరో అభ్యర్థి ల్యాప్‌టాప్‌లో కనెక్ట్ అయి ఉంటాడు. కంప్యూటర్ స్క్రీన్ మీద ప్రశ్న రాగానే అసలు అభ్యర్థి బదులుగా నిందితుడు సమాధానాలు టైప్ చేస్తుంటాడు. దీంతో అభ్యర్థి ఉత్తీర్ణత సాధిస్తాడు.

రైలుకు ఎదురెళ్లి యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన హైటెక్‌సిటీ–హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ల మధ్యలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా, పత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన అప్పారావు కుమారుడు కె.సతీష్(28) నగరానికి వలస వచ్చాడు. మియాపూర్‌లో నివాసం ఉంటూ చైతన్య పాఠశాలలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది పరుగెడుతున్న రైలుకు ఎదురెళ్లి బలవన్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఆటోడ్రైవర్‌కు జైలు శిక్ష



నిందితుడు సురేశ్

హిమాయత్‌నగర్: పాఠశాల చిన్నారులను ఆటోలో తీసుకెళ్తూ భయపెడుతున్న డ్రైవర్‌కు నాంపల్లి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించింది. నారాయణగూడ అడ్మిన్ ఎస్సై నరేశ్ కుమార్ తెలిపిన వివరాలు.. ఎ.సురేశ్(41) హిమాయత్‌నగర్ స్ట్రీట్ నంబర్ 13లో ఉంటూ ఆటో నడుపుతుంటాడు. తన ఆటోలోనే కొంతమంది పాఠశాల విద్యార్థులను స్కూల్ తీసుకెళ్లి, తీసుకొస్తుంటాడు. ఈక్రమంలో తరచూ ఆటోలో వెళ్తున్న ఒక చిన్నారిని భయపెట్టేవాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవ్‌టీజింగ్ పెట్టీ కేసు నమోదు చేసిన పోలీసులు సురేశ్‌ని రిమాండ్‌కు తరలించారు. నాంపల్లి ఐదో ఎంఎం ప్రత్యేక న్యాయస్థానం నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది.

చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులపై దాడి

అడ్డగుట్ట: బాలకార్మికులకు విముక్తి కల్పించేందుకు వచ్చిన చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు, సివిల్ పోలీసులపై అంబేద్కర్ నగర్ వాసులు దాడి చేశారు. వివరాలు.. చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్ఐ రవికుమార్‌తో పాటు కొంత మంది పోలీసులు కలిసి బాలకార్మికులను పట్టుకునేందుకు సోమవారం రాత్రి సికింద్రాబాద్‌లోని సంగీత్ చౌరస్తా వద్దకు సివిల్ డ్రెస్‌లో వచ్చారు. సంగీత్ చౌరస్తా నుంచి రైల్ నిలయం వెళ్లే దారిలో ఓ హోటల్ వద్ద చైల్డ్ లేబర్లను చూసిన పోలీసులు సదరు పిల్లలను వెంబడించారు. అంబేద్కర్ నగర్ బస్తీలోకి వెళ్లి ఇద్దరు పిల్లల్ని పట్టుకునే ప్రయత్నం చేయగా, అంబేద్కర్ నగర్ బస్తీవాసులు సివిల్‌లో ఉన్న వారిని చూసి పిల్లల్ని ఎత్తుకెళ్లేవారని అనుకొని బస్తీవాసులందరూ మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో ఎస్ఐ రవికుమార్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న తుకారాంగేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బస్తీవాసులను చెదరగొట్టారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు, ఎస్ఐ రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే దాడికి పాల్పడిన వారిలో కొంత మందిని తుకారాంగేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కన్న కూతురిపై అత్యాచారం..నిందితుడికి 25 ఏళ్ల జైలు

కంటోన్మెంట్: కన్న కూతురిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. బాధిత బాలికకు రూ.7లక్షల పరిహారంతో అందజేయాలని చెప్పడడంతో పాటు, నిందితుడికి రూ.5వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని పన్నెండో అదనపు మెట్రోపాలిటన్ జడ్జి తీర్పునిచ్చారు. బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో 2022 మార్చిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. న్యూ బోయిన్‌పల్లిలోని ఓ బస్తీలో నివసించే రమావత్ రమేశ్ (30) చెత్త సేకరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి మొదటి భార్య సరోజ ద్వారా ఓ కూతురు జన్మించిన కొంతకాలానికి ఆమెతో విడిపోయాడు. అనంతరం రమేశ్ మరో అమ్మాయిని వివాహం చేసుకోగా, వీరికి ముగ్గురు పిల్లలు జన్మించారు. భార్య, పిల్లలు, మొదటి భార్య కూతురు అంతా కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. ఈ క్రమంలో 2022 మార్చి 16న రమేశ్ మొదటి భార్య కూతురిపై అత్యాచారానికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న రమేశ్ మొదటి భార్య, రమేశ్‌ను మందలించి బాధిత బాలికను కాపాడింది. అయితే ఇదివరకే రెండు మూడు సార్లు తండ్రి తనపై అఘాయిత్యం చేసినట్లు బాధితురాలు వాపోయింది. దీంతో ఇరుగు పొరుగు వారి సహకారంతో బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టంతో సంబంధిత సెక్షన్‌లపై కేసు నమోదు చేశారు. కేసును విచారించిన నాంపల్లి కోర్టు జడ్జి మంగళవారం తీర్పు వెలువరించారు.

శివాజీ పాలనలో అన్ని మతాలకు సముచితస్థానం


సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

రహమత్‌నగర్: ఛత్రపతి శివాజీ సర్వ మతాలను గౌరవించడమే కాకుండా సముచిత స్థానం కల్పించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్(ఎన్‌వైకెఎస్) హైద్రాబాద్ జిల్లా అడ్వైజరీ మెంబర్, బీజేవైఎం నగర నాయకుడు వాల్దాస్ భరత్‌గౌడ్ నేతృత్వంలో రహమత్‌నగర్ కూడలిలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన శివాజీ జయంతి వేడుకలకు కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ మహరాజ్ మచ్చలేని పాలకుడిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. రహమత్‌నగర్‌లో ఏటా మహనీయుని జయంతిని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలపాటి లక్ష్మీనారాయణ, సుప్రియ, కనకరాజు, కౌలస్ సత్యనారాయణ, శ్రీనివాస్, రోహిత్, అనిల్, కైలాశ్, ప్రణీత్, బండి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: దేశంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని అలాంటి రైతులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా రైతుల ఆత్మహత్యలు ఆగకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో 'రైతు సోదరులు ఆత్మహత్య పరిష్కారం కాదు.. పోరాడి హక్కులను సాధించు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పదేళ్లలో ప్రధాని మోదీ పాలనలో వేలాదిమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. 2014 తర్వాత రైతుల ఆత్మహత్యలపై కేంద్ర ప్రభుత్వం కనీసం ప్రకటనలు కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రొఫెసర్ పద్మజా షా, నైనాల గోవర్ధన్, రవీందర్, అంబు రాథోడ్, కరుణాకర్ దేశాయ్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు పదవుల్లో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోరన్నారు. అయితే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం రైతులపై ఎంతో ప్రేమ కురిపిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల సమగ్ర నియమావళి కోసం లేఖ


సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌మోహన్

పంజగుట్ట: రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేలా నైతిక ప్రవర్తనా నియమావళి అమలు చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఫోరం ఫర్ డెమొక్రసీ అండ్ గ్లోబల్ పీస్ సంస్థ కోరింది. అన్ని రాజకీయ ప్రచారాల కోసం ప్రస్తుత మోడల్ ప్రవర్తనా నియమావళిని సమగ్రంగా రూపొందించాలని కోరుతూ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫోరం ఆధ్వర్యంలో లేఖ రాసినట్లు వారు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం అధ్యక్షుడు శ్యామ్ మోహన్, ఉపాధ్యక్షుడు కమలాకర్‌రావు, సెక్రటరీ శ్రావణ్, చరిత్రకారులు డాక్టర్ కొల్లూరి చిరంజీవి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ద్వేషపూరిత ప్రసంగాలు, వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటాన్ని కట్టడి చెయ్యాలన్నారు. ఓటర్లను ఆకర్షించేందుకు నగదు, బహుమతులు పంపిణీ అడ్డుకోవాలన్నారు. ప్రజాస్వామ్య విలువలు నిలబెట్టడంలో భారత ఎన్నికల సంఘానిది కీలకపాత్ర అని.. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల అభ్యున్నతికి కేంద్ర పథకాలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దీపక్‌రెడ్డి

వెంగళరావునగర్: బస్తీల్లో నివసించే ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భారతీయ జనతాపార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకెల దీపక్‌రెడ్డి తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహనగర్ బస్తీ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో వికాస భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదల అభ్యున్నతి కోసం కేంద్రం ముద్ర రుణాలతో పాటు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. పథకాలను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం, ఉచితంగా ఆధార్ నమోదు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, సీనియర్ నేతలు కుంభాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, వెంకటేశ్, నరసింహస్వామి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఐకమత్యమే సమస్యలకు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణజిత్ సేన్

పంజగుట్ట: క్రైస్తవులు ఐకమత్యంగా సమన్వయంతో తమ సమస్యలు పరిష్కరించుకోవాలని రాష్ట్ర మాజీ డీజీపీ స్వర్ణజిత్ సేన్ అన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్లోబల్ అలయన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్, క్రిస్టియన్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వర్ణజిత్ మాట్లాడుతూ.. క్రైస్తవులపై దాడులు జరిగితే తక్షణమే స్పందించేలా స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధి జెరూసలేం మత్తయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైస్తవులపై దాడులు తగ్గుతాయనుకుంటే ఇంకా పెరిగాయని ఆరోపించారు. జన్వాడలో చర్చిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఏ డానియల్ ఆడమ్స్, విల్సన్, ఇజ్రాయిల్, ఇర్మియా, పీటర్, రవికుమార్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

లిబర్టీ: రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తి తామే అన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతామని స్పష్టం చేశారు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. రాష్ట్రంలోని దళిత బహుజనుల ప్రజా సమస్యల పరిష్కరించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో నక్క దేవేందర్, ఇటిక్యాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యను పరామర్శించిన నేతలు

హిమాయత్‌నగర్: ప్రగతి శీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్యను బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. మూడు రోజుల క్రితం సంధ్య భర్త రామకృష్ణారెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సంధ్య నివాసానికి నాయకులు వెళ్లారు. అనంతరం రామకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. హరీశ్‌రావు వెంట మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర రెడ్డి ఉన్నారు.


సంధ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత


సంధ్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి

రికార్డుల పరిశీలన

పది విద్యార్థుల అంతర్గత మార్కులపై తనిఖీలు

- విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్న టీచర్లు
- ఈ నెల 22 నుంచి ఆన్‌లైన్‌లో నమోదు



బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న బృందం

బంజారాహిల్స్: వచ్చే నెల(మార్చి) 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థుల అంతర్గత మార్కుల నమోదుకు అధికారులు సిద్ధమయ్యారు. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ప్రతి సబ్జెక్టులోనూ 20 మార్కులను ఇందుకోసం కేటాయిస్తారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, రెండు గురుకులాలు, రెండు ఎయిడెడ్, 190 ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 18,000 మంది పదో తరగతి విద్యార్థులున్నారు. ఈక్రమంలో అంతర్గత మార్కుల రికార్డుల పరిశీలన కోసం 17 బృందాలు సిద్ధమయ్యాయి. ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బృందాలు నాలుగు రోజులుగా రికార్డులు పరిశీలిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పరీక్షలు ముందుకు జరగడంతో అంతర్గత మార్కుల నమోదుకు పరీక్షల విభాగాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెల 22 నుంచి వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉన్నందున క్షేత్రస్థాయిలో అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు.

ప్రతి సబ్జెక్టుకు 20 మార్కులు..

అంతర్గత మార్కుల నమోదు విషయంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరించకుండా ఖైరతాబాద్ జోన్ పరిధిలో 17 బృందాల్లో 60 మంది ఉపాధ్యాయులు తనిఖీలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఫార్మేటివ్ పరీక్షల్లో వాస్తవంగా మార్కులు నమోదు చేశారా? లేదా? అన్నది ఈ తనిఖీల్లో పరిశీలించిన తర్వాత అంతర్గత మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రతి సబ్జెక్టుకు వంద మార్కులు ఉండగా 80 మార్కులకు వార్షిక పరీక్ష, మిగిలిన 20 మార్కులను సీసీఈ విధానంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు, విద్యార్థులు రాసే రికార్డుల ఆధారంగా కేటాయిస్తారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ఈ మార్కులు కీలకం కానుండటంతో తనిఖీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. విద్యార్థులు చేసిన ప్రాజెక్టు వర్క్, నోట్ పుస్తకాల్లో చేతి రాత, నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లలో వచ్చిన మార్కుల ఆధారంగా వాస్తవాలను పరిశీలిస్తారు. ఒక్కో బృందంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంతో పాటు భాషా పండితుడు, స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయుడు ఉంటారు. ఒక్కో కమిటీకి 8–9 పాఠశాలల బాధ్యతలను అప్పగించారు. ఉపాధ్యాయులు పరిశీలించి ఆమోదించిన మార్కులను ఈ నెల 22 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

మాఘమాస మహోత్సవం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన సాయిబాబాకు మంగళవారం మాఘమాసం మహోత్సవంలో భాగంగా నిమ్మరసంతో అభిషేకం నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బాధ్యతల స్వీకరణ



బంజారాహిల్స్: వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీగా హరిప్రసాద్ కట్టా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్‌ఆర్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వినోద్‌కుమార్, రవి, కొమరయ్య, గౌస్‌ఖాన్ పంజగుట్టలోని తన కార్యాలయంలో ఏసీపీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్‌పై సమీక్ష నిర్వహించారు.

స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై జాగ్రత్త ఉండాలి

హిమాయత్‌నగర్: ఈ మధ్యకాలంలో నగరంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ప్రధానంగా టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలలో టాస్క్ ఇచ్చే ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లను నమ్మవద్దని హెచ్చరిస్తున్నారు. అధిక లాభాలకు ఆశపడి కష్టపడ్డ సొమ్మును పోగొట్టుకోవద్దనిసూచిస్తున్నారు. సైబర్ ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి డయల్ చేయడం లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

ప్రసవంపై అవగాహన అవసరం


డాక్టర్ చందన గాలిదేవర

బంజారాహిల్స్: సాధారణ, సిజేరియన్ ప్రసవాల సమాచారాన్ని గర్భిణులు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర చందన గాలిదేవర సూచించారు. బంజారాహిల్స్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రసవం సమయంలో తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం పూర్తి సమాచారంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. సాధారణంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రసవాలలో ఎక్కువ భాగం సహజ పద్ధతిలో జరుగుతాయని చెప్పారు. అయితే, సిజేరియన్ రేటు కూడా క్రమంగా పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు ప్రసూతి వైద్యులు ఇచ్చే ఆరోగ్య సూచనలు పాటించాలని సూచించారు. తద్వారా ప్రసవం సమయంలో ప్రమాదాలు, సంక్లిష్టతలను అధిగమించొచ్చని చెప్పారు.

ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

ముషీరాబాద్: ముషీరాబాద్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎన్.రవిని మంగళవారం పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ అస్లాం, నాని, శంకర్‌ముదిరాజ్, శ్రీధర్, ముచ్చకుర్తి ప్రభాకర్, కొండా శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

◆ బీజేపీ నేతలు నైషదం సత్యనారాయణమూర్తి, రాంనగర్ డివిజన్ అధ్యక్షులు కలకోట అరుణ్‌కుమార్‌లు సీఐ రవికి శుభాకాంక్షలు తెలిపారు.

కాలనీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

హిమాయత్‌నగర్: డివిజన్ పరిధిలోని ఆయిల్ సీడ్ కాలనీలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆయిల్ సీడ్ కాలనీలో వాటర్ వర్క్స్, మున్సిపల్ శాఖల అధికారులతో ఆమె పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు అనూప్, కృష్ణ, అర్జున్, డాక్టర్ అబ్రహాం, వెంకటేశ్, ఫయాజ్ కాలనీ సమస్యలను విన్నవించారు. ప్రధానంగా వీధి దీపాలు, చెత్త సేకరణ, రోడ్డు ప్యాచ్ పనులు, చెట్ల కత్తిరించడం, వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ మహేందర్ రెడ్డి, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, ఎస్‌ఎఫ్‌ఏ లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ నాయకుడు జి.రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించాలి


సమావేశమైన ఆనంద్‌నగర్ బస్తీ పెద్దలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్ ఆనంద్‌నగర్ బస్తీ సంక్షేమం సంఘం కమిటీ గడువు గత ఏడాది మార్చిలో ముగిసినా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ఎన్నికలు జరపాలని బస్తీవాసులు కోరుతున్నా కమిటీ కాలయాపన చేస్తోంది. ఈక్రమంలో బస్తీ సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ ఎన్నికలు తక్షణమే జరిపించాలని బస్తీవాసులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేశామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ఎస్‌ఎస్‌కే ఆకాశ్, చారి, మోహన్‌సింగ్, సుజిత్‌సింగ్, మహేశ్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, రమేశ్, నటరాజ్, అశోక్, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

రిసా క్రియేషన్స్‌లో సరికొత్త డిజైన్స్


సమావేశంలో మాట్లాడుతున్న డిజైనర్ పూజ

బంజారాహిల్స్: చేనేత, హస్తకళలు ప్రోత్సహించేలా రిసా క్రియేషన్స్ పనిచేస్తోందని ఆ సంస్థ ఫౌండర్ పూజ తెలిపారు. బంజారాహిల్స్ తాజ్‌కృష్ణా హోటల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కళారూపాలను రక్షించడమే కాకుండా ప్రవాస భారతీయులను ఆకట్టుకునేలా కొత్త డిజైన్లు రూపొందించామని చెప్పారు. రిసా క్రియేషన్స్ అమెరికాలోని టెక్సాస్‌లో గత ఏడాది ప్రారంభించినట్లు తెలిపారు. సంప్రదాయ చేనేత, హస్తకళలు, కళారూపాలను అన్వేషించేందుకు తమ నిపుణుల బృందం దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తుందన్నారు.

'మెజార్టీ ఎంపీ స్థానాలు కాంగ్రెస్‌వే'


కోదండరామ్‌ను కలిసిన వేణుగోపాలస్వామి

బంజారాహిల్స్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు కేంద్రంలో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని సికింద్రాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత సీఏ వేణుగోపాలస్వామి అన్నారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి తనకు సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ టికెట్ వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తన స్వచ్ఛంద సంస్థ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో చేయబోయే పనుల గురించి కోదండరామ్‌కు వివరించారు. అనంతరం వేణుగోపాలస్వామి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా మారుతుందన్నారు.

ఇ-పెట్టీ కేసులో ఇద్దరికి జైలు


సురేందర్ యాదవ్


జక్కుల గోపాల్‌యాదవ్

పంజగుట్ట: అర్ధరాత్రి వరకు పాన్‌షాప్ తెరిచి ఉంచడమే కాకుండా మూసివేయమని చెప్పిన పోలీసులపై ఎదురుతిరిగిన షాపు యజమానికి న్యాయమూర్తి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాలు.. అమీర్‌పేట దుర్గానగర్ కాలనీలో సురేందర్‌యాదవ్‌కు పాన్‌షాపు ఉంది. అర్ధరాత్రి వరకు షాపు తెరిచి ఉంచడంతో పోలీసులు మూసివేయాలని చెప్పగా న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. ఈక్రమంలో పంజగుట్ట పోలీసులు సురేందర్‌యాదవ్‌పై ఇ–పెట్టీ కేసు నమోదు చేసి మంగళవారం పదో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పద్మజ ఎదుట హాజరుపరిచారు. దీంతో ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

పోలీసుల మనోభావాలు దెబ్బతీసేలా..

పోలీసుల మనోభావాలను కించపరిచేలా పోస్టులు పెట్టిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ పదో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పద్మజ మంగళవారం తీర్పునిచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన జక్కుల గోపాల్‌యాదవ్(40) ఇటీవల పోలీసులకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో పంజగుట్ట పోలీసులు ఇ–పెట్టీ కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరిచడంతో నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్

హిమాయత్‌నగర్: దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించడం ద్వారా దళిత బహుజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి(ఏఐడీఆర్‌ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల్ అన్నారు. అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి జాతీయ సమావేశాలు ఫిబ్రవరి 19, 20 తేదీల్లో హిమయత్‌నగర్‌లో జాతీయ అధ్యక్షుడు ఎ.రామ్మూర్తి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా వెనుకబడ్డ వర్గాలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. సమావేశంలో కె.ఏసురత్నం, బండెల నరసయ్య, మారుపాక అనిల్ కుమార్, టి.లక్ష్మణ్, ఎ.రాజకుమార్, జె.కుమారస్వామి, రాజారత్నం, కె.సహదేవ్, బి.లక్ష్మంపతి పాల్గొన్నారు.

జీఓ విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

లిబర్టీ: బీసీ కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీఓ జారీ చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణనపై శాసనసభలో తీర్మానం చేయడం శుభపరిణామమని చెప్పారు. అయితే, జీఓ జారీ చేసి పార్లమెంటు ఎన్నికలకు ముందుగానే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బీసీ గణన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

రాజ్యసభ సభ్యుడికి అభినందనలు


నసీర్ హుస్సేన్‌ను అభినందిస్తున్న సదానందం

బంజారాహిల్స్: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆఫీస్ ఇన్‌చార్జి, సీడబ్ల్యూసీ సభ్యుడు సయ్యద్ నసీర్‌హుస్సేన్ వరుసగా రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడంపై తెలంగాణ ప్రజావేదిక అధ్యక్షుడు బండి సదానందం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నసీర్ హుస్సేన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సదానందం మాట్లాడుతూ.. సమర్థుడైన నాయకుడికి కర్ణాటక నుంచి మరోసారి అవకాశం రావడం గొప్ప విషయం అన్నారు. తనకు అవకాశం కల్పించినందుకు పార్టీ పెద్దలు సోనియాగాంధీ, మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీకు ఈ సందర్భంగా హుస్సేన్ ధన్యవాదాలు తెలిపారు.

మాతృభాషతో మమేకమై..


మాతృ భాషా దినోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో అంతర్ మాతృ భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భాషా, సాంస్కృతిక వైభవాన్ని చాటడమే లక్ష్యంగా సాగిన ఈ ఉత్సవాలను సంస్కృతంలో ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. అనంతరం దాదాపు 14 భారతీయ భాషల్లో విద్యార్థులు తమ తమ మాతృ భాషలో ప్రసంగాలు, నృత్యాలు, కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. సాంస్కృతిక వైవిధ్యం, బహు భాషత్వంపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేస్తున్న కృషిని ప్రిన్సిపాల్ కాంచనవల్లి ఈ సందర్భంగా అభినందించారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

వెంగళరావునగర్: బాలికను వేధిస్తున్న ఆటో డ్రైవర్‌పై మధురానగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్‌లో ఓ కుటుంబం ఉంటోంది. వారి కుమార్తె ప్రతిరోజు స్కూల్‌కు వెళ్లే సమయంలో కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద ఎండీ యూనస్ అనే ఆటో డ్రైవర్ వెంట పడేవాడు. అంతేకాకుండా అసభ్య పదజాలంతో వేధించేవాడు. విసిగిపోయిన బాధిత బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి మంగళవారం మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని పోలీసులు అదుపులోనికి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు.

డ్యూటీకి వెళ్లొచ్చే లోపు..

దాదాపు రూ.2 లక్షలు చోరీ

వెంగళరావునగర్: ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లొచ్చే లోపు దుండగులు దాదాపు రూ.2 లక్షలు దోచుకెళ్లిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన బ్యూటీషియన్ గీతా గణేశ్‌షిండే వెంగళరావునగర్ డివిజన్ ఈస్ట్ రహమత్‌నగర్‌లో కొంతకాలంగా ఉంటోంది. ఆమెతో పాటు తన స్నేహితులు స్వాతి ఉత్తమ్ నబోడే, అంజలి రాజేశ్ శర్మ, శీతల్ భీంరాజ్ కూడా ఒకే గదిలో ఉంటున్నారు. ప్రతిరోజు ఉదయం 10.30కు ఎవరి పనులకు వారు వెళ్తుంటారు. ఈక్రమంలో గది తాళం చెవిని బయట ఉన్న వాష్ రూంలో ఉంచుతారు. ఈక్రమంలో ఈనెల 18వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో స్వాతి ముందుగా వచ్చి తాళాల కోసం వెతికింది. వాష్‌రూంలో తాళాలు లేకపోవడంతో స్నేహితులకు ఫోన్ చేసింది. వారు కూడా తమ వద్ద లేదని చెప్పడంతో వాష్ రూంలోనే ఉంచిన మరో కీ ద్వారా గది తెరిచింది. లోనికి వెళ్లగా దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. గీత పర్స్‌లో ఉండాల్సిన దాదాపు రూ.1,03,000.. అంజలికి చెందిన రూ.58 వేలు, స్వాతివి రూ.18 వేలు, శీతల్‌వి రూ.19 వేలు(మొత్తం రూ.1.98 లక్షలు) నగదు మాయమైనట్లు గుర్తించింది. దీంతో బాధితులు మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డివిజన్ సమస్యలపై గళమెత్తిన సీఎన్ రెడ్డి


మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మంగళవారం జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించారు. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ స్థలంలోని ప్లేగ్రౌండ్‌కు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా మేయర్ విజయలక్ష్మి సానుకూలంగా స్పందించారు.

కౌన్సిల్ మీటింగ్‌లో వాడివేడి చర్చ

బంజారాహిల్స్: సాధారణ గృహాలను కమర్షియల్‌గా, ఓయో రూములుగా మారుస్తున్నారని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో ధ్వజమెత్తారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ఓయోలు, పబ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయన కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు.

• 'పట్టాలు తప్పారు'పై కదిలిన రెవెన్యూ అధికారులు

పేదల భూములకు మోక సర్వే.. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆరా.. 'సాక్షి' కథనానికి స్పందన



పోతారం (ఎస్)లో పేదల భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

హుస్నాబాద్ రూరల్: 'పట్టా'లు తప్పారు శీర్షికన సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి జిల్లెలగడ్డ శివారులోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. అనంతరం హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) భూముల విషయమై ఆరా తీశారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి 'సాక్షి'లో వచ్చిన కథనంపై సర్వేయర్, ఆర్‌ఐలకు మెమోలు జారీ చేశారు. దీంతో పోతారం(ఎస్)లో అధికారులు మోక విచారణ చేసి సర్వే నంబరు 250లో రెండెకరాలు, 263లో 1.30 ఎకరాల భూమిని సర్వే చేశారు. మరోరోజు పూర్తిస్థాయిలో సర్వే చేసి కబ్జాలో ఉన్న పేదల భూములకు హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. అక్రమంగా పట్టాలు పొందిన వారి పట్టాదార్ పాసు పుస్తకాలను రద్దు చేయడానికి కలెక్టర్‌కు నివేదికను పంపించి, మోక మీద ఉన్న బాధితులకు పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. సాక్షి కథనంతో పేదల భూములు సర్వే చేయడానికి అధికారులు రావడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

'ధూపదీప నైవేద్యం' బకాయిల చెల్లింపు

సాక్షి ఎఫెక్ట్

రెండు రోజుల క్రితం సమస్యను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'

సాక్షి, హైదరాబాద్: ధూప దీప నైవేద్య పథకం కింద పేరుకుపోయిన బకాయిలను ప్రభుత్వం ఎట్టకేలకు చెల్లించింది. ఈ పథకం కింద అర్చకులకు చెల్లించాల్సిన గౌరవ భృతి బకాయిలను మంగళవారం సాయంత్రం వారి ఖాతాలకు జమచేశారు. ఈ పథకం కింద ఇప్పటికే 3,500 మంది అర్చకులకు నవంబర్ నుంచి పేరుకుపోయిన బకాయిలను, గత జూన్‌లో ఈ పథకం కింద నమోదైన 2,500 దేవాలయాలకు సంబంధించిన అర్చకులకు జూన్ నుంచి పేరుకుపోయిన బకాయిలను చెల్లించటం విశేషం. వీరి సమస్యలను వివరిస్తూ రెండు రోజుల క్రితం 'ధూప దీప నైవేద్యం ఎలా' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా బకాయిల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ చలో సచివాలయం కార్యక్రమానికి అర్చకులు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి ముందస్తు సమాచారం లేకపోవటంతో అంతగా స్పందించలేదు. సాక్షిలో కథనం ప్రచురితం కావటంతో అప్పటికప్పుడు దేవాదాయ శాఖ కమిషనర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీంతో ఈ అంశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి చేరింది. ఆయన ఆదేశం మేరకు మంత్రి శ్రీధర్‌బాబు సూచనతో మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ సంఘం ప్రతినిధులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ, వింజమూరి సుధాకర్, వేదాంతం పవన్, గోపీకృష్ణమాచార్యులు, అమరేశ్వర శర్మ, ఫణికుమార్ శర్మ తదితరులతో సచివాలయంలో భేటీ అయి చర్చించారు. బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని, నిరసన కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. దీనికి సంఘం ప్రతినిధులు అంగీకరించడంతో వెంటనే వారి బకాయిలు చెల్లించారు. అర్చకులకు హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై కూడా చర్చించినట్టు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ఆ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు సంఘం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

• ఎన్‌హెచ్‌పై టర్నింగ్ వద్ద బారికేడ్ల ఏర్పాటు

సాక్షి కథనానికి స్పందన



జనగామ: మేడారం మహాజాతరను పురస్కరించుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర, జాతీయ రహదారులపై పోలీసులు రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. 'టర్నింగ్‌లు ఉన్నాయి.. డ్రైవింగ్ జాగ్రత్త' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి' మెయిన్‌లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి పోలీసులు స్పందించారు. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా పెంబర్తి గ్రామంలోని ఆర్‌ఆర్ హోటల్ జంక్షన్, యూటర్న్ పాయింట్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జాతర ముగిసి తిరుగుప్రయాణం అయ్యే వరకు నేషనల్ హైవేపై పోలీసుల పర్యవేక్షణ కొనసాగనుంది. కార్యక్రమంలో జనగామ ఏసీపీ దామోదర్‌రెడ్డి, ఎస్సై తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మా పెండింగ్ బిల్లులు చెల్లించండి

ప్రభుత్వానికి మాజీ సర్పంచ్‌ల మొర

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీల్లో అప్పులు, ఇతర రూపాల్లో తమ సొంత నిధులతో చేపట్టిన పనులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధనకు గురువారం 'చలో హైదరాబాద్' చేపట్టనున్నట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలో సకాలానికి నిధులు రాకపోయినా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచి పోవద్దని గత ఐదేళ్లలో అప్పులు తెచ్చి మరీ పనులు చేసినా.. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మాజీ సర్పంచ్‌లు వాపోతు న్నారు. గతంలో ప్రభుత్వ నిర్దేశిత పనుల్లో జా ప్యం జరుగుతోందంటూ సర్పంచ్‌లకు నోటీ సులు, మెమోలు జారీచేసిన అధికారులు.. ఇ ప్పుడు పెండింగ్ బిల్లుల మాటే ఎత్తడం లేదని ఈ సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ విమెన్ అసోసియేషన్ అవతరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులందరూ కలిసి బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ విమెన్ అసోసియేషన్‌గా అవతరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు సచివాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సంఘం ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా కొనసాగేది. మంగళవారం సచివాలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఏపీ సెక్రటేరియట్ విమెన్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ విమెన్ అసోసియేషన్‌గా మారుస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మహిళా సంఘానికి తాత్కాలిక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పద్మ, ప్రధాన కార్యదర్శిగా కె.గీత, సహాధ్యక్షులుగా పద్మావతి, లలిత ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.రమాదేవి, కోశాధికారిగా ఎ.లావణ్యలతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



హైదరాబాద్ ఐఐటీలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై



'మనూ' క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

గవర్నర్‌గా హ్యాండిల్ చేయలేననుకున్నారు

- న్యూబార్న్ బేబీ, ట్విన్స్‌కు చికిత్స చేయడం నాకు తెలుసు..
- ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకున్న వారు దేశానికి తిరిగి ఇవ్వాలి
- ఐఐటీహెచ్‌లో గవర్నర్ తమిళిసై ఆసక్తికర వ్యాఖ్యలు
- రాష్ట్రంలోని మూడు జాతీయ విద్యాసంస్థల్లో భవనాలను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/రాయదుర్గం/నిజామాబాద్ అర్బన్: 'నన్ను గవర్నర్‌గా నియమించినప్పుడు కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని (న్యూబార్న్ బేబీ) హ్యాండిల్ చేయలేనని అందరూ అనుకున్నారు.. కానీ ఓ గైనకాలజిస్టుగా న్యూబార్న్ బేబీకి ఎలా చికిత్స చేయాలో నాకు తెలుసు.. అలాగే పుదుచ్చేరి గవర్నర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చినప్పుడు కూడా రెండు రాష్ట్రాలను ఎలా హ్యాండిల్ చేస్తారని అన్నారు.. ఓ డాక్టర్‌గా ట్విన్స్ (తెలంగాణ, పుదుచ్చేరి)కు ఎలాంటి చికిత్స చేయాలో కూడా తెలుసు.. నాకు ఈ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది చదువే..' అంటూ గవర్నర్ తమిళిసై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ–హైదరాబాద్‌లో క్యాంపస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుతోపాటు రాష్ట్రంలో మరో రెండు జాతీయ విద్యాసంస్థల్లో భవనాలను ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఐటీ–హెచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమిళిసై ప్రసంగించారు. ప్రభుత్వం ఉన్నత మౌలిక సదుపాయాలతో నెలకొల్పుతున్న ఐఐటీ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు దేశం కోసం ఎంతో కొంత తిరిగి ఇవ్వాలని గవర్నర్ పిలుపునిచ్చారు. సేవా రూపంలో గానీ, నూతన ఆవిష్కరణల రూపంలో గానీ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు. కొలనులో నీటిమట్టం పెరిగితే కమలం పువ్వు పైపైకి వచ్చినట్లుగానే.. సమాజంలో విద్యా సంబంధిత మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందితే.. ప్రజల జీవన ప్రమాణాలు కూడా పైపైకి వస్తాయని వివరించారు. గతంలో ఈ ఆస్తులను తన తండ్రి సంపాదించి ఇచ్చారని పిల్లలు చెప్పుకునే వారని, ఇప్పుడు పరిస్థితి మారిందని, కుటుంబ బాధ్యతలను పిల్లలే తీసుకుంటున్నారని, ఇది ఒక్క విద్యతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ఐఐటీహెచ్ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో కేంద్రీయ విద్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అర్వింద్

'మనూ'లో రూ.64.41 కోట్లతో భవనాలు

మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మనూ)లో రూ.64.41 కోట్ల వ్యయంతో నిర్మించిన వివిధ భవనాలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రాయదుర్గం క్యాంపస్‌లో రూ.11.19 కోట్లతో నిర్మించిన రెండంతస్తుల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం భవనాన్ని, రూ.25 కోట్లతో మూడంతస్తుల ఇంజనీరింగ్ వర్క్‌షాప్ భవనాన్ని, రూ.28.22 కోట్లతో నిర్మించిన ఒడిశా కటక్‌లోని 'మనూ' పాలిటెక్నిక్ భవనాన్ని మోదీ జాతికి అంకితం చేశారు. 'మనూ' క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యక్ష ప్రత్యేక కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఇతర ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో కేవీ నూతన భవనం

నిజామాబాద్‌లో కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ నిజామాబాద్‌లో 7.5 ఎకరాల్లో రూ. 22 కోట్లు వెచ్చించి అన్ని వసతులతో కేంద్రీయ విద్యాలయ భవనాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటుచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఏపీ సీఎం జగన్

తిరుపతి ఐఐటీ, ఐజర్, విశాఖ ఐఐఎం ప్రారంభం

- వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- విజయవాడ నుంచి వర్చువల్‌గా పాల్గొన్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం వైఎస్ జగన్

రేణిగుంట/ఏర్పేడు (తిరుపతి జిల్లా)/తిరుపతి సిటీ/ఆనందపురం(విశాఖ)/పెద్దారవీడు: రాష్ట్రంలో ఏర్పాటుచేసిన ప్రముఖ జాతీయ విద్యాసంస్థలైన తిరుపతి ఐఐటీ, ఐజర్, విశాఖ ఐఐఎం శాశ్వత ప్రాంగణాలను ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో మంగళవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొని తిరుపతి ఐఐటీ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, తిరుపతి ఎంపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలో శాశ్వత క్యాంపస్ ఏర్పాటుచేసుకున్న ఐజర్(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)ను ప్రధాని మోదీ జమ్ము నుంచి వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. ఐజర్ డైరెక్టర్ శంతాను భట్టాచార్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ గురుమూర్తి, జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పాల్గొన్నారు. అలాగే.. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలోని రాజంపల్లి గ్రామం సమీపంలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు.

మిర్చి రైతులు నష్టపోవద్దు

- గిట్టుబాటు ధర కల్పించండి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: మిర్చి పంట భారీ ఎత్తున మార్కెట్‌లోకి వస్తోందనీ, ధర విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలంటూ మార్కెటింగ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకొంటామని మంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలో 3.91 లక్షల ఎకరాలలో మిర్చి సాగు చేయగా ఇప్పటికే 94395 మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చిందని వివరించారు. ఈ యాసంగిలో దాదాపు 2 లక్షల ఎకరాలలో వేరుశనగ సాగు కాగా 1.92 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామని తెలిపారు. ఇప్పటికే 93 వేల మెట్రిక్ టన్నులు అమ్మకానికి రాగా, స్వంత అవసరాలకు పోను ఇంకా మార్కెట్లకు 46 వేల టన్నుల వేరుశనగ వచ్చే అవకాశం ఉందని మంత్రి తుమ్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర అందించే విషయంలో గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా రైతులు నష్టపోయారని, ఈ పరిస్థితి రాకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రైతుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి: తుమ్మల

జంగారెడ్డిగూడెం రూరల్ (ఏపీ): రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అన్ని రాష్ట్రాలూ కలిసికట్టుగా ముందుకొచ్చి కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ రైతులు నిర్వహిస్తున్న నిరసనలను కేంద్ర ప్రభుత్వం త్వరగా అర్థం చేసుకుని అన్నదాతలకు అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఖర్చులకు ఒకటిన్నర రెట్లు రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మేము అండగా ఉన్నాం.. ధైర్యంగా ఉండాలి

ఆత్మహత్య చేసుకున్న గురుకుల విద్యార్థిని కుటుంబానికి కవిత పరామర్శ

మోతె: రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడిన గురుకుల పాఠశాలల విద్యార్థుల కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. సూర్యాపేట జిల్లా ఇమాంపేట ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని అస్మిత ఇటీవల హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకుంది. విద్యార్థిని స్వగ్రామం మోతె మండలంలోని బుర్కచర్లలో కుటుంబ సభ్యులను కవిత మంగళవారం పరామర్శించారు. అస్మితకు నివాళులర్పించి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ విద్యార్థినుల ఆత్మహత్యలు తనను కలచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డల ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వానికి చేతులెత్తి జోడించారు. ప్రతి హాస్టల్‌లో సైకాలజిస్టులను ఏర్పాటు చేసి విద్యార్థినుల్లో మనోధైర్యాన్ని నింపాలన్నారు. తల్లిదండ్రులు పరీక్షల సమయంలో విద్యార్థులను ఒత్తిడి చేయొద్దని కవిత కోరారు. ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో సీఎం చొరవ చూపి ఆత్మహత్యల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఉన్నారు.



అస్మిత తల్లిని ఓదార్చుతున్న కవిత

సహజ సుందరంగా కాంచనపల్లి కవిత్వం

'పెంకుటిల్లు' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ కాంచనపల్లి కవిత్వం సహజసుందరంగా, చైతన్యవంతంగా సాగుతుందని ఎమ్మెల్సీ, భారతజాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. డాక్టర్ కాంచనపల్లి రచించిన 'పెంకుటిల్లు' కవితాసంపుటిని మంగళవారం తన నివాసంలో ఆమె ఆవిష్కరించారు. కవిత మాట్లాడుతూ కాంచనపల్లి విభిన్న ప్రక్రియల్లో ప్రతిభావంతంగా, ప్రయోజనాత్మకంగా రాణిస్తున్నారని అభినందించారు. పెంకుటిల్లు కవితాసంపుటిని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్‌కు అంకితం ఇచ్చారు. కాంచనపల్లి తెలంగాణ స్పృహ అందరికీ ఆదర్శమని గౌరీశంకర్ పేర్కొన్నారు. రచయిత కాంచనపల్లి మాట్లాడుతూ పుస్తకాలలో జీవించే పరిణితి కవులకు రావాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి, ప్రముఖ కవులు డాక్టర్ చెమన్, ఘనపురం దేవేందర్, క్లోం నవీన్‌రెడ్డి, కురుమయ్య పాల్గొన్నారు.

మార్గదర్శి డిపాజిట్లు చట్ట విరుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. 2020లో ఇదే వ్యవహారంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఉమ్మడి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలన్నింటిపై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని విస్తృత ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది.

కోర్టు పరిధిలో ఉన్నా కూడా రూ.2వేల కోట్లు సేకరణ

ఈ సందర్భంగా మార్గదర్శి, రామోజీరావుల తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, వసూలు చేసిన డిపాజిట్లు చాలా వరకు వెనక్కు ఇచ్చేశామన్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకునే ఉమ్మడి హైకోర్టు మార్గదర్శిపై సీఐడీ నమోదు చేసిన ఫిర్యాదును కొట్టేసిందన్నారు. అసలు ఈ కేసుతో ఏపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ సమయంలో ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, మార్గదర్శి వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం కూడా పిటిషన్ దాఖలు చేసిందని, ఇందుకు సుప్రీంకోర్టు గతంలోనే అనుమతి మంజూరు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మార్గదర్శి అక్రమ డిపాజిట్ల వ్యవహారం కోర్టుకు వచ్చే సమయానికి నిబంధనలకు విరుద్ధంగా రూ.2,600 కోట్లు సేకరించిందని తెలిపారు. కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు కూడా మార్గదర్శి డిపాజిట్ల సేకరణను ఆపలేదని, అప్పుడు కూడా మరో రూ.2 వేల కోట్లు సేకరించిందని వివరించారు.

చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారా? లేదా?

ఈ కేసులో పిటిషనర్ అయిన ఉండవల్లి అరుణ్ కుమార్ పార్టీ ఇన్ పర్సన్ (కేసు దాఖలు చేసిన వ్యక్తి తన వాదనలను తానే వినిపించడం)గా వాదనలు వినిపిస్తూ, ఈ కేసులో తానే ఫిర్యాదుదారుడినని తెలిపారు. తీసుకున్న డబ్బు వెనక్కు ఇచ్చేశారా? ఎవరు ఇచ్చారు.. ఎవరికి ఇచ్చారు..? అన్న విషయాలు ముఖ్యం కాదన్నారు. చట్ట నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు వసూలు చేశారా? లేదా? అన్నదే ఇక్కడ చూడాల్సిన అంశమని తెలిపారు. హెచ్‌యూఎఫ్‌గా ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించింది నిజమో కాదో తేల్చాలని ఆయన కోర్టును కోరారు. ఆర్‌బీఐ తరఫు న్యాయవాది కూడా ఇక్కడే ఉన్నారని, ఆయన్ను అడిగితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. దీంతో ఆర్‌బీఐ తరఫు న్యాయవాది ఎంఆర్ రమేష్ బాబు స్పందిస్తూ, హెచ్‌యూఎఫ్‌గా సెక్షన్ 45ఎస్ ప్రకారం డిపాజిట్లు సేకరించడం ఆర్‌బీఐ చట్ట నిబంధనలకు విరుద్ధమని కోర్టుకు నివేదించారు. ఈ కేసులో కూడా ఇలాగే డిపాజిట్ల సేకరణ జరిగిందని తేల్చి చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ, ఇలా 45ఎస్‌కు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిన విషయాన్ని హైకోర్టుకు చెప్పారా? అని ప్రశ్నించింది. హైకోర్టులో మార్గదర్శి దాఖలు చేసిన వ్యాజ్యాల్లో తాము ప్రతివాది కానందున ఈ విషయాలను హైకోర్టు ముందుంచలేదన్నారు. సుప్రీంకోర్టులో ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన వ్యాజ్యంలో తమను ప్రతివాదిగా చేర్చారని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న విస్తృత ధర్మాసనం, అన్నీ వివరాలను నాలుగు పేజీల నోట్ ద్వారా తమ ముందుంచాలని ఇరుపక్షాలను ఆదేశించింది. ఆ వివరాల ఆధారంగా పూర్తి స్థాయి విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. వాదనలు వినిపించేందుకు అందరికీ అవకాశం ఇస్తామంది. తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. ఈ విచారణకు మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, సిద్ధార్థ లూత్రా, ఉండవల్లి తరఫున న్యాయవాదులు అల్లంకి రమేష్, అరుణా గుప్తాలు హాజరయ్యారు.

ఇదీ మార్గదర్శి బాగోతం

హిందూ అవిభక్త కుటుంబం పేరిట మార్గదర్శి ఫైనాన్షియర్స్ సాధారణ ప్రజానీకం నుంచి ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా రూ.2,600 కోట్లు సేకరించిందనే విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అన్ని ఆధారాలతో ఆర్‌బీఐ, కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి తగిన స్పందన లేకపోవడంతో చట్ట ప్రకారం తమ ముందున్న ఆధారాల ఆధారంగా మార్గదర్శిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మార్గదర్శి ఉల్లంఘనలపై విచారణ జరిపేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు ఎస్.రంగాచారిని నియమిస్తూ 2006లో జీవో 800 జారీ చేసింది. ఇదే సమయంలో సీఐడీ తరఫున సంబంధిత కోర్టుల్లో పిటిషన్లు, దరఖాస్తులు దాఖలు చేసేందుకు అధీకృత అధికారిగా టి.కృష్ణరాజును నియమిస్తూ జీవో 801 జారీ చేసింది. ఈ రెండు జీవోలపై మార్గదర్శి హైకోర్టును ఆశ్రయించగా, జీవోలపై స్టే చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్గదర్శి అక్రమాలపై విచారణ జరిపిన రంగాచారి 2007 ఫిబ్రవరిలో నివేదిక సమర్పించారు. రికార్డుల తనిఖీకి మార్గదర్శి ఏ మాత్రం సహకరించలేదని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. అలాగే మార్గదర్శి ఫైనాన్షియర్స్ భారీ నష్టాల్లో ఉందని, మెచ్యూరిటీ సమయంలో డిపాజిట్లు తిరిగి చెల్లించే పరిస్థితిలో ఆ సంస్థ లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిధులను ఇతర అనుబంధ కంపెనీలకు మళ్లించడమే ఈ పరిస్థితికి కారణమని ఆయన వివరించారు.

మార్గదర్శి చట్ట ఉల్లంఘనలపై అధీకృత అధికారి ఫిర్యాదు


మార్గదర్శి అక్రమాలు, చట్ట ఉల్లంఘనలపై అధీకృత అధికారి కృష్ణరాజు 2008 జనవరిలో నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) దాఖలు చేశారు. దీనిని కొట్టేయాలని కోరుతూ మార్గదర్శి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన సింగిల్ జడ్జి సీసీ 540లో తదుపరి చర్యలను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేయగా, సీసీ 540లో తదుపరి చర్యలు కొనసాగించుకునేందుకు అనుమతించింది. ఆ తర్వాత ఇదే సీసీ 540పై మార్గదర్శి మరో రూపంలో పిటిషన్ దాఖలు చేయడం ద్వారా హైకోర్టు సానుకూల స్టే ఉత్తర్వులిచ్చింది.

ఏకంగా ఫిర్యాదు కొట్టేసిన హైకోర్టు

2011లో తిరిగి సీసీ 540ని కొట్టేయాలంటూ సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద మార్గదర్శి పిటిషన్ దాఖలు చేసింది. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్) కింద తామెలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, అందువల్ల క్రిమినల్ ఫిర్యాదును కొట్టేయాలని కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏదైనా కేసులో స్టే కాల పరిమితి ఆరు నెలలు కావడంతో, హైకోర్టు ఇచ్చిన స్టే గడువు ముగిసింది. స్టే గడువు పెంపు కోసం మార్గదర్శి 2018లో పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇదిలా ఉండగా, సీసీ 540ని కొట్టేయాలంటూ మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్‌పై ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ విచారణ జరిపారు. ఉమ్మడి హైకోర్టు విభజనకు చివరి రోజు 2018 డిసెంబర్ 31న మార్గదర్శికి అనుకూలంగా తీర్పు వెలువరించారు. మార్గదర్శి కోరినట్లు సీసీ 540ని కొట్టేశారు. అందరూ హైకోర్టు విభజన హడావుడిలో ఉన్నప్పుడు వెలువడిన ఈ తీర్పును అప్పట్లో ఎవరూ గుర్తించలేదు. తీర్పు వెలువడిన కొంత కాలం తర్వాత అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో అప్పుడు ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2020 నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన జస్టిస్ రజనీ 2021 సెప్టెంబర్‌లో జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అమరావతి బెంచ్ సభ్యురాలిగా నియమితులై ప్రస్తుతం ఆ పోస్టులో కొనసాగుతున్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలోనే ఆమెకు ఎన్‌సీఎల్‌టీ పోస్టు ఖరారైంది.

ఆర్‌బీఐ తొలిసారి వచ్చింది

ఏళ్ల తరబడి మార్గదర్శిపై తాను చేస్తున్న పోరాటంలో కీలక విషయాన్ని తెలపడానికి ఆర్‌బీఐ తొలిసారిగా కోర్టుకు వచ్చిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. కోర్టు విచారణ అనంతరం ఉండవల్లి మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి తరఫున పేరు మోసిన సీనియర్ న్యాయవాదులు హాజరయ్యారని తెలిపారు. ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్ ప్రకారం డిపాజిట్లు సేకరణ చట్ట విరుద్ధమని న్యాయవాది రమేష్‌బాబు తెలిపారన్నారు. మార్గదర్శి, రామోజీరావు వంటి వారిపై కఠిన చర్యలు ఉంటేనే చిన్న చిన్న చిట్‌ఫండ్ మోసాలు కూడా అరికట్టవచ్చ న్నారు. రామోజీరావు అరెస్టు కావాలనేది తన ఉద్దేశం కాదని, ఈ తరహా మోసాలు అరికట్టడమే తన అభిమతమని స్పష్టం చేశారు. తన సొంత జిల్లాలో ఇటీవలే రెండు చిట్ ఫండ్ కంపెనీల మోసాలు వెలుగు చూశాయన్నారు. ఏపీలో ఫైనాన్స్ పేరుతో వసూళ్ల తగ్గుముఖం పట్టాలంటే కోర్టు ఈ కేసులో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఏప్రిల్ 9 నాటి విచారణతో స్పష్టత వస్తుందని, చట్టవిరుద్ధంగా వసూళ్లకు పాల్పడే వారి ముక్కుకు తాడు పడుతుందని ఆశిస్తున్నానని తెలిపారు.



మేడారం.. మెట్రోసిటీ

నిత్యం చీకట్లతో నిండి ఉండే అడవితల్లి విద్యుత్ వెలుగుల రంగేసుకుంది. సమ్మక్క-సారలమ్మల జాతరతో మేడారం జనసంద్రంగా మారింది. జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన వెలుగులు మెట్రోసిటీని తలపిస్తున్నాయి.

- మేడారం నుంచి సాక్షి ఫొటోగ్రాఫర్

1946లో ఆదాయం రూ.17వేలు

మీకు తెలుసా..

మేడారం (హన్మకొండ కల్చరల్): ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క-సారలమ్మల జాతర ఆదాయం స్వాతంత్య్రానికి ముందటి ఏడాది(1946 సంవత్సరం) రూ.17,173. 1958లో రెవెన్యూ రికార్డులో చేరిన ఈ జాతరను సుమారు 100ఏళ్ల క్రితమే నిజాం ప్రభుత్వం గుర్తించింది. అప్పటికే 15వేల మందికిపైగా భక్తులు తల్లులను దర్శించుకునేవారట. అప్పటి జనాభాతో పోలిస్తే అతిఎక్కువ సంఖ్యలో హాజరైనట్టే కదా.. నిజాం సోషల్‌సర్వీస్ డిపార్టుమెంట్ జాతరను పర్యవేక్షించగా.. 10ఎకరాల భూమిని జాతరకోసం కేటాయించి, ములుగు తహసీల్దార్ ద్వారా భక్తులకు సౌకర్యాలు కల్పించేవారు. జంపన్న వాగుతోపాటు మల్లన్నగుంట



చెరువును భక్తులు వినియోగించుకునేవారు. అప్పటికి జాతర బయ్యక్కపేటలోనే జరిగేది. ములుగు తహసీల్దార్ అనుమతితో నియమించిన కమిటీ జాతర ఆదాయ వ్యయాలతోపాటు, జాతరలో పని చేసినవారి వాటాలను నిర్ణయించేది. పెద్ద తాటిమొద్దులను గద్దెల చుట్టూ పాతి ప్రజలను కట్టడిచేసేవారు. భక్తులు హుండీలో అణా పైసలకంటే ఎక్కువ వేసేవారుకాదు. మొక్కుబడులకే ప్రాధాన్యం ఉండేది. దీంతో జాతర నిర్వహించడం కోయగిరిజనులకు కష్టమైంది. పీవీ నర్సింహారావు హయాంలో 1970లో జాతరను దేవాదాయశాఖ పరిధిలో చేర్చారు. రోజుకు రూ.14 ఇస్తూ అక్కడి ఉపాధ్యాయులనే వలంటీర్లుగా నియమించేవారు. 1980లో బాపురెడ్డి కలెక్టర్‌గా ఉన్న సమయంలో విశేష ప్రచారం లభించిన మేడారం జాతరను 1996లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర జాతరగా గుర్తించింది. ప్రస్తుతం ఈ జాతర ప్రపంచానికి ఆకర్షణీయంగా మారింది.

శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాల నడుమ బయల్దేరిన పగిడిద్దరాజు



పగిడిద్దరాజు పెళ్లికొడుకాయెనె..

సాక్షి, మహబూబాబాద్: సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బైలెల్లారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో మంగళవారం తలపతులు పెనక వెంకటేశ్వర్లు ఇంట్లో పసుపు, కుంకుమలతో పూజలు చేసి అక్కడినుంచి పాన్పు తీసుకుని డప్పు వాయిద్యాలతో పగిడిద్దరాజు దేవాలయానికి వెళ్లారు. ఆలయంలో మొక్కులు సమర్పించి, కుంకుమ, పసుపులను ఎరుపు రంగులో ఉన్న బట్టతో కప్పి దేవాలయంలో పెట్టారు. అనంతరం పూజారులు వనం (వెదురు)ను తీసుకొచ్చి పగిడిద్దరాజు(పడిగె రూపంలో)ను పెళ్లికుమారుడిగా ముస్తాబు చేశారు. తదనంతరం గద్దెపై ప్రతిష్ఠించి మొక్కులు చెల్లించారు. వడ్డెలు కల్తి జగ్గారావు పడిగెను పట్టుకుని గ్రామం నుంచి మేడారం బయలుదేరారు. దేవర గ్రామం దాటే వరకు మహిళలు నీళ్ల ఆరబోస్తూ.. ప్రయాణంలో ఎలాంటి ఆపద కలుగకుండా చూడాలని మొక్కులు చెల్లించారు. సుమారు 70 కిలోమీటర్లు అటవీ మార్గం ద్వారా కాలినడకన ప్రయాణం చేస్తారు. మార్గమధ్యలోని కర్లపల్లి, లక్ష్మీపురంలోని పెనక సాంబయ్య ఇంట్లో సేద దీరారు. బుధవారం సాయంత్రం 6గంటల వరకు మేడారం చేరుకుంటామని ప్రధాన పూజారులు పెనక రాజేశ్వర్, పురుషోత్తం, సురేందర్, రాహుల్, వీరస్వామి, వెంకటేశ్వర్లు తెలిపారు.

వన.. జనజాతరకు వేళాయె..

నేటినుంచి నాలుగు రోజులపాటు మేడారం మహాజాతర

- రూ.110 కోట్లతో భక్తులకు ఏర్పాట్లు
- బుధవారం కన్నెపల్లి నుంచి సారలమ్మ రాక.. రేపు సమ్మక్క
- మేడారం బాటలో గోవిందరాజు, పగిడిద్దరాజు
- నాలుగు రోజులపాటు వనమంతా జనమే..

సాక్షిప్రతినిధి, వరంగల్: ఆసియా ఖండంలో అతిపెద్ద ఆదివాసీ జాతర, తెలంగాణ కుంభమేళాకు వేళయింది. మాఘశుద్ధ పౌర్ణమి (సమ్మక్కల పున్నం) రోజు ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర.. భక్తుల కోసం ముస్తాబైంది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు అత్యంతవైభవంగా జరిగే జాతర కోసం భక్తులు మంగళవారం రాత్రినుంచే మేడారం చేరుకుంటున్నారు. బుధవారం సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపైకి రావడంతో మహా జాతర ప్రారంభమవుతుంది. వనదేవతల వారంగా భావించే బుధవారం రోజున.. మేడారం, కన్నెపల్లి, కొండాయి, పూనుగొండ్లలో జాతరకు శ్రీకారం చుడతారు. 4 ప్రాంతాల్లోనూ వనదేవతల పూజ కార్యక్రమాలు నిర్వహించడంతో జాతర లాంఛనంగా మొదలవుతుంది. ఈసారి 1.50 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేసి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లు మంజూరు చేయగా, కేంద్రం రూ.5 కోట్లు కేటాయించింది.

మంగళవారంనుంచే మొదలైన కీలక ఘట్టం..

కోట్లాది మంది భక్తులు ఎదురుచూసే ఈ మహాజాతరలో తొలిఘట్టం మంగళవారం నుంచే మొదలైంది. సమ్మక్క భర్త పగిడిద్దరాజును పెళ్లి కుమారుడిగా తయారు చేయడంతో ప్రారంభమైంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో పెనక వంశానికి చెందిన పూజారులతోపాటు గ్రామస్తులు పగిడిద్దరాజును పడగరూపంలో పెళ్లికుమారుడిగా అలంకరించి ఆలయంలో పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రతిమతో మేడారానికి అటవీ మార్గంలో కాలినడకన బయలుదేరారు. బుధవారం మేడారం వస్తారు. కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవింద రాజులు సైతం మేడారంలోని సమ్మక్క ఆలయానికి చేరుకుంటారు.



మేడారానికి తరలివస్తున్న భక్తులు



ఏ రోజు ఏం జరుగుతుందంటే..

నేడు (బుధవారం) సారలమ్మ ఆగమనం: కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకురావడంతో జాతర మొదలవుతుంది. సమ్మక్క కూతురైన సారలమ్మ నివాసం కన్నెపల్లి. మేడారం గద్దెలకు సుమారు మూడు కిలో మీటర్ల దూరంలోని ఈ గ్రామంలో చిన్న ఆలయంలో ప్రతిష్ఠించిన సారలమ్మను బుధవారం సాయంత్రం జంపన్నవాగు మీదుగా మేడారంలోని గద్దెల వద్దకు తీసుకువస్తారు. అదేరోజు సారలమ్మ గద్దె పైకి రాకమునుపే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజును... గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు.



రేపు (గురువారం) సమ్మక్క రాక: జాతరలో ముఖ్యమైనది రెండో రోజు. సాయంత్రం వేళ సమ్మక్క గద్దెపైకి వస్తుంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో చిలకలగుట్టపై కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను చేతపట్టుకుని ప్రధాన పూజారులు గద్దెల వద్దకు చేరుకుంటారు. వందల మంది పోలీసులు వారికి రక్షణగా ఉంటారు. ములుగు జిల్లా ఎస్పీ తుపాకీతో గాల్లోకి కాల్చి దేవతకు ఆహ్వానం పలుకుతారు. సమ్మక్కను ఇరువైపులా కోళ్లు, యాటలను బలిస్తూ స్వాగతిస్తారు. తల్లి రాకతో మేడారం ప్రాంతం మొత్తం భక్తిపారవశ్యంతో ఊగిపోతుంది.

23 (శుక్రవారం)న గద్దెలపై తల్లులు.. గద్దెలపై ఆసీనులైన సమ్మక్క-సారలమ్మలు మూడో రోజు అశేష భక్తజనానికి దర్శనమిస్తారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటారు. దీంతో గద్దెల ప్రాంగణాలు జనసంద్రమవుతాయి. జాతరలో మేడారానికి ఇదే రోజు ఎక్కువ మంది వస్తారు.



24(శనివారం)న దేవతల వన ప్రవేశం: నాలుగోరోజు సమ్మక్కను చిలకలగుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి, గోవిందరాజును కొండాయికి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు కాలినడకన తీసుకెళ్తారు. ఇలా దేవతలు వన ప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. భక్తులు ఇళ్లకు తిరుగు పయనమవుతారు.

నేడు సారలమ్మ.. రేపు సమ్మక్క ..


సమ్మక్క కూతురు సారలమ్మ నివాసం కన్నెపల్లి. మేడారం గద్దెలకు 3 కిలోమీటర్ల దూరంలోని ఈ కుగ్రామంలో చిన్న ఆలయంలో ప్రతిష్ఠించిన సారలమ్మ నేడు (బుధవారం) సాయంత్రం మేడారంలోని గద్దె వద్దకు చేరుతుంది. దేవదూతగా భావించే పూజారి సారలమ్మను మోస్తారు. సారలమ్మ జంపన్న వాగు నుంచి నేరుగా మేడారంలోని తల్లి సమ్మక్క దేవాలయానికి చేరుకుంటుంది. కడుపు పండాలని కోరుకునేవారు.. దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న వందలాది మంది తడిబట్టలతో గుడి ఎదుట.. సారలమ్మ తరలుతున్న రోడ్డుమార్గాన సాష్టాంగ నమస్కారాలతో వరం పడతారు. సారలమ్మ కొలువుదీరిన మరుసటి రోజు గురువారం సాయంత్రం సమ్మక్క గద్దెపైకి వస్తుంది. ఆ రోజు ఉదయమే పూజారులు చిలకలగుట్టకు వెళ్లి వనం (వెదురు కర్రలు) తెచ్చి గద్దెలపై పూజలు చేస్తారు. ఇద్దరు తల్లులు గద్దెలపై చేరడంతో దర్శనం కోసం భక్తజనం బారులుదీరుతారు. ఆడపడుచులుగా భావిస్తూ పసుపుకుంకుమలు, చీర, సారెలు పెడతారు. ఒడిబియ్యం పోస్తారు. తలనీలాలు సమర్పించుకుంటారు. ఎత్తు బంగారం (బెల్లం) నైవేద్యంగా పెడతారు.

ఈసారి 1.50 కోట్ల మంది భక్తులు..!

మేడారం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య ఈసారి 1.50 కోట్లు ఉంటుందని ప్రభుత్వం అంచనా. ఈ మేరకు జాతరలో ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించగా, కేంద్రం రూ.5కోట్లు విడుదల చేసింది. 21నుంచి 24వరకు సమ్మక్క -సారలమ్మ జాతర జరుగుతోంది. ఆర్టీసీ సుమారు 6వేల బస్సులను అందుబాటులో ఉంచింది. 10వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. ఈ నాలుగు రోజులు జిల్లా యంత్రాంగం అంతా ఇక్కడినుంచే పని చేయనుంది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఓ మోస్తరుగా ఉన్న భక్తుల రాక రాత్రి వరకు పెరిగింది. మేడారం పరిసర ప్రాంతాల్లో ఉన్న రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. పొలాల్లో జనాల గుడారాలు వెలిశాయి. తాత్కాలికంగా నిర్మించిన అద్దె ఇళ్లలోకి భక్తులు చేరిపోయారు. మరికొందరు భక్తులు తమ వాహనాలనే ఇళ్లుగా మార్చుకుని అమ్మల దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు.



అరచేతిలో మేడారం



ఈసారి జాతరలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

- డ్రోన్‌లతో భక్తుల రద్దీ, ట్రాఫిక్ పర్యవేక్షణ
- 'మై మేడారం గైడ్' యాప్‌లో అన్ని విశేషాలు..
- సమాచార మార్పిడికి ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌లు
- సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు

వరంగల్ డెస్క్: తెలంగాణ కుంభమేళా, గిరిజన, ఆదివాసీ జాతర అయిన మేడారం జాతర.. ఈ ఏడాది ఆధునిక టెక్నాలజీతో అరచేతిలో ఇమిడిపోతోంది. గత జాతర అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి పోలీసులు, వివిధ విభాగాల అధికారులు 'స్మార్ట్' సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. జాతర సమయంలో ఎక్కడ ఏమి జరిగినా వెంటనే తెలిసిపోయేలా ఏర్పాట్లు చేసుకున్నారు. గద్దెల వద్ద భక్తుల రద్దీ, ప్రైవేట్ వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ జామ్‌కాకుండా క్రమబద్ధీకరణ, పార్కింగ్ స్థలాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా నెట్‌వర్క్‌ను రూపొందించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు.. సమ్మక్క, సారలమ్మల దర్శనం సాఫీగా జరిగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈసారి జాతరలో వినియోగిస్తున్న టెక్నాలజీ, ప్రత్యేకతలను ఒకసారి చూద్దాం..

సీసీ కెమెరాల నిఘాలో..

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతర పరిసరాల్లో 500 సీసీ కెమెరాలు, 15 డ్రోన్‌లు, వాకీటాకీల ద్వారా భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. సీసీ కెమెరాలను గద్దెలకు సమీపంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. ఇక్కడినుంచి అధికారులు పర్యవేక్షణ చేస్తుంటారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ అందుబాటులో ఉంటాయి. జాతరలో ఎనిమిది జోన్లుగా 42 సెక్టార్స్‌గా విభజించి ప్రతి జోన్‌లో నోడల్ అధికారి, జోనల్ అధికారి, సెక్టోరల్ అధికారి విధుల్లో ఉంటారు.

సమ్మక్క- సారలమ్మ వెబ్‌సైట్

జాతర ప్రారంభమయ్యే నాటి నుంచి ముగిసే వరకు ఏయే కార్యక్రమాలు జరుగుతాయనే వివరాలతో అందరికీ అర్థమయ్యే రీతిలో సమాచారాన్ని మేడారం జాతర వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 21న బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు రావడం, గురువారం సమ్మక్క చిలకలగుట్ట నుంచి గద్దెకు చేరడం, శుక్రవారం మొక్కులు, శనివారం తల్లుల వనప్రవేశం కార్యక్రమాలను చూసుకోవచ్చు. జాతర ఫొటోలు, సమాచారాన్ని సైట్‌లో పొందుపర్చారు. ఫొటో గ్యాలరీలు, మీడియా సమాచారం అందుబాటులో ఉంటుంది.

- భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలను డ్రోన్ కెమెరాల ద్వారా గమనించి వాహనాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ద్విచక్ర వాహనాల ద్వారా నిరంతరం గస్తీ నిర్వహిస్తూ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తున్నారు.

అందుబాటులోకి 'మై మేడారం గైడ్' యాప్

భక్తులకు రహదారులు, పార్కింగ్ స్థలాలు, తల్లుల గద్దెల ప్రాంగణ సమాచారం క్షణంలో తెలిసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం.. పోలీసు శాఖ, కలెక్టర్ ఆధ్వర్యంలో 'మై మేడారం గైడ్' యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ పనిచేస్తుంది. స్మార్ట్‌ఫోన్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి 'మై మేడారం గైడ్' యాప్ అని టైప్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఎలాంటి సమాచారం ఎంటర్ చేయకుండానే ఇది జీపీఎస్ ద్వారా లొకేషన్ షేరింగ్‌తో పనిచేస్తుంది. తాగునీటి సౌకర్యం ఉన్న చోటు.. మీకు ఎంత దూరంలో ఉందో చూపెడుతుంది. వైద్యం, పార్కింగ్, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానఘట్టాలు, తప్పిపోయిన వారి సమాచార కేంద్రాలు, అగ్నిమాపక శాఖ సర్వీసులు ఇలా సమస్త సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు. గతంలో రూపొందించిన యాప్‌కు భిన్నంగా 'మై మేడారం గైడ్' యాప్‌ను తయారు చేశారు.

పార్కింగ్‌కు ఓ కోడ్

- జాతర చుట్టు పక్కల ఇటు తాడ్వాయి, అటు పస్రా, నార్లాపూర్, ఊరట్టం, కొండాయి ప్రాంతాలనుంచి మేడారం జాతరకు ఎలా చేరుకోవాలో వివరిస్తూ.. ఈసారి ఒక్కో పార్కింగ్‌కు కోడ్‌ను కేటాయించారు. ఏ1, ఏ2, సీ1, సీ2 ఇలా నంబర్లు ఇస్తూ అడ్రస్‌లకు ల్యాండ్ మార్కింగ్స్ ఇచ్చారు. దీనివల్ల తమ కుటుంబ సభ్యులు ఏ ప్రాంతంలో ఉన్నారో సులభంగా తెలిసిపోతుంది.
- సెక్టార్ల వారీగా విధులు నిర్వర్తించే అధికారులు, జిల్లా ఉన్నతాధికారుల మధ్య సమన్వయం ఉండేలా.. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేశారు. సెక్టార్‌లో ఏర్పడిన సమస్యలను వెంటనే ఆ గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. దీంతో క్షణాల్లో ఉన్నతాధికారులకు విషయం తెలిసే అవకాశం ఉంది. అంతేకాకుండా ఉన్నతాధికారుల ఆదేశాలు కూడా వెంటనే సెక్టార్ అధికారులకు చేరుతాయి.
- ఇప్పటికే ఆన్‌లైన్‌లో అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పణ కొనసాగుతోంది. మీసేవలో బుక్ చేసుకుని నగదు చెల్లిస్తే వారి బరువు అంత బంగారాన్ని గద్దెల వద్ద చెల్లిస్తున్నారు. తిరిగి ప్రసాదం కావాలంటే ఆర్టీసీ కార్గో, కొరియర్ ద్వారా ఇంటికి పంపిస్తున్నారు.

దొంగలున్నారు జాగ్రత్త!

మేడారం జాతర సందర్భంగా భక్తులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈమేరకు దొంగల ఫొటోలు, వివరాలతో కూడిన ఫ్లెక్సీలను జాతర పరిసరాల్లో ఏర్పాటు చేశారు. నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్లు, ఇతర సామగ్రిని భద్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

- మేడారం నుంచి సాక్షి ఫొటోగ్రాఫర్



మరికొన్ని గంటల్లో మహాజాతర..

- 23న సీఎం, గవర్నర్, స్పీకర్ వచ్చే అవకాశం
- మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క

మేడారం (ఎస్‌ఎస్‌తాడ్వాయి): మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఘట్టం మరికొన్ని గంటల్లో ఆరంభం కానుంది.. ఉద్విగ్న భరితమైన జాతర ఘడియలకు సమయం ఆసన్నమైందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మేడారంలోని మీడియా పాయింట్ వద్ద మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బుధవారం సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరుతారని తెలిపారు. గురువారం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను పూజారులు గద్దెపైకి తీసుకొస్తారని పేర్కొన్నారు. సామాన్య భక్తులు ఇబ్బందులు పడకుండా వీఐపీలు జాతరకు రావాలని సూచించారు. ఎమ్మెల్యే, ఎంపీలు, సీఎం రేవంత్‌రెడ్డి సైతం తల్లుల భక్తులేనని, ఈనెల 23న సీఎం, గవర్నర్, స్పీకర్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జాతరలో శాశ్వత ఏర్పాట్ల కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సెలవు తీసుకునే అంశంపై సీఎం చొరవ తీసుకుంటారని తెలిపారు. భక్తులకు బెల్లాన్ని ప్రసాదంగా పంపిణీ చేసేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, డీసీ శ్రీకాంత్‌రావు, ఈఓ రాజేంద్రం ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

క్లుప్తంగా...

1,600 గ్రూప్‌-1 పోస్టులు భర్తీ చేయాల్సిందే: కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మొత్తం 1,600 గ్రూప్‌–1 పోస్టులను భర్తీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య పేర్కొన్నారు. కేవలం 563 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు నోటిఫికేషన్‌ ఇవ్వడం నిరుద్యోగుల్ని మోసం చేయడమేనన్నారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో 33 జిల్లాలు ఏర్పడ్డాక అనేక శాఖల్లో గ్రూప్‌-1, 2, 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వీటితో పాటు ఉద్యోగ విరమణ చేసినవారి స్థానాలను సైతం భర్తీ చేయడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలెన్ని?, ఎందరు ఉద్యోగ విరమణ చేశారనే సమాచారం కోసం సీనియర్‌ ఐఏఎస్‌లతో కమిటీ వేయాలని డిమాండ్‌ చేశారు. వారు నివేదిక ఇవ్వకపోతే తామైనా ఇచ్చేందుకు సిద్ధమని ఆర్‌.కృష్ణయ్య స్పష్టం చేశారు.

రెండు దశల్లో కానిస్టేబుల్‌ శిక్షణ



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్‌ నియామక మండలి(టీఎస్‌ఎల్పీఆర్బీ) ద్వారా ఇటీవల ఎంపికైన కానిస్టేబుల్‌ కేడెట్లకు రెండు దశల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ట్రెయినింగ్‌ అడిషనల్‌ డీజీ అభిలాష బిస్త్‌ తెలిపారు. పోలీస్‌ శాఖలోని సివిల్‌, ఏఆర్‌, టీఎస్‌ఎస్పీ, ఎస్‌ఏఆర్‌ సీపీఎల్‌, ఐటీ, పీటీవో విభాగాల్లో కలిపి తుది ఎంపిక జాబితా టీఎస్‌ఎల్పీఆర్బీ నుంచి ఈ నెల 10న పోలీస్‌ శాఖకు అందినట్టు తెలిపారు. వీరిలో మొదటి దశలో 9,333 మంది సివిల్‌, ఏఆర్‌, ఎస్‌ఏఆర్‌ సీపీఎల్‌, ఐటీ, పీటీవో కానిస్టేబుల్‌ కేడెట్ల శిక్షణను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు శిక్షణ కేంద్రాల్లో బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. 2వ దశలో 4,725 మంది టీఎస్‌ఎస్పీ కానిస్టేబుల్‌ కేడెట్లకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

మార్చి 13 నుంచి ఫైర్‌మన్‌కు శిక్షణ



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖలో ఇటీవల భర్తీ అయిన ఫైర్‌మన్‌ల శిక్షణ మార్చి 13 నుంచి ప్రారంభం కానుంది. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ఫైర్‌ సర్వీసెస్‌ అండ్‌ సివిల్‌ డిఫెన్స్‌ ట్రెయినింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల నియామకాల్లో మొత్తం 599 మంది ఫైర్‌మన్‌ల ఎంపిక పూర్తయింది. వీరిలో ఇప్పటికే 499 మంది అభ్యర్థుల మెడికల్‌ పరీక్షలు, స్పెషల్‌ బ్రాంచ్‌ ఎంక్వైరీ కూడా పూర్తవడంతో వారందరికీ శిక్షణలో చేరేందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఇంకో 108 మంది అభ్యర్థుల ఎస్బీ ఎంక్వైరీ, మెడికల్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి.

15 నుంచి ఔటర్‌పై పేటీఎం ఫాస్టాగ్‌ సేవలు బంద్‌

సాక్షి, హైదరాబాద్‌: ఔటర్‌ రింగు రోడ్డుపైన పేటీఎం ఫాస్టాగ్‌ సేవలు నిలిచిపోనున్నాయి. మార్చి 15వ తేదీ నుంచి ఈ నిలిపివేత అమల్లోకి రానుంది. దీంతో ఇప్పటివరకు పేటీఎం ద్వారా ఫాస్టాగ్‌ చార్జీలను చెల్లిస్తున్న వాహనదారులు ఈ సేవల కోసం తమ ఖాతాలను ఇతర బ్యాంకుల్లోకి మార్చుకోవలసి ఉంటుంది. ఔటర్‌పైన రోజూ సుమారు 1.60 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో ఇప్పటివరకు అత్యధిక వాహనాలు పేటీఎం ఫాస్టాగ్‌ సేవలనే వినియోగించుకుంటున్నాయి. మరో 25 రోజుల్లోనే పేటీఎం సేవలు నిలిచిపోనున్న దృష్ట్యా వెంటనే తమ ఖాతాలను మార్చుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

ఐఈఆర్పీలను రెగ్యులరైజ్‌ చేయాలి: బి.వినోద్‌




సాక్షి, హైదరాబాద్‌: మానసిక వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులకు విద్యను అందిస్తున్న ఇంక్లూజివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ పర్సన్‌ (ఐఈఆర్పీ)లను రెగ్యులరైజ్‌ చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 20 ఏళ్లుగా వీరు విద్యను అందిస్తున్నారని, చాలీచాలని వేతనంతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వీరిని రెగ్యులరైజ్‌ చేయడానికి ప్రయత్నాలు జరిగాయని, అందుకు అవసరమైన పోస్టులను రెగ్యులర్‌ డీఎస్సీలో పొందుపర్చకుండా ఇతర ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. అయితే, ఎన్నికల కోడ్‌ అమల్లోకి రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 70 వేల వరకు చేరిందని, వీరందరికీ 996 మంది ఐఈఆర్పీలు బోధిస్తున్నారని, వీరిని రెగ్యులరైజ్‌ చేసి మిగిలిన పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయాలని సూచించారు.

మనకు భారత్‌ రైస్‌ భాగ్యం లేదా?

దేశవ్యాప్తంగా ఈనెల 6 నుంచి భారత్‌ రైస్‌ అమ్మకాలు

- రూ. 29కి కిలో చొప్పున 5 కిలోలు, 10 కిలోల బ్యాగులు
- నాఫెడ్‌, ఎన్సీసీఎఫ్‌, కేంద్రీయ భండార్‌కు బియ్యం కేటాయించిన కేంద్రం
- కానీ ఇప్పటివరకు వాటికి బియ్యం సరఫరా చేయని ఎఫ్‌సీఐ
- ఫలితంగా రాష్ట్రంలో ఇప్పటివరకు మొదలుకాని అమ్మకాలు



బియ్యం రాలేదు

రిటైల్‌ అమ్మకాల కోసం రైస్‌ బ్యాగులు మా దగ్గరికి రాలేదు. భారత్‌ రైస్‌ బ్యాగులకు ప్రజల నుంచి డిమాండ్‌ ఉంది. రోజూ ఎంక్వైరీలు వస్తున్నాయి. నాఫెడ్‌ ద్వారా ఈ బ్యాగులు రావలసి ఉంది. ఎప్పుడు పంపించినా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాం. భారత్‌ ఆటా పేరుతో పంపిన గోధుమ పిండి బ్యాగులు మాత్రం విక్రయించాం.

రమణమూర్తి, ఆర్‌.ఎం., కేంద్రీయ భండార్‌

సాక్షి, హైదరాబాద్‌: బియ్యం ధరలు ఆకాశన్నంటుతున్న నేపథ్యంలో సబ్సిడీ ధరతో దేశవ్యాప్తంగా అవసరమైన వారందరికీ నాణ్యమైన బియ్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బృహత్తర పథకం రాష్ట్రంలో మాత్రం అమలు కావడం లేదు. బాస్మతియేతర బియ్యం ఎగుమతిపై కేంద్రం నిషేధం విధించినప్పటికీ ధరలు అదుపులోకి రాకపోవడంతో ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని రూ.29కే విక్రయించాలని నిర్ణయించింది. భారత్‌ రైస్‌ పేరుతో ఈ బియ్యం అమ్మకాలను ఫిబ్రవరి 6వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభించింది. దేశంలోని ప్రధాన నగరాల్లో నేషనల్‌ అగ్రికల్చర్‌ కో–ఆపరేటివ్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా (నాఫెడ్‌), నేషనల్‌ కో ఆపరేటివ్‌ కన్సూమర్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా(ఎన్సీసీఎఫ్‌), కేంద్రీయ భండార్‌ రిటైల్‌ కేంద్రాలతో పాటు మొబైల్‌ అవుట్‌లెట్‌లలో కూడా భారత్‌ రైస్‌ విక్రయాలను ప్రారంభించారు. అమెజాన్‌, జియో మార్ట్‌, ఫ్లిప్‌కార్ట్‌ వంటి ఈ కామర్స్‌ సైట్స్‌ ద్వారా కూడా 5 కిలోలు, 10 కిలోల భారత్‌ రైస్‌ బ్యాగులను అందుబాటులోకి తెచ్చారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో రూ.29 కిలోల బియ్యం బ్యాగులు విక్రయిస్తున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం భారత్‌ రైస్‌ భాగ్యం సామాన్యులకు దక్కడం లేదు.

కేటాయింపులు జరిపినప్పటికీ...

ఫిబ్రవరి 6వ తేదీ నాటికే రాష్ట్రంలో కూడా అమ్మకాలు జరపాలని కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ భావించింది. ఈ మేరకు నాఫెడ్‌ ప్రాంతీయ కార్యాలయానికి సమాచారం అందించింది. ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం సేకరించి 5 కిలోలు, 10 కిలోల బ్యాగులలో నింపి విక్రయించే ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తొలి విడతగా నాఫెడ్‌, ఎన్సీసీఎఫ్‌, కేంద్రీయ భండార్‌కు ఒక్కో సంస్థకు 2 వేల టన్నుల చొప్పున బియ్యం కేటాయించింది. అయితే ఇప్పటివరకు బియ్యం బ్యాగ్‌లు రిటైల్‌ అవుట్‌లెట్లకు చేరలేదు.

డిపోలలోని బియ్యం ఇతర రాష్ట్రాలకే!

భారత్‌ రైస్‌ బ్యాగ్‌లకు అవసరమైన బియ్యాన్ని ఫుడ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఎఫ్‌సీఐ) నాఫెడ్‌కు సరఫరా చేయాలి. అయితే రాష్ట్రంలో నాఫెడ్‌కు అవసరమైన మేర బియ్యాన్ని ఎఫ్‌సీఐ పంపించలేదని సమాచారం. రాష్ట్రంలోని 52 ఎఫ్‌సీఐ డిపోలలో సుమారు 5లక్షల మెట్రిక్‌ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ, ఆ బియ్యం మొత్తం సెంట్రల్‌ పూల్‌ కింద ఇతర రాష్ట్రాలకు పంపించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్‌ రైస్‌ కోసం నాఫెడ్‌కు ఎఫ్‌సీఐ ప్రత్యేకంగా బియ్యాన్ని కేటాయించలేని పరిస్థితి నెలకొంది. దీనిపై కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖనే నిర్ణయం తీసుకోవాలని ఎఫ్‌సీఐ వర్గాలు చెపుతున్నాయి.

టీజీఓ అధ్యక్షుడిగా 'ఏలూరి'

గందరగోళం నడుమ టీజీఓ నూతన కార్యవర్గ ఎన్నిక



ఏలూరిని అభినందిస్తున్న టీజీఓ సభ్యులు



ఎన్నికల ప్రక్రియలో తోపులాట..

మన్సూరాబాద్‌(హైదరాబాద్‌): గందరగోళ పరిస్థితుల నడుమ తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల సంఘం (టీజీఓ) రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మన్సూరాబాద్‌ చింతలకుంటలో జనరల్‌ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, అసోసియేట్‌ అధ్యక్షుడిగా బి.శ్యామ్‌, ఉపాధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రావు, కోశాధికారిగా ఎం.ఉపేందర్‌రెడ్డి, జాయింట్‌ సెక్రటరీగా పరమేశ్వర్‌రెడ్డి, మహిళా ప్రతినిధిగా దీపారెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా రామకృష్ణాగౌడ్‌, కార్యనిర్వాహక సభ్యుడిగా యాదగిరిగౌడ్‌, అడ్వయిజర్లుగా రవీందర్‌రావు, పురుషోత్తంరెడ్డి, సురేష్‌ వాంకుడోత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మెరుగైన పీఆర్సీ సాధనకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఎన్నికల రిటర్నింగ్‌ అధికారులుగా ఎస్‌.రవి, సి.సంపత్‌కుమార్‌ వ్యవహరించారు.

వాగ్వాదం..తోపులాట

తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల సంఘం ఎన్నికల సందర్భంగా నామినేషన్‌ వేసేందుకు కొందరు ప్రయత్నించగా, మరికొందరు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరిగి తోపులాటకు దారితీసింది. ఎన్నికలు జరగాలని కొందరు, ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని మరికొందరు పట్టుబట్టడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. సభ్యుల గందరగోళం మధ్యనే రిటర్నింగ్‌ అధికారులు ఏకగ్రీవ ఎన్నిక ప్రకటన చేసి ఎన్నికల ప్రక్రియ ముగించారు.

నామినేషన్లు స్వీకరించకపోతే ఎలా ?

నామినేషన్లు స్వీకరించకుండా, రిట్నరింగ్‌ అధికారులను రూంలోకి ఉంచి తాళం వేసి ఎన్నికల ప్రక్రియ నిర్వహించారని ఓ వర్గం టీజీఓ నేతలు ఆరోపించారు. ఏకగ్రీవ ఎన్నికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని కొందరు టీజీఓ నేతలు సమావేశం వద్ద ఆందోళన చేసి నిరసనకు దిగారు.

ఉమ్మడి వ్యూహాలతో ముందుకెళదాం

'హ్యూమన్‌ ట్రాఫికింగ్‌' కట్టడిపై జీఆర్పీ, ఆర్పీఎఫ్‌, యూఎస్‌ కాన్సులేట్‌ అధికారులతో తెలంగాణ పోలీస్‌ సదస్సు

సాక్షి, హైదరాబాద్‌: మానవ అక్రమ రవాణా, పిల్లల భద్రతను కాపాడేందుకు ఉమ్మడి వ్యూహాలతో ముందుకు వెళ్లాలని తెలంగాణ పోలీసులు నిర్ణయించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన వ్యక్తుల జాడను కనుక్కోవడం'అనే అంశంపై ఒక్క రోజు సదస్సును మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సదస్సులో రైల్వే ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ (ఆర్పీఎఫ్‌), గవర్నమెంట్‌ రైల్వే పోలీస్‌ (జీఆర్పీ), యూఎస్‌ కాన్సులేట్‌, బచ్‌పన్‌ బచావో ఆందోళన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణాను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై వారు చర్చించారు. సదస్సులో భాగంగా రైల్వే, రోడ్డు భద్రత విభాగం అదనపు డీజీ మహేశ్‌ భగవత్‌ మాట్లాడుతూ...మానవ అక్రమ రవాణా ముఠాలు ఎలా పనిచేస్తాయి? వాటి కట్టడిలో దర్యాప్తు సంస్థలకు ఎదురయ్యే ఇబ్బందులు వంటి అంశాలను వివరించారు. యూఎస్‌ కాన్సులేట్‌ జనరల్‌ జెన్నిఫర్‌ లారెన్స్‌ మాట్లాడుతూ... హ్యూమన్‌ ట్రాఫిక్‌ను కట్టడి చేయడంలో తెలంగాణ మహిళా భద్రత విభాగం ఎన్నో చర్యలు తీసుకుంటోందని ప్రశంసించారు. మహిళా భద్రత విభాగం డీఐజీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ...ఈ విభాగం అదనపు డీజీ శిఖాగోయెల్‌ సూచనలతోనే ఈ ఒక్కరోజు సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానవ అక్రమరవాణాను ఎదుర్కోవడం, తప్పిపోయిన వ్యక్తుల జాడను కనుక్కోవడంలో అనుసరించాల్సిన పద్ధతులపై ఎస్‌ఓపీ (స్టాండర్డ్‌ ఆపరేటింగ్‌ ప్రొసీజర్స్‌)లను, సాంకేతికత వినియోగం వంటి అంశాలను సంబంధిత అధికారులకు వివరించినట్టు పేర్కొన్నారు.

పలు మార్గాల్లో 32 రైళ్ల రద్దు

సాక్షి, హైదరాబాద్‌: సాంకేతిక కారణాల దృష్ట్యా వివిధ మార్గాల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్‌ రాకేశ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు మేడ్చల్‌-సికింద్రాబాద్‌, మేడ్చల్‌-నాంపల్లి, మేడ్చల్‌-లింగంపల్లి మధ్య నడిచే పది సర్వీసులు రద్దు కానున్నాయి. కాచిగూడ-రాయచూర్‌, గద్వాల్‌-రాయచూర్‌, కాచిగూడ-కర్నూల్‌, కాచిగూడ-మహబూబ్‌నగర్‌, కాచిగూడ-కరీంనగర్‌, కరీంనగర్‌-బోధన్‌, సికింద్రాబాద్‌-సిద్దిపేట, కాచిగూడ-మెదక్‌, కాచిగూడ-మనోహరాబాద్‌, మహబూబ్‌నగర్‌-కాచిగూడ మధ్య నడిచే మరో 22 రైళ్లు ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రద్దుకానున్నాయి.

జమ్మికుంట కౌన్సిలర్‌ అరాచకం..

భూకబ్జాను అడ్డుకున్న ముగ్గురిపై దాడి



ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడుతున్న కౌన్సిలర్‌ రవీందర్‌

జమ్మికుంట: ప్రభుత్వ భూమి కబ్జా చేసి బోరు వేయడమే కాకుండా.. ఆక్రమణ సరి కాదని అడ్డుచెప్పిన ముగ్గురు గ్రామస్తులపై కరీంనగర్‌ జిల్లా జమ్మికుంట మున్సిపల్‌ కౌన్సిలర్‌ విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. రామన్నపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మూడోవార్డులోని రామన్నపల్లి ప్రభుత్వ పాఠశాల, వాటర్‌ ట్యాంక్‌ సమీప సర్వే నంబర్‌ 422లో కౌన్సిలర్‌ మేడిపల్లి రవీందర్‌ ప్రభుత్వ భూమి కబ్జా చేశాడు. అక్రమంగా బోరు వేసేందుకు యత్నిస్తుండగా , గ్రామస్తులు మర్రి మల్లయ్య, కోలకాని రాజు, మేడిపల్లి రమేష్‌ అడ్డుకున్నారు. ఆగ్రహించిన కౌన్సిలర్‌ రవీందర్‌.. బుధవారం ఇనుప రాడ్‌తో ముగ్గురిపై విచక్షణ రహితంగా దాడిచేశాడు. దాడిలో మల్లయ్య, రాజుకు తీవ్రగాయాలు కాగా రమేశ్‌కు గాయాలయ్యాయి. మల్లయ్యను జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా, మిగిలిన ఇద్దరినీ స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, మల్లయ్య భార్య రజిత ఫిర్యాదు మేరకు రవీందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వి.రవి తెలిపారు.

అనుమతి లేకున్నా ఔషధాల తయారీ

- ఆస్పిన్‌ బయో ఫార్ములా ల్యాబ్స్‌పై డీసీఏ చర్యలు
- రూ.5.5 లక్షల విలువైన మందుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్‌: నిబంధనలు బేఖాతరు చేసి, ఔషధాలు తయారు చేస్తున్న ఆస్పిన్‌ బయోఫార్మా ల్యాబ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌పై డ్రగ్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ (డీసీఏ) అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ల్యాబ్‌పై మంగళవారం జరిపిన సోదాల్లో రూ.5.5 లక్షల విలువైన మందులను సీజ్‌ చేశారు. డీసీఏ డైరెక్టర్‌ జనరల్‌ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపిన వివరాలివి. మందుల తయారీలో నిబంధనలు పాటించకపోవడంతో శామీర్‌పేట్‌ మండలం బయోటెక్‌పార్క్‌లోని ఆస్పిన్‌ బయోఫార్మా ల్యాబ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌కు డ్రగ్‌ కంట్రోల్‌ అడ్మినిస్ట్రేషన్‌ మార్చి 2023న స్టాప్‌ ప్రొడక్షన్‌ ఆర్డర్‌ (మందులు తయారు చేయవద్దని) ఆదేశాలిచ్చింది. అయినా డీసీఏ ఆదేశాలను బేఖాతరు చేస్తూ సదరు ల్యాబ్‌ నిర్వాహకులు మందులు తయారు చేశారు. ఆస్పిన్‌ బయోఫార్మా ల్యాబ్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌.. గత ఏడాది డిసెంబర్‌లో మచ్చబొల్లారంలో యాంటీ క్యాన్సర్‌ నకిలీ మందులను తయారు చేస్తూ పట్టుబడిన కడారి సతీశ్‌రెడ్డికి చెందిన సంస్థ. సతీశ్‌రెడ్డి ఖమ్మంలోని తల్లాడ మండలం అన్నారుగూడెం వద్ద పట్టుబడిన నకిలీ మందుల తయారీ కేంద్రం కేసులోనూ కీలక నిందితుడని డీసీఏ డైరెక్టర్‌ జనరల్‌ వీబీ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.

రూ.65,370 కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్‌ హైడ్రోజన్‌ ఎనర్జీ హబ్‌

- విశాఖ సమీపంలోని పూడిమడకలో మూడు దశల్లో ఏర్పాటు.. సీఎస్‌ సమక్షంలో ఎన్టీపీసీ, ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందం

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వరంగ నవరత్న కంపెనీ నేషనల్‌ థర్మల్‌ పవర్‌ కార్పొరేషన్‌ (ఎన్టీపీసీ) విశాఖపట్నం సమీపంలోని పూడిమడక గ్రామంలో గ్రీన్‌ హైడ్రోజన్‌ హబ్‌ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ కేఎస్‌ జవహర్‌రెడ్డి సమక్షంలో ఎన్టీపీసీ గ్రీన్‌ ఎనర్జీ లిమిటెడ్‌, రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మూడు దశల్లో రూ.65,370 కోట్లను గ్రీన్‌ హైడ్రోజన్‌ రంగంలో పెట్టుబడులు పెట్టనున్నారు. మొదటి దశలో 2026 నాటికి రూ.681 కోట్లు, రెండో దశలో 2029 నాటికి రూ.31,200 కోట్లు, మూడో దశలో 2032నాటికి రూ.33,489 కోట్లు పెట్టుబడులు పెడతారు. ఇతర గ్లోబల్‌ కంపెనీల సహకారంతో 6,000 టీపీడీ గ్రీన్‌ అమ్మోనియాతోపాటు 300 టీపీడీ గ్రీన్‌ మిథనాల్‌ను ఎన్టీపీసీ గ్రీన్‌ ఎనర్జీ లిమిటెడ్‌ ఉత్పత్తి చేస్తుంది. ఇది 1,100 టీపీడీ గ్రీన్‌ హైడ్రోజన్‌ ఉత్పత్తి సామర్థ్యంతో భారతదేశంలోనే అతి పెద్ద కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఫార్‌టెస్క్యూ ఫ్యూచర్‌ ఇండస్ట్రీస్‌ (ఎఫ్‌ఎఫ్‌ఐ, ఆస్ట్రేలియా) ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తంచేసింది. ఆ కంపెనీ అభ్యర్థన మేరకు గ్రీన్‌ హైడ్రోజన్‌ హబ్‌ అభివృద్ధి కోసం ఎన్టీపీసీ అనుబంధ సంస్థకు సబ్‌ లీజు హక్కుల బదిలీకి ప్రభుత్వం అనుమతించింది. దీనిప్రకారం ఏపీఐఐసీ, ఎన్టీపీసీ ఎన్‌జీఈఎల్‌ (ఎన్టీపీసీ అనుబంధ సంస్థ) మధ్య లీజు డీడ్‌ అమలుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్‌ కె.విజయానంద్‌, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్‌, ఎన్టీపీసీ సీజీఎం వీవీ శివకుమార్‌, ఈడీ ఆర్‌.సారంగపాణి, డిప్యూటీ జీఎం రోహిత్‌ సలీల్‌ ముఖర్జీ పాల్గొన్నారు.

మార్కులు తక్కువొచ్చాయని డస్టర్‌తో బాది..

గురుకుల హాస్టల్‌ విద్యార్థులపై ఉపాధ్యాయుడి దాష్టీకం



తిరుమలాయపాలెం: తెలుగు పరీక్షలో మార్కులు తక్కువగా రావడంతో ఆగ్రహం పట్టలేకపోయిన ఉపాధ్యాయుడు విద్యార్థులను చితకబాదిన ఘటన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. గురుకుల హాస్టల్‌లో ఆరు నుంచి ఇంటర్‌ వరకు 516 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇటీవల పరీక్షలు నిర్వహించగా తెలుగులో మార్కులు తక్కువగా వచ్చాయని తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు బోర్డు తుడిచే డస్టర్‌తో విద్యార్థుల వీపులపై చితకబాదాడు. ఎన్ని మార్కులు తక్కువ వస్తే అన్ని దెబ్బలు కొడతానంటూ తరగతిలోని 64 మంది విద్యార్థులకుగాను 25 మందిని కొట్టాడు. దీంతో విద్యార్థుల వీపులపై వాతలు తేలగా కొందరు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో ఎస్సై గిరిధర్‌రెడ్డి చేరుకుని ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'టెట్‌ మార్కులు అప్‌లోడ్‌ చేయాలి'

సాక్షి, హైదరాబాద్‌: గురుకుల విద్యాసంస్థల్లో ట్రైన్డ్‌ గ్రాడ్యుయేట్‌ టీచర్‌(టీజీటీ) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తక్షణమే టెట్‌ మార్కులను అప్‌లోడ్‌ చేయాలని తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) కన్వీనర్‌ మల్లయ్యభట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా బోర్డు వెబ్‌సైట్‌ ద్వారా అభ్యర్థి లాగిన్‌ అయి మార్కులు అప్‌లోడ్‌ చేయాలని సూచించారు. 1:2 ప్రాథమిక ఎంపిక జాబితాలో టెట్‌ మార్కులు కీలకమని పేర్కొన్నారు.





వేలెడంత.. బారెడంత..

ప్రపంచంలోనే అత్యంత పొడవైన అబ్బాయి.. అత్యంత పొట్టి అమ్మాయి.. ఇద్దరూ ఒకచోట చేరితే.. ఇదిగో ఇలా ఉంటుంది. ఇతడి పేరు సుల్తాన్‌ కోసెన్‌.. వయసు 41 ఏళ్లు.. టర్కీకి చెందిన కోసెన్‌ పొడవు ఏకంగా 8 అడుగుల 3 అంగుళాలు.. మరి ఈమె పేరు జ్యోతి ఆమ్గే.. వయసు 30 ఏళ్లు.. ఇండియాకు చెందిన ఈమె పొడవు కేవలం రెండు అడుగులే. ఇద్దరి మధ్య తేడానే ఆరు అడుగులకన్నా ఎక్కువ. సుమారు ఆరేళ్ల కింద ఈజిప్ట్‌ పిరమిడ్ల దగ్గర ఈ ఇద్దరితో నిర్వహించిన ఫొటోషూట్‌ అప్పట్లో అందరి దృష్టినీ ఆకర్షించింది. మళ్లీ రెండు రోజుల కింద అమెరికాలోని కాలిఫోర్నియాలో మరో ఫొటో షూట్‌ కోసం వారిద్దరూ కలిశారు. అక్కడ తీసిన చిత్రాలే ఇవి.

- అకొండ్రోప్లాసియాగా పిలిచే లోపం వల్ల జ్యోతి ఎదుగుదల లేక మరుగుజ్జులా ఉండిపోతే.. పిట్యుటరీ గ్రంథిలో ట్యూమర్‌తో గ్రోత్‌ హార్మోన్‌ విపరీతంగా ఉత్పత్తయి కోసెన్‌ ఇలా భారీగా ఎదిగిపోయాడు.

ధ్వజారోహణ పూజలో భాగంగా గరుడ ముద్దలను ధ్వజస్తంభం వైపు ఎగురవేస్తున్న ఆచార్యులు




వైభవంగా ధ్వజారోహణం

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రెండోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ధ్వజారోహణం, వేద పారాయణాలు నిర్వహించారు. శ్రీస్వామి వారి వాహనమైన గరుడ ఆళ్వారుడిని కొత్త వస్త్రంపై చిత్రించి పూజలు చేశారు. గరుడ ముద్దలను ధ్వజస్తంభం వద్ద పైకి ఎగిరేసి పూజించారు. సాయంత్రం భేరీ పూజ, దేవతాహ్వానం విశేషంగా జరిపించారు. ఈ వేడుకల్లో ఆచార్యులు, పారాయణికులు, వేద పండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. బుధవారం అలంకార, వాహనసేవలకు శ్రీకారం చుట్టి, సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఇవి మార్చితే.. చావును ఏమార్చినట్టే!

మన నిత్య జీవన విధానం, అలవాట్లు వంటివి మన జీవితకాలంపై ప్రభావం చూపుతాయన్నది తెలిసిందే. మరి ఏయే అలవాట్లు, పద్ధతులు మార్చుకుంటే.. 'మరణం' మనకు ఎంతెంత దూరం జరుగుతుందో తెలుసా.. దానిపై ఓ విస్తృత అధ్యయనం జరిగింది. 2011–2019 మధ్య 40 నుంచి 99 ఏళ్ల మధ్య వయసున్న ఏడు లక్షల మందిపై జరిపిన పరిశోధనలో ఆరు కీలక అంశాలను గుర్తించారు. వీటిని పాటించని వారితో పోలిస్తే.. పాటించే వారిలో మరణ ప్రమాదం ఎంతవరకు తగ్గుతుందన్నది తేల్చారు. ముఖ్యంగా వ్యాయామం చేయనివారితో పోలిస్తే.. వారంలో కనీసం 150 నిమిషాల సాధారణ వ్యాయామం లేదా 75 నిమిషాల కఠిన వ్యాయామం చేసేవారు మరణానికి దూరంగా ఉంటారని గుర్తించారు. మానసిక ఒత్తిడి, ఆందోళనను నియంత్రించుకోగలిగితే 29 శాతం, డ్రగ్స్‌కు దూరంగా ఉంటే 38 శాతం మరణం రిస్కును తప్పించుకున్నట్టేనని తేల్చారు.



గొర్రెలకు మేతగా వరిచేను

నీరులేక మూడెకరాల వరిచేను ఎండిపోయింది. గొర్రెలకు మేతగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామపరిధిలోని తుక్కాపురానికి చెందిన రైతు మారుపాక అంజయ్య ఐదెకరాలను కౌలుకు తీసుకుని బోరుబావిపై ఆధారపడి యాసంగి వరి సాగుచేశాడు. అయితే భూగర్భజలాలు అడుగంటడంతో వారం నుంచి బోరునీరు లేక మూడు ఎకరాల మేర వరి పొలం ఎండిపోయింది. దీంతో చేసేదేమీలేక అందులో గొర్రెలను మేపుతున్నాడు. – ఆత్మకూరు(ఎం)



నాగరకత ముసుగులో...
ఆదివాసీలకు ఆధునిక సమాజం పెట్టే పరీక్షలు...
అడవి బిడ్డల చుట్టూ ఊహకందని ప్రమాదాలు...
పల్లెపదాలు... జానపదజావళులకు... ఆమె అక్షరమైంది.
అలాగే...
అమెరికా ప్రకృతి అందాలు... మనవాళ్ల ప్రగతి సుగంధాలు కూడ.
ఆరుపదులు దాటిన ఆమెలోని రచయిత్రి...
ఇప్పుడు... పిల్లలకు కథల అమ్మమ్మ అవుతోంది.


కోరుపోలు కళావతి

కథల అమ్మమ్మ

విజయనగరం జిల్లా... స్వచ్ఛతకు, అమాయకత్వానికి నిలయం. అణచివేత, దోపిడీలను ప్రశ్నించే గళాలను పుట్టించిన నేల. ఇంటి గడపలే సప్తస్వరాలుగా సరిగమలు పలికే గుమ్మాలు ఒకవైపు. అరాచకాన్ని ఎదిరిస్తూ గళమెత్తిన స్వరాలు మరొకవైపు... పడుగుపేకల్లా అల్లుకుని సాగిన జీవన వైవిధ్యానికి ప్రత్యక్ష సాక్షి కోరుపోలు కళావతి. నాటి అమానవీయ సంఘటనలకు సజీవ సాక్ష్యాలు ఆమె రచనలు. చదివింది పదవ తరగతే. కానీ 'వాస్తవాలను కళ్లకు కట్టడానికి గొప్ప పాండిత్యం అవసరం లేదు, అన్యాయానికి అక్షరరూపం ఇవ్వగలిగితే చాలు. వాస్తవ జీవితాలు చెప్పే నీతి సూత్రం కంటే పాండిత్యం చెప్పగలిగిన న్యాయసూత్రం పెద్దదేమీ కాద'ని నిరూపిస్తోందామె. ఇటీవల 'మన్యంలో మధురకోయిల' రచనను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె సాక్షితో పంచుకున్న అక్షర జ్ఞాపకాలివి.

''మాది విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం గ్రామం. మా నాన్న పెదపెంకి కూర్మినాయుడు కమ్యూనిస్టు ఉద్యమంలో చురుగ్గా ఉండేవారు. వంగపండు ప్రసాద రావుగారితో కలిసి ప్రజాచైతన్యం కోసం పనిచేశారు. నేను చదివింది పదవ తరగతి వరకే. కానీ రాయాలనే దాహం తీరనంతగా ఉండేది. యద్దనపూడి సులోచనారాణి పెద్ద చదువులు చదవకపోయినా లెక్కలేనన్ని నవలలు రాశారని తెలిసి నాలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆమె స్ఫూర్తితోనే రచనలు మొదలుపెట్టాను. మా వారు టాటా స్టీల్‌లో అధికారి కావడంతో పెళ్లి తర్వాత మేము పాతికేళ్ల పాటు 'కద్మా'లో నివసించాం. కద్మా అనేది జార్ఖండ్‌లో జెమ్‌షెడ్‌పూర్ నగరానికి సమీపంలో, టాటా స్టీల్ కంపెనీ ఉద్యోగులు నివసించే ప్రాంతం. అక్కడ అన్ని ప్రాంతాలు, రకరకాల భాషల వాళ్లతో కలిసి జీవించడం నాకు మంచి అనుభవం. పిల్లలు పెద్దయ్యే వరకు ఇంటి బాధ్యతలే ప్రధానంగా గడిచిపోయింది నా జీవితం. కద్మాలో ఉన్న తెలుగు అసోసియేషన్ ఉగాది సంచిక కోసం వ్యాసాలు సేకరించడం, రాయడంతో సంతోషపడేదాన్ని. పదిహేనేళ్ల కిందట యూఎస్‌లో ఉన్న మా అమ్మాయి దగ్గర కొంతకాలం ఉన్నాను. ఇండియాకి వచ్చిన తర్వాత అక్కడి ప్రకృతి, మనవాళ్లు సాధిస్తున్న ప్రగతిని 'అమెరికా అందాలు గంధాలు' పేరుతో నవల రాశాను. అదే తొలి నవల. నేను రాయగలననే నమ్మకం వచ్చిన రచన కూడా. ఆ తర్వాత మా జిల్లా సంగీత కౌశలాన్ని వివరిస్తూ 'భారత్‌లో భాసిల్లిన విద్యల నగర సౌధము' రాశాను. మా గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు జీవితాన్ని చిన్న పదాలతో అల్లేసి, రాగయుక్తంగా పాడుతారు. ఆ వైనాన్ని 'జానపద జావళి' పేరుతో రాశాను. ఆదివాసీల స్వచ్ఛతకు అద్దం పట్టే 'గడ్డిగులాబీలు', ప్రతిమ, చిగురించే ఆశలు, వసివాడిన వసంతం, అవనిలో ఆంధ్రావని, జీవన స్రవంతి... ఇలా రాస్తూ ఉన్నాను, రాయడంలో ఉన్న సంతోషాన్ని ఇనుమడింప చేసుకుంటున్నాను. 'మన్యంలో మధురకోయిల' సుమారు యాభై ఏళ్ల కిందట ఆత్మహత్యకు పాల్పడిన మన్యం బాలికల యదార్థగాథ.

అంతకుమునుపు రాసిన 'ప్రతిమ' అరకు చుట్టూ సాగింది. ఒక ఫొటోగ్రాఫర్ అరకు ప్రకృతి సౌందర్యాన్ని, అడవిబిడ్డ అచ్చమైన స్వచ్ఛతను ఫొటో తీయడానికి తరచూ వస్తుండేవాడు. ఒక గిరిజన అమ్మాయిని ఫొటోలు తీసి, పోటీకి పంపించి అవార్డు తెచ్చుకుంటాడు కూడా. ఫొటోల పేరుతో మళ్లీ అరకు బాట పట్టిన ఆ ఫొటోగ్రాఫర్ అవకాశవాదం నుంచి తమ అడవి బిడ్డను కాపాడుకోవడానికి గిరిజనులు పెట్టిన ఆంక్షలకు కథా రూపమిచ్చాను.

ఆలయాలు సరే... ఆశ్రమాలూ కట్టండి!

నన్ను నేను వ్యక్తం చేసుకునే అవకాశాన్నిచ్చింది అక్షరమే. కథ అంటే ఊహల్లో నుంచి రూపుదిద్దుకోవాలని అనడం కూడా విన్నాను. కానీ నా కథాంశాలన్నీ వాస్తవాలే. అమెరికాలో మనవాళ్లు... మన సంస్కృతికి ఆనవాళ్లుగా పెద్ద పెద్ద ఆలయాలను నిర్మిస్తుంటారు. భాషల పరంగా సంఘాలు ఏర్పాటు చేసుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. కానీ భారతీయుల కోసం ఒక్క వృద్ధాశ్రమాన్నయినా కట్టారా? వార్ధక్యంలో ఉన్న తల్లిదండ్రులను ఇంగ్లిష్ వాళ్లు ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమంలోనే చేరుస్తారు. అక్కడ మనవాళ్లకు భాష తెలియక పోవడంతో మాట రాని మూగవాళ్లుగా జీవిస్తుంటారు. అదే మన భారతీయులే వృద్ధాశ్రమాలను నిర్మించి నిర్వహిస్తే... రిటైర్ అయిన తల్లిదండ్రులు మన ఆహారం తింటూ, మన భాష వాళ్లతో కబుర్లు చెప్పుకుంటూ అక్కడ సేదదీరుతారు కదా! అలాగే పండుగలు, సెలవులప్పుడు వీలు చూసుకుని కొడుకులు, కూతుళ్లు, మనవలు, మనవరాళ్లు వెళ్లి కలవడానికి వీలవుతుంది. నాకు కలిగిన ఈ ఆలోచననే ఆ రచనలో చెప్పాను.

నా అక్షరాలకు చిత్ర రూపం!

నా రచనలకు ముఖచిత్రం నా మనుమరాలు హర్షిత వేస్తుంది. తను సెవెన్త్ క్లాస్, ఇంగ్లిష్‌లో చిన్న చిన్న కథలు సొంతంగా రాస్తుంది. యూఎస్‌లో ఉన్న పెద్ద మనుమరాలు నందిని నా తొలి నవలను ఇంగ్లిష్‌లో ట్రాన్స్‌లేట్ చేస్తానని తీసుకువెళ్లింది. నా ఇద్దరబ్బాయిలూ విజయనగరంలో ఇంజనీర్లే. నేను, మా వారు వాళ్ల దగ్గర శేషజీవితాన్ని గడుపుతున్నాం. నా రచనల్లో కర్పూరకళిక, వలస వచ్చిన వసంతం, వాడినపూలే వికసించునులే, కలలగూడు' వంటి వాటికి పుస్తకరూపం ఇవ్వాలి. పిల్లలకు కథలు చెప్పే నానమ్మలు, అమ్మమ్మలు కరవైన ఈ రోజుల్లో 'బాలానందం' పేరుతో పిల్లల కథల పుస్తకం రాశాను. అది ముద్రణ దశలో ఉంది. అక్షరంతో స్నేహం... నాకు జీవితంలో ఎదురైన ఎన్నో సమస్యలను ఎదుర్కోగలిగిన మనోధైర్యాన్నిచ్చింది. నా ఈ స్నేహిత ఎప్పటికీ నాతోనే ఉంటుంది'' అన్నారు కళావతి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: కంది గౌరీ శంకర్, సాక్షి, విజయనగరం



తొలివాక్యం ఆత్మవిశ్వాసాన్నిచ్చింది!

నేను రాసిన తొలివాక్యం 'కొట్టు కొనమంటుంది–పొట్ట తినమంటుంది'. ఈ వాక్యానికి ఐదు రూపాయల పారితోషికం అందుకున్నాను. ఆ ఐదు రూపాయలను ఖర్చు చేయకుండా చాలా ఏళ్లు దాచుకున్నాను. అప్పుడు నేను ఐదవ తరగతి. చందమామ పత్రికలో ఫొటో ఇచ్చి ఒక వాక్యంలో వ్యాఖ్యానం రాయమనేవారు. మా పెద్దన్నయ్య భాస్కరరావు పుస్తకం తెచ్చిచ్చి క్యాప్షన్ రాయమన్నాడు. 'ఒక చిన్న కుర్రాడు ఆకలితో పచారీ కొట్టు ముందు బేలగా నిలబడి వేలాడదీసిన అరటి గెల వైపు చేయి చూపిస్తూ ఉన్నాడు. కొట్టతడేమో డబ్బిస్తేనే ఇస్తానంటూ కసురుకుంటున్నాడు' ఇదీ అందులో విషయం. ఆ తొలివాక్యమే కవయిత్రి కావాలనే కలకు కారణం అయింది. నేను చూసిన సంఘటనలు, నా గమనింపునకు వచ్చిన అంశాలు కొత్త రచనకు ఇంధనాలయి తీరుతాయి. అలా ఒక వాక్యంతో మొదలైన నా అక్షరవాహిని జీవనదిలా సాగుతోంది.

– కోరుపోలు కళావతి, రైటర్

మోటివేషనల్ స్పీకర్

'ఐయాం సారీ'...
తప్పులు, పొరపాట్లు చేసి సారీ చెప్పడం అందరూ చేసే పని.
కాని జీవితంలో 'సారీ'లు కొనసాగుతూ ఉంటే మనం ఇంకా ఎదగలేదని, తప్పుల నుంచి నేర్చుకోవడం లేదని అర్థమంటారు ప్రియా కుమార్.
'అలవాటుగా తప్పు చేయడం దుర్లక్షణం' అనే ప్రియా కుమార్ తనవైన సూత్రీకరణలతో మోటివేషనల్ స్పీకర్‌గా మారారు.
పర్సనాలిటీ డెవలప్‌మెంట్ రచనలు చేస్తూనే దేశంలో టాప్ 10 మహిళా వ్యక్తిత్వ వికాస నిపుణులలో ఒకరిగా ఎదిగారు.
విజయానికి ఆమె చెప్తున్న సూత్రాలు.

'సారీ' చెప్తారా? ఎదుగుతారా?



ప్రియా కుమార్

'నెగెటివ్ థింకింగ్ ఉన్నవాళ్లు సమస్యలను ఊహించుకుంటూ భయపడుతుంటారు. వాళ్లు ఊహించి ఎదురు చూసే సమస్యలు చాలామటుకు ఎదురుపడవు. కాని ఇలా నెగెటివ్ థింకింగ్ వల్ల నిజంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు దానిని ఎదుర్కొందాం అనే కుతూహలం నశిస్తుంది. సమస్య మీద ఫోకస్ నిలువదు. సమస్యను పరిష్కరించాల్సింది పోయి దాని వల్ల నష్టపోతారు' అంటుంది ప్రియా కుమార్. ఈమెది చండీగఢ్.

47 ప్రపంచ దేశాలలో ప్రియా కుమార్ కార్పొరేట్ సంస్థలకు మోటివేషనల్ స్పీకర్‌గా ఉన్నారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి ఆమె రాసిన 12 పుస్తకాలు అంతర్జాతీయ అవార్డులను పొందాయి. బయోగ్రఫీలు రాయడం మరో ఆసక్తిగా కలిగిన ప్రియా కుమార్ తాజాగా పుల్లెల గోపీచంద్ బయోగ్రఫీ 'షట్లర్స్ ఫ్లిక్'ను వెలువరించారు. డ్రీమ్, డేర్, డెలివర్ అనేది ఆమె నినాదం.

ఇలా గెలవండి:

ఒక వ్యక్తి కెరీర్ సఫలం కావాలంటే అతని కుటుంబ జీవనం సరిగ్గా ఉండాలని అంటుంది ప్రియా. 'మీరు ఇల్లు విడిచి ఆఫీసుకు వస్తారు. మీరు విడిచి వచ్చిన ఇల్లు తిరిగి మీరు చేరే సమయానికి మీకు ఆహ్వానం పలికేలా ఉండాలి. అది మీ బడలిక తీర్చి మరుసటి రోజు మిమ్మల్ని కార్యోన్ముఖులను చేసేదిగా ఉండాలి. అలా ఉండాలంటే మీరు ఇంటిని, ఆఫీసును వేరు చేయకూడదు. అంటే మీ పనిలో ఏం జరుగుతున్నదో, మీరేం చేస్తున్నారో, మీరు ఎక్కడకు వెళుతున్నారో, ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారో కొద్దిగా అయినా ఇంటి సభ్యులకు తెలియచేయాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మీ పనిని మీ ఇంటి సభ్యులతో జత చేయాలి. అప్పుడే వారు మీ ఉద్యోగ జీవితాన్ని సరిగా అర్థం చేసుకుని మీకు మద్దతుగా నిలుస్తారు' అంటుందామె. 'ఒక ఉద్యోగంలో మీరు చేరితే జీవితాంతం ఆ ఉద్యోగం చేయాలని లేదు. అక్కడ కొందరు రాజకీయాలు చేసి మీరు పని చేయలేని స్థితి వస్తే అలాంటి టాక్సిక్ వాతావరణం నుంచి బయటపడేయడానికి వారు మీకు సాయం చేస్తున్నారని అర్థం. అక్కడి నుంచి బయటపడి కొత్త జీవనాన్ని మొదలెట్టండి. మీకు ఉద్యోగం మీ సామర్థ్యాన్ని చూసి ఇస్తారు. మీరు ఉద్యోగంలో ఆ సామర్థ్యాన్ని ప్రదర్శించాలి. ఈ సామర్థ్యానికి– దాని ప్రదర్శనకు మధ్య ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనడంలోనే మీ విజయం ఆధారపడి ఉంది' అని తెలుపుతుంది ప్రియ కుమార్.

సారీలు మానండి:

'జీవితంలో ఏదో ఒక దశలో సారీలు చెప్పలేని స్థితికి చేరుకోవాలి. సారీ చెప్తున్నామంటే పొరపాటో, తప్పో చేస్తున్నామని అర్థం. చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని ఎదగలేకపోవడం వల్ల మళ్లీ మళ్లీ సారీ చెప్పాల్సి వస్తుంది. సారీ చెప్పొచ్చు. కాని దానినొక అలవాటుగా చేసుకుని అలాగే నెట్టుకొద్దామంటే ముందుకు పోలేరు' అంటుంది ప్రియ కుమార్. 'మీ గురించి ఎవరైనా మంచిగా మాట్లాడుతున్నారంటే మీరు వారి నుంచి మంచి ఆశించి, వారితో మంచిగా వ్యవహరిస్తున్నారని అర్థం. అలాగే మీ గురించి ఎవరైనా చెడుగా మాట్లాడుతున్నారంటే వారిలోని మంచి కాకుండా చెడు బయటకు వచ్చేలా వారితో మీరు వ్యవహరిస్తున్నారని అర్థం' అంటుందామె. 'కొందరు సమస్యలను ఆహ్వానించడమే పనిగా పెట్టుకుంటారు. లేదా సమస్యలను సృష్టిస్తారు. మీలోని సామర్థ్యాలను గుర్తించి వాటి కోసం మీ శక్తిని పాజిటివ్‌గా ఉపయోగిస్తే సమస్యల్లో కాకుండా విజయాలలో ఉంటారు' అని గెలుపు సూత్రాలు తెలుపుతోందామె.

యూత్ పల్స్



రెడీ టు బడి

* ఎలా సాధించాలి * ఎలా సంపాదించాలి

డిజిటల్ స్టార్ కావడం అనేది అదృష్టం కాదు. అవకాశం. ఆ అవకాశం చేతికి అందాలంటే 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అనేది బాగా తెలిసి ఉండాలి. చాలామందిలో ఈ అవగాహన లోపించి 'ఆరంభ శూరత్వం' ప్రదర్శిస్తున్నారు. 'ఇది మనకు వర్కవుట్ అయ్యేలా లేదు' అని రథాన్ని వెనక్కి మళ్లిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని.. డిజిటల్ కంటెంట్ క్రియేటర్ కావాలని కలలు కనే యువతరం కోసం 'స్పియర్‌క్రాఫ్ట్ అకాడమీ'లాంటి నయా స్కూల్స్ వస్తున్నాయి. 'కంటెంట్ కోచ్'లాంటి నయా గురువులు వస్తున్నారు. కెమెరా యాంగిల్స్ నుంచి 'ఏ టైమ్‌లో వీడియోను పోస్ట్ చేయాలి?' 'బ్రాండ్‌లతో ఎలా కొలాబరేట్ కావాలి... లాంటి సమస్త విషయాలను నేర్చుకుంటున్నారు...

దిల్లీకి చెందిన ఇరవై సంవత్సరాల కదలికి డిజిటల్ కంటెంట్ క్రియేటర్ కావాలనేది కోరిక. పబ్లిక్ స్పీకింగ్, బ్లాగింగ్‌పై పట్టు సాధించడానికి షార్ట్ కమ్యూనికేషన్ కోర్సులో చేరింది. డిజిటల్ స్టార్‌డమ్ ప్రభావంతో, తాము కూడా ఆ స్థాయిలో పేరు తెచ్చుకోవాలనే లక్ష్యంతో పర్సనల్ బ్రాండ్ బిల్డింగ్ కోసం బడి బాట పడుతున్న అనేకానేక మందిలో కదలి ఒకరు.

2022తో పోల్చితే మన దేశంలో 2024లో కంటెంట్ క్రియేటర్‌ల సంఖ్య బాగా పెరిగిందని చెబుతోంది ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ఫర్మ్ జెమ్‌ఫో.

'ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే చాలు, ఆడియో అండ్ వీడియో కాప్చరింగ్ తెలిసి ఉంటే చాలు కంటెంట్ క్రియేటర్‌గా రాణించవచ్చు అని అనుకోవడానికి లేదు. నేర్చుకోవడానికి చాలా ఉంది' అంటున్నాడు కంటెంట్ కోచ్, బ్రాండ్ కన్సల్టెంట్ మనీష్ పాండే. మనీష్ లాంటి కంటెంట్ కోచ్‌ల ద్వారా సాంకేతిక విషయాలపై నైపుణ్యంతో పాటు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో ఎలాంటి వీడియోలు ఆదరణ పొందుతున్నాయో తెలుసుకుంటున్నారు ఔత్సాహిక కంటెంట్ క్రియేటర్‌లు.

డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కావాలనుకునేవారి కోసం 'స్పియర్‌క్రాఫ్ట్ అకాడమీ' పేరుతో ఫస్ట్ స్కూలు ఏర్పాటయింది. 'కంటెంట్‌ను ఎలా క్రియేట్ చేయాలి? ఎలా ఎడిట్ చేయాలి? పర్సనల్ గ్రూమింగ్, వార్డ్‌రోబ్

కొండంత అండ...


బృంద శర్మ

మన దేశంలోని టాప్ డిజిటల్ స్టార్స్‌లో 27 సంవత్సరాల బృంద శర్మ ఒకరు. డిజిటల్ స్టార్ కావాలని, అవుతానని ఎప్పుడు అనుకోలేదు. కొండలు, గుట్టలు అంటే ఆమెకు ఇష్టం. వాటిని వెదుక్కుంటూ వెళ్లడం అంటే ఇష్టం. దుబాయ్‌లో చేసే 9–5 ఉద్యోగం కంటే కొండల గుండెల చప్పుడు వినడం అంటేనే ఆమెకు ఇష్టం. ఎన్నో దేశాలలో ఎన్నో పర్వతాలకు సంబంధించిన ఆసక్తికరమైన చరిత్రను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా లోకంతో పంచుకునేది. ఆ తరువాత ట్రావెలింగ్‌కు సంబంధించిన వీడియోలతో ఫుల్–టైమ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారింది. ప్రకృతిపై ప్రేమ, ప్రయాణం అనేది పూర్తిగా తన వ్యక్తిగత విషయం అన్నట్లుగా ఉండేది బృంద. అయితే అనునయ్‌సూద్ అనే ఫ్రెండ్ సలహాతో ఇన్‌స్టాగ్రామ్ మిషన్ ప్రారంభించింది. తన వీడియోలను వైరల్ చేయాలని, కావాలనీ... బృంద ఎప్పుడూ అనుకోలేదు. అయితే కంటెంట్‌లో ఉన్న సత్తాతో ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. బృందశర్మను డిజిటల్ స్టార్‌ను చేశాయి.

మేనేజ్‌మెంట్, బాడీ లాంగ్వేజ్...ఇలా వెరైటీ కోర్సులను ఆఫర్ చేస్తున్నాం. మంచి స్పందన ఉంది' అని చెబుతున్నారు 'స్పియర్‌క్రాఫ్ట్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌమ్యబ్రాత్రసేన్ గుప్తా.

మరోవైపు మైక్రో అండ్ నానో ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కంటెంట్ కోచ్‌లకు బిగ్గెస్ట్ క్లయింట్స్‌గా ఉన్నారు.

కన్సల్టేషన్ కోసం తన దగ్గరకు వస్తున్న వారిలో చిన్న వ్యాపారాలు చేస్తున్నవారు, నెయిల్ ఆర్టిస్ట్‌లు, స్కిన్‌కేర్ క్రియేటర్‌లు... ఇలా అన్ని రకాల వారు ఉన్నారని హైదరాబాద్‌కు చెందిన కంటెంట్ కోచ్ ఇషిక పన్సారీ చెబుతోంది.

'ఆరు నెలల వ్యవధిలో 600 మందికి శిక్షణ ఇచ్చాను' అని చెబుతుంది ఇషిక. సెషన్‌లో భాగంగా కంటెంట్ ఐడియాలు ఇస్తుంది.

'బార్టర్ డీల్స్ నుంచి బ్రాండ్ కొలాబ్రేషన్స్, యాడ్–జెనరేటెడ్ రెవెన్యూ వరకు కంటెంట్ క్రియేషన్ స్పేస్‌లో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ 'డబ్బు' అనేది చివరి అంశం. డబ్బు సంపాదించడానికి ఓపిక, స్థిరత్వం ఉండాలి' అంటాడు కంటెంట్ కోచ్ మనీష్ పాండే.

ఇరవై రెండు సంవత్సరాల దామినీ చౌదురీ ఫుడ్, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా రాణించాలనుకుంటుంది. 'ఇటీవలే పర్సనల్ స్టైలింగ్, ఇమేజ్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాను. నాకు 7,000 ఫాలోవర్స్ ఉన్నారు' అంటున్న దామిని శిక్షణ ద్వారా ఓవరాల్ ప్రెజెంటేషన్, అప్రోచ్‌లో చిన్న చిన్న మార్పులు చేసుకుంది.

'ఆడియెన్స్‌తో కనెక్ట్ అయ్యే స్పార్క్ అనేది ఏ కొద్దిమందికో పరిమితమైనది కాదు' అంటున్న కంటెంట్ కోచ్‌లు బ్రాండ్‌తో ఎలా కొలాబరేట్ కావాలి. ఎలా నెగోషియేట్ చేయాలి, కంటెంట్‌ను ఎలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి, బెటర్ కెమెరా యాంగిల్ ఎలా ఉపయోగించాలి... మొదలైన టెక్నికల్ యాస్పెక్ట్స్‌ను సులభంగా తెలియజేస్తున్నారు.

కంటెంట్ క్రియేషన్ కోర్సుల కోసం చాలామంది స్కిల్స్ షేర్, ఉడెమీలాంటి ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. వీడియో పోస్ట్ చేయడానికి రోజులో మంచి టైమ్ ఏమిటి? ఎలాంటి పరికరాలు కావాలి? ఎలాంటి లైటింగ్ బాగా ఉపయోగపడుతుంది... లాంటి విషయాలను నేర్చుకుంటున్నారు.

ప్రేక్షక లోకమే పాఠశాల


ట్వింకిల్ జైన్

సీఏ పరీక్షలు పూర్తయిన తరువాత ఫైనాన్స్ ప్రొఫెషన్‌లోకి వచ్చింది ట్వింకిల్ జైన్. ఫైనాన్షియల్ లిటరసీని దృష్టిలో పెట్టుకొని 2021 నుంచి సోషల్ మీడియా వేదికగా వీడియోలు చేయడం మొదలు పెట్టింది. 'బిజినెస్ అండ్ ఫైనాన్స్‌కు సంబంధించిన వీడియోలు ఎవరు చూస్తారు?' అని అనుకొని ఉంటే 26 సంవత్సరాల వయసులోనే టాప్ డిజిటల్ స్టార్స్ జాబితాలో ట్వింకిల్ పేరు ఉండేది కాదు. తెలిసో తెలియకో జటిలమైన విషయాలను మరింత జటిలంగా చెబుతూ శ్రోతలను భయభ్రాంతులకు గురి చేస్తారు కొందరు. మరి కొందరు మాత్రం ఎంత జటిలమైన విషయాన్ని అయినా 'ఓస్ ఇంతేనా' అన్నట్లుగా సులభంగా అర్థమయ్యేలా చెబుతారు. ట్వింకిల్ జైన్ రెండో కోవకు చెందిన వ్యక్తి. ప్రేక్షక లోకమే ఆమె పాఠశాల. వారి నుంచే విలువైన పాఠాలను నేర్చుకుంది.

బ్యూటిప్స్

తక్షణ నిగారింపు కోసం...

ఒక్కోసారి అనుకోకుండా ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లాల్సి వస్తుంది. తీరిగ్గా తయారయ్యేంత సమయం ఉండకపోవచ్చు. అలాంటప్పుడు చిన్న టిప్స్ ద్వారా చర్మానికి తక్షణ నిగారింపు తీసుకురావచ్చు. అవేమిటో చూద్దాం..

క్లెన్సింగ్: ముందుగా కొద్దిగా రోజ్ వాటర్ ని తీసుకుని.. దానిని ముఖం అంతా అప్లై చేసుకోవాలి. ఇది స్కిన్ కి టోనర్ గా పని చేస్తుంది. ఇలా చేయడం వల్ల చర్మ రంధ్రాలు బిగుస్తాయి. చర్మానికి మేలు చేస్తుంది.

స్క్రబ్బింగ్: ఆ తర్వాత ఫేస్‌కి స్క్రబ్బింగ్ చేయాలి. ఇందు కోసం టమాటాను తీసుకుని దాన్ని మధ్యలోకి కట్ చేయాలి. ఇలా తీసుకున్న టమాటా మీద కాస్త పంచదార అద్ది దానితో ముఖంపై రుద్దాలి. ఇలా చేస్తే చర్మంపై ఉండే నల్ల మచ్చలు, ట్యాన్ తొలగి చర్మం మిలమిలలాడుతుంది.



మసాజ్

కలబంద గుజ్జు... అదే నండీ... కాస్తంత అలోవెరా జెల్‌ను తీసుకుని దీనితో చర్మంపై మృదువుగా మసాజ్ చేయాలి. అలోవెరాలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉండటం వల్ల అది మీ చర్మాన్ని కాంతిమంతంగా, మృదువుగా ఉండేలా చేస్తుంది.



గుల్‌వీర్ సింగ్ స్వర్ణం వెనక్కి...

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పురుషుల 3000 మీటర్ల విభాగంలో తాను గెల్చుకున్న స్వర్ణ పతకాన్ని భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ కోల్పోయాడు. టెహ్రాన్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో గుల్‌వీర్ రేసు సందర్భంగా తాను పరిగెడుతున్న వరుస నుంచి పక్క వరుసలోకి వెళ్లినట్లు తేలడంతో అనర్హత వేటు వేశారు. నిర్వాహకుల నిర్ణయాన్ని భారత బృందం అప్పీల్ చేయగా.. గుల్‌వీర్ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తేలడంతో అప్పీల్‌ను కొట్టివేశారు.



గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన పిన్న వయస్కుడిగా...

క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన పిన్న వయస్కుడిగా భారత సంతతికి సింగపూర్ కుర్రాడు అశ్వథ్ కౌశిక్ (8 ఏళ్ల 6 నెలల 11 రోజులు) రికార్డు నెలకొల్పాడు. స్విట్జర్లాండ్‌లో జరిగిన బర్గ్‌డార్ఫర్ స్టాడస్ ఓపెన్ టోర్నీ నాలుగో రౌండ్‌లో అశ్వథ్ 45 ఎత్తుల్లో పోలాండ్‌కు చెందిన 37 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ జాసెక్ స్టోపాపై గెలిచాడు. ఈ క్రమంలో లియోనిడ్ (సెర్బియా: 8 ఏళ్ల 11 నెలల 7 రోజులు) పేరిట ఉన్న రికార్డును అశ్వథ్ బద్దలు కొట్టాడు.

కోహ్లికి పుత్రోత్సాహం

మగ బిడ్డకు జన్మనిచ్చిన అనుష్క



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లికి కొడుకు పుట్టాడు. గత గురువారమే తన భార్య అనుష్క శర్మ మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు, అతని పేరు 'అకాయ్' అంటూ సోషల్ మీడియా ద్వారా కోహ్లి ప్రకటించాడు. 'ఫిబ్రవరి 15న మా జీవితాల్లోకి వామిక సోదరుడు అకాయ్ వచ్చాడు. ఈ సంతోషాన్ని మీతో పంచుకుంటున్నాం. ఈ ఆనందకర క్షణాల్లో మీ దీవెనలు మాకు కావాలి. మా ఏకాంతాన్ని గౌరవించండి' అని కోహ్లి వెల్లడించాడు. కోహ్లి, అనుష్కకు 2017 డిసెంబర్‌లో వివాహం కాగా... 2021 జనవరిలో కూతురు వామిక పుట్టింది. వ్యక్తిగత కారణాలతోనే కోహ్లి ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌కు పూర్తిగా దూరమయ్యాడు.

కేఎల్ రాహుల్ అవుట్



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ ఇంగ్లండ్‌తో జరిగే నాలుగో టెస్టుకూ దూరమయ్యాడు. తొడ కండరాల గాయం కారణంగా గత రెండు టెస్టులు ఆడని రాహుల్ కోలుకున్నాడని... ఈనెల 23 నుంచి జరిగే రాంచీ టెస్టులో ఆడతాడని వార్తలు వచ్చాయి. అయితే అతను పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో మరో మ్యాచ్ నుంచి తప్పుకున్నాడని బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. కోలుకుంటేనే చివరి టెస్టుకు అందుబాటులోకి వస్తాడని స్పష్టం చేసింది. మరోవైపు పని భారం కారణంగా ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు కూడా ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతినిస్తున్నట్లు ప్రకటించిన బోర్డు... అతడిని జట్టు నుంచి విడుదల చేసింది. రాజ్‌కోట్ టెస్టు ఆడని ముకేశ్ నాలుగో టెస్టుకు అందుబాటులోకి వచ్చాడు.

సుమిత్ శుభారంభం

పుణే: మహారాష్ట్ర ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు సుమిత్ నగాల్, రామ్‌కుమార్ రామనాథన్ శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సుమిత్ నగాల్ 7–6 (8/6), 6–4తో యు సియో సు (చైనీస్ తైపీ)పై... రామ్‌కుమార్ 7–6 (7/5), 7–6 (7/5)తో స్టెఫానో నపోలిటానో (ఇటలీ)పై కష్టపడి గెలిచి ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.



రంజీ 'ప్లేట్' చాంపియన్ హైదరాబాద్

ఫైనల్లో మేఘాలయాపై 5 వికెట్లతో విజయం ● వచ్చే సీజన్‌లో 'ఎలైట్' డివిజన్‌లో బరిలోకి

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ చాంపియన్‌గా హైదరాబాద్ జట్టు అవతరించింది. ఉప్పల్ స్టేడియంలో మేఘాలయ జట్టుతో జరిగిన ఫైనల్లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. 198 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 71/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 34.2 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (64; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్ సింగ్ (62; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... రోహిత్ రాయుడు (34; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించాడు. తిలక్, రోహిత్ నాలుగో వికెట్‌కు 82 పరుగులు జోడించారు. అయితే విజయానికి 7 పరుగుల దూరంలో తిలక్, 5 పరుగుల దూరంలో రోహిత్ అవుటయ్యాడు. చివరకు ఆర్యన్ బౌలింగ్‌లో చందన్ సహానీ కొట్టిన భారీ సిక్సర్‌తో హైదరాబాద్ విజయం ఖాయమైంది. ఆరు జట్లున్న ప్లేట్ గ్రూప్‌లో లీగ్ దశలో ఐదు మ్యాచ్‌ల్లో, సెమీఫైనల్లో, ఫైనల్లో గెలిచి హైదరాబాద్ అజేయంగా నిలిచింది. హైదరాబాద్‌తోపాటు రన్నరప్ మేఘాలయ జట్టు కూడా వచ్చే రంజీ ట్రోఫీ సీజన్‌లో అగ్రశ్రేణి జట్లు పోటీపడే 'ఎలైట్' డివిజన్‌కు అర్హత సాధించగా... ఈ సీజన్ 'ఎలైట్' డివిజన్‌లో పోటీపడ్డ 32 జట్లలో ఓవరాల్‌గా చివరి రెండు స్థానాల్లో నిలిచిన గోవా, మణిపూర్ జట్లు వచ్చే సీజన్‌లో 'ప్లేట్' డివిజన్‌కు పడిపోయాయి. 2022–23 సీజన్‌లో ఎలైట్ గ్రూప్ 'బి'లో హైదరాబాద్ ఆడింది. 7 మ్యాచ్‌లలో తొలి మ్యాచ్‌ను తమిళనాడుతో 'డ్రా' చేసుకున్న టీమ్ ఆ తర్వాత వరుస ఆరు వరుస పరాజయాలతో (ముంబై, అస్సాం, ఆంధ్ర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, ఢిల్లీ చేతుల్లో) నిష్క్రమించి ప్లేట్ డివిజన్‌కు పడిపోయింది. వచ్చే సీజన్‌లో హైదరాబాద్ ఎలాంటి ఆటను ప్రదర్శిస్తుందో వేచి చూడాలి.

'ఎలైట్' రంజీ ట్రోఫీ గెలిస్తే బీఎండబ్ల్యూ కార్లు...

'ప్లేట్' డివిజన్‌లో విజేతగా నిలిచిన తమ జట్టుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) 10 లక్షల నగదు పురస్కారాన్ని అందించింది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' నితేశ్ రెడ్డి... సెంచరీ సాధించిన ప్రజ్ఞయ్ రెడ్డి... 'ప్లేట్' డివిజన్‌లో 56 వికెట్లతో టాపర్‌గా నిలిచిన బౌలర్ తనయ్ త్యాగరాజన్... కెప్టెన్ తిలక్ వర్మ... 7 మ్యాచ్‌ల్లో కలిపి 765 పరుగులు సాధించి 'టాప్ స్కోరర్'గా నిలిచిన ఓపెనర్ తన్మయ్ అగర్వాల్‌లకు ప్రత్యేకంగా తలా రూ.50 వేల ప్రోత్సాహక బహుమతిని కూడా అందజేశారు. దీంతోపాటు వచ్చే సీజన్‌లో జట్టుకు ప్రేరణ అందించేందుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు మరింత భారీ ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. రాబోయే మూడేళ్లలో సత్తా చాటి హైదరాబాద్ రంజీ ట్రోఫీ టైటిల్ సాధిస్తే జట్టుకు రూ. 1 కోటి నగదు బహుమతిని, దాంతోపాటు జట్టులోని ఒక్కొక్కరికి బీఎండబ్ల్యూ కార్లను అందజేస్తామని ఆయన తెలిపారు.



కెప్టెన్ తిలక్ వర్మకు విన్నర్స్ ట్రోఫీ అందజేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

మార్చి 22 నుంచి ఐపీఎల్!



న్యూఢిల్లీ: ఐపీఎల్–2024 పూర్తిగా భారత్‌లోనే నిర్వహించడం ఖాయమైంది. లీగ్ చైర్మన్ అరుణ్ ధూమల్ ఈ విషయాన్ని నిర్ధారించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత్ బయట మ్యాచ్‌లు జరిపే అవకాశాలపై జరిగిన చర్చకు దీంతో తెర పడింది. అయితే ఒకేసారి పూర్తి షెడ్యూల్ ప్రకటించకుండా ఎన్నికల తేదీలను దృష్టిలో ఉంచుకొని తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 'మార్చి 22 నుంచి ఐపీఎల్ ప్రారంభించాలనే ఆలోచనతో ఉన్నాం. తేదీల విషయంపై మేం ప్రభుత్వ అధికారులతో చర్చిస్తున్నాం. ముందుగా 15 రోజుల మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేస్తాం. ఆపై తర్వాతి తేదీలను ప్రకటిస్తాం. అయితే అన్ని మ్యాచ్‌లు భారత్‌లోనే జరగడం ఖాయం' అని ధూమల్ స్పష్టం చేశారు. ఐపీఎల్ ప్రారంభమైన తర్వాతి ఎన్నికల సమయంలో 2009లో టోర్నీ మొత్తం దక్షిణాఫ్రికాలో జరిగింది. 2014లో కొన్ని మ్యాచ్‌లు భారత్‌లో, మరికొన్ని యూఏఈలో నిర్వహించారు. అయితే 2019లో మాత్రం మొత్తం టోర్నీ ఇక్కడే జరిగింది. ఇదే తరహాలో ఈసారి కూడా షెడ్యూల్‌ను ప్రకటించవచ్చు. ఐపీఎల్ తర్వాత కొద్ది రోజుల్లోనే టి20 ప్రపంచ కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో లీగ్ ఫైనల్ మే 26న జరిగే అవకాశం ఉంది.

నాకౌట్ దశకు భారత టీటీ జట్లు

రెండో రౌండ్‌లో ఇటలీ, కజకిస్తాన్‌లతో 'ఢీ'

బుసాన్ (దక్షిణ కొరియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. గ్రూప్–1లోని చివరి లీగ్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 3–2తో స్పెయిన్‌పై గెలిచి 7 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్–3లోని చివరి లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 3–0తో న్యూజిలాండ్‌ను ఓడించి 6 పాయింట్లతో మూడో స్థానాన్ని సంపాదించింది. నేడు జరిగే నాకౌట్ దశ రెండో రౌండ్ పోటీల్లో ఇటలీతో భారత మహిళల జట్టు... కజకిస్తాన్‌తో భారత పురుషుల జట్టు తలపడతాయి. క్వార్టర్ ఫైనల్ చేరితే భారత జట్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారవుతాయి.

స్పెయిన్‌తో జరిగిన పోటీలో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన భారత బృందం ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో నెగ్గడం విశేషం. తొలి మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ 9–11, 11–9, 11–13, 4–11తో మరియా జియావో చేతిలో... రెండో మ్యాచ్‌లో మనిక బత్రా 11–13, 11–6, 11–8, 9–11, 7–11తో సోఫియా జువాన్ జాంగ్ చేతిలో ఓడిపోయారు. మూడో మ్యాచ్‌లో ఐహిక ముఖర్జీ 11–8, 11–13, 11–8, 9–11, 11–4తో ఎల్విరా రాడ్‌పై గెలిచి భారత ఆశలను సజీవంగా నిలిపింది. నాలుగో మ్యాచ్‌లో మనిక బత్రా 11–9, 11–2, 11–4తో మరియా జియావోపై నెగ్గడంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో ఆకుల శ్రీజ 11–6, 11–13, 11–6, 11–3తో సోఫియా జువాన్ జాంగ్‌ను ఓడించి భారత విజయాన్ని ఖాయం చేసింది.



ఐహిక



మనిక



ఆకుల శ్రీజ

'టై'తో టైటాన్స్ ముగింపు



పవన్

పంచ్‌కులా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌ను తెలుగు టైటాన్స్ జట్టు 'టై'తో ముగించింది. యు ముంబా, తెలుగు టైటాన్స్ జట్ల మధ్య మంగళవారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్ 45–45 వద్ద 'టై' అయింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ 14 పాయింట్లు స్కోరు చేసి టైటాన్స్ జట్టును ఓటమి నుంచి కాపాడాడు. నిర్ణీత 22 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తెలుగు టైటాన్స్ 19 మ్యాచ్‌ల్లో ఓడిపోయి, ఒక మ్యాచ్‌ను 'టై' చేసుకొని, రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి 21 పాయింట్లతో చివరిదైన 12వ స్థానంతో సరిపెట్టుకుంది. తొమ్మిదో సీజన్‌లోనూ టైటాన్స్ చివరి స్థానంలోనే నిలిచింది. నేడు జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో యూపీ యోధాస్; హరియాణా స్టీలర్స్‌తో బెంగళూరు బుల్స్ ఆడతాయి.

శ్రీనిధి డెక్కన్ జట్టు గెలుపు



ఐజ్వాల్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఖాతాలో తొమ్మిదో విజయం చేరింది. ఐజ్వాల్ ఎఫ్‌సీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 5–1తో నెగ్గింది. శ్రీనిధి జట్టు తరఫున కాస్టనెడా (28వ ని.లో), ఎలీ సబియా (66వ ని.లో), బ్రాండన్ (90వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... సిసోకో (83వ ని.లో, 90+6వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు. ఐజ్వాల్ జట్టుకు జోహెర్లియానా (49వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. 13 జట్లు పోటీపడుతున్న ఐ–లీగ్‌లో శ్రీనిధి జట్టు 14 మ్యాచ్‌లు ఆడి 29 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

సినిమా

సినిమా చూసి సెల్యూట్ కొడతారు
- వరుణ్ తేజ్



● సందీప్ ముద్దా, మానుషీ చిల్లర్, వరుణ్ తేజ్, నవదీప్, శక్తి ప్రతాప్ సింగ్

''మన సైనికుల త్యాగాలని గుర్తు చేసుకుంటూ వారి ధైర్య సాహసాలని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చేసిన ప్రయత్నమే 'ఆపరేషన్ వాలెంటైన్'. మనందరికీ దేశ భక్తి ఉంటుంది.. కానీ, మా సినిమా చూశాక అది మరింత పెరుగుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో వరుణ్ తేజ్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మానుషీ చిల్లర్, రుహానీ శర్మ, నవదీప్ కీలక పాత్రలు పోషించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమా మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సినిమా హిందీ ట్రైలర్‌ను హీరో సల్మాన్ ఖాన్, తెలుగు ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ రిలీజ్ చేశారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''మన దేశంలో సినిమా పెద్ద వినోద సాధనం. సరదాగా కాలక్షేపం చేయాలంటే అందరూ ముందు సినిమావైపు వెళ్తారు. అందుకే ప్రేక్షకులు ఖర్చు పెట్టే టిక్కెట్ డబ్బులకి న్యాయం చేయాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాను. చాలా కొత్తగా, ఎడ్జ్ ఆఫ్ ది సీట్ కూర్చుని గూస్ బంప్స్ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేసే చాలా సన్నివేశాలు ఈ మూవీలో ఉన్నాయి. ఈ సినిమాని చాలా గర్వంగా, గుండెల నిండా దేశభక్తితో చూసి మన సైనికులకు సెల్యూట్ కొడతారు'' అన్నారు. ''యాక్షన్, ఫన్, ఎమోషన్.. ఇలా అన్ని అంశాలున్న చిత్రమిది'' అన్నారు శక్తి ప్రతాప్.

ఇక నా లీగల్ టీమ్ చూసుకుంటుంది

''అటెన్షన్ కోసం ఏ స్థాయికైనా దిగజారిపోయే వారిని పదే పదే చూస్తుండటం అసహ్యంగా అనిపిస్తోంది. అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇకపై నేను చేసేది, చేయాల్సింది నా లీగల్ టీమ్ చూసుకుంటుంది'' అని 'ఎక్స్'లో ఘాటుగా స్పందించారు త్రిష. కానీ ఎవరి పేరునూ ప్రస్తావించలేదు. కాగా తమిళనాడుకు చెందిన ఓ రాజకీయ నేత ఏవీ రాజు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల నేపథ్యంలోనే 'ఎక్స్' వేదికగా త్రిష పై విధంగా స్పందించారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. అక్కడి ఓ స్థానిక ఎమ్మెల్యేని ఉద్దేశించి కొన్ని ఆరోపణలు చేసే క్రమంలో త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు ఏవీ రాజు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ విశాల్, ఖుష్బూ వంటి పలువురు సినీ ప్రముఖులు సోషల్ మాధ్యమాల వేదికగా త్రిషకు మద్దతు తెలియజేస్తున్నారు.



● త్రిష

అతనో కామిక్ యాక్టర్
- సిద్ధు జొన్నలగడ్డ



● సిద్ధు, హర్ష

''సుందరం మాస్టర్' ట్రైలర్ బాగుంది. కల్యాణ్ సంతోష్‌కు తొలి చిత్రమిది.. మంచి ఫలితాన్నివ్వాలి. రవితేజగారు హీరోగా ఎంత బిజీగా ఉన్నా ఇలా కొత్తవాళ్లని ప్రోత్సహించేందుకు సినిమాలు నిర్మిస్తున్నారు'' అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. హర్ష చెముడు, దివ్య శ్రీపాద జంటగా కల్యాణ్ సంతోష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సుందరం మాస్టర్'. హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి సిద్ధు జొన్నలగడ్డ అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''హర్షని కమెడియన్ అనడం నాకు నచ్చదు. అతను ఓ కామిక్ యాక్టర్. ట్రైలర్‌లో చూసినట్టుగా హర్షని ఎప్పుడూ సీరియస్‌గా చూడలేదు'' అన్నారు. ''పదేళ్ల క్రితం ప్రేక్షకుల మధ్యలో ఉన్నాను. ఇప్పుడీ వేదికపై ఉన్నాను. గట్టిగా నమ్మితే ఏదైనా సాధించగలం'' అన్నారు హర్ష చెముడు. ''ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు సుధీర్ కుమార్. ''ఈ సినిమా మా యూనిట్‌కి గౌరవం తెస్తుంది, ప్రేక్షకులకు సంతృప్తినిస్తుంది'' అన్నారు కల్యాణ్ సంతోష్.

సొంతంగా పైకి రావాలనుకుంటున్నాడు
- విశ్వక్ సేన్

''విరాన్, నేను జిమ్ ఫ్రెండ్స్. తనకెంతో బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా సొంత కష్టంతో పైకి రావాలనుకుంటున్నాడు. 'ముఖ్య గమనిక' చిత్రం టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా విరాన్‌కి, యూనిట్‌కి మంచి విజయం అందివ్వాలి'' అన్నారు హీరో విశ్వక్ సేన్. హీరో అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి, లావణ్య జంటగా వేణు మురళీధర్ .వి దర్శకత్వం వహించిన చిత్రం 'ముఖ్య గమనిక'. రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ అతిథిగా పాల్గొన్నారు. వేణు మురళీధర్ మాట్లాడుతూ– ''నేనీ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం అల్లు అర్జున్‌గారు. విరాన్ 'ముఖ్య గమనిక' ఒప్పుకోవడం నా లక్'' అన్నారు. ''ఈ చిత్రం మంచి హిట్టవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు విరాన్.



● విశ్వక్ సేన్, విరాన్

యాత్ర ఆగదిక



● 'వెన్నెల' కిశోర్

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. టీజీ కీర్తి కుమార్ దర్శకత్వం వహించారు. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో మురళీ శర్మ ప్రధాన పాత్ర పోషించారు. అదితీ సోనీ నిర్మించిన ఈ సినిమా మార్చి 1న విడుదల కానుంది. సైమన్ కె. కింగ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి థీమ్ సాంగ్ విడుదల చేశారు మేకర్స్. 'చక చక మొదలిక... సాహసాల యాత్ర ఆగదిక... ఇది ఆపరేషన్ రుద్రనేత్ర' అంటూ ఈ పాట సాగుతుంది. ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, సంజీత భట్టాచార్య ఆలపించారు. ''చారి 111'లో ఈ ఒక్కటే పాట ఉంది. ఈ సాంగ్‌ని నేపథ్య సంగీతంలో ఉపయోగించాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

థ్రిల్లర్ డ్రామా

'బిగ్ బాస్' ఫేమ్ అర్జున్ కల్యాణ్, కుషిత కల్లపు జంటగా లక్ష్మణ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బాబు నెం1 బుల్ షిట్ గయ్'. దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా మార్చి 8న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకకి నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, ఎస్‌కేఎన్, దర్శకుడు సాయి రాజేశ్ అతిథులుగా హాజరై, ''ట్రైలర్ బావుంది.. సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. అర్జున్ కల్యాణ్ మాట్లాడుతూ– ''యునిక్ కాన్సెప్ట్‌తో థ్రిల్లర్, డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు. ''మా డీడీ క్రియేషన్స్‌ని ఈ సినిమా మరో స్థాయికి తీసుకెళుతుంది'' అన్నారు లక్ష్మణ వర్మ.



● కుషిత, అర్జున్ కల్యాణ్

డాన్ ప్రేయసి



● కియారా అద్వానీ

డాన్‌తో లవ్‌లో పడ్డారు హీరోయిన్ కియారా అద్వానీ. బాలీవుడ్ 'డాన్' ఫ్రాంచైజీలో రూపొందనున్న తాజా సినిమా 'డాన్ 3'. రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్న ఈ సినిమాను దర్శక–నిర్మాత – నటుడు–రైటర్ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కిస్తారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ నటించనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''కొత్త శకం మొదలైంది. 'డాన్' యూనివర్స్‌లోకి కియారాకు స్వాగతం'' అని 'డాన్ 3' మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రంలో కియారాకు కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉంటాయట. ''ఐకానిక్ 'డాన్ 3' ఫ్రాంచైజీలో భాగం కావడం థ్రిల్‌గా ఉంది'' అన్నారు కియారా అద్వానీ.

రీల్స్

పఠాన్ మళ్లీ రానున్నాడా?



● షారుక్ ఖాన్

షారుక్ ఖాన్ కెరీర్‌లో రూ. వెయ్యి కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించిన చిత్రం 'పఠాన్' (2023). వైఆర్‌ఎఫ్ (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా 'పఠాన్' సినిమాను నిర్మించారు. షారుక్ ఖాన్ టైటిల్ రోల్ చేశారు. కాగా 'పఠాన్' సినిమాకు సీక్వెల్‌గా 'పఠాన్ 2' తెరకెక్కించే పనిలో ఉన్నారట దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్. ఆల్రెడీ 'పఠాన్ 2' స్క్రిప్ట్ వర్క్ మొదలైందని, స్టోరీ బేసిక్ ఐడియాకు షారుక్ ఖాన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగానే 'పఠాన్' ఉంటుందని బాలీవుడ్ భోగట్టా. ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభం కానుందని టాక్.

ఆ సినిమాలతో పోలికే లేదు



● దీపక్ సరోజ్

''సిద్ధార్థ్ రాయ్'లో నా లుక్ చూసి 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' సినిమాల్లా ఉంటుందేమో అనిపించవచ్చు.. కానీ, 'సిద్ధార్థ్ రాయ్' కథకీ, ఆ చిత్రకథలకీ ఏ విషయంలోనూ పోలిక లేదు'' అన్నారు దీపక్ సరోజ్. బాలనటుడు దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. వి. యశస్వీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తన్వీ నేగి హీరోయిన్. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న రిలీజవుతోంది. ఈ సందర్భంగా దీపక్ సరోజ్ మాట్లాడుతూ– ''బాల నటుడిగా 'మిణుగురులు'లో నా పాత్రకి నంది అవార్డు వచ్చింది. ఆ తర్వాత ఎంబీఏ పూర్తి చేసి, ఫ్యామిలీ బిజినెస్‌లోకి వచ్చాను. యశస్వీగారు చెప్పిన 'సిద్ధార్థ్ రాయ్' కథ నచ్చడంతో ఈ సినిమా మొదలైంది. నా ప్రతిభను చూపించే అవకాశం ఈ మూవీ రూపంలో దొరికింది. నా పాత్రను ఒక సవాల్‌గా తీసుకుని చేశాను. ప్రస్తుతం రెండు కొత్త చిత్రాలు ఒప్పుకున్నాను'' అన్నారు.

కింగ్–జాకీ–క్వీన్

దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తీ తరేజా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రానికి 'కింగ్–జాకీ–క్వీన్' టైటిల్‌ను ఖరారు చేసి, టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. 1990 నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ క్రైమ్ డ్రామాకు కేకే దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. ఈ చిత్రంలో కింగ్‌గా దీక్షిత్ శెట్టి, జాకీగా శశి, క్వీన్‌గా యుక్తీ తరేజా కనిపిస్తారు. ఇటీవల ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకలో 'దసరా' ఫేమ్ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఈ సినిమాకు సంగీతం: పూర్ణచంద్ర తేజస్వీ, కెమెరా: నాగేశ్ బానెల్, ప్రొడక్షన్ డిజైన్: శ్రీకాంత్ రామిశెట్టి.



● శశి, యుక్తి

రొమాంటిక్ థ్రిల్లర్



● మేఘ శ్యామ్, రేఖా నిరోషా

మేఘ శ్యామ్, రేఖా నిరోషా జంటగా జీవన్ బండి దర్శకత్వంలో ఆదిత్య ముద్గల్ నిర్మించిన లవ్ అండ్ రొమాంటిక్ థ్రిల్లర్ 'వాస్తవం'. త్వరలో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో మేఘ శ్యామ్ మాట్లాడుతూ– ''కథ నుంచి ఆడియన్స్ డీవియేట్ కాకుండా చక్కగా తీశారు జీవన్'' అన్నారు. ''ఈ సినిమాలోని ప్రతి పాత్ర ఆడియన్స్‌కు గుర్తుంటుంది'' అన్నారు జీవన్. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు ఆదిత్య.

సాక్షి **బిజినెస్**
బుధవారం
21-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
349	75
73,057	22,197

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,523	▽ 253
డోజోన్స్	38,500	▽ 128
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,719	▽ 9
డాక్స్	17,068	▽ 24
షాంఘై	2,923	▲ 12
నికాయ్	38,364	▽ 107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	62,139	▲ 122
బంగారం (99.5 స్వచ్ఛత)	61,890	▲ 121
వెండి (కిలో)	70,898	▽ 312

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.62	83.64
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.35	105.91
€	యూరో	ఒకటి	88.31	90.73
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.68	55.94
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.37	55.30
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.39	64.06
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.21	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.69	23.48
¥	చైనా యువాన్	ఒకటి	10.41	12.48

వేల్యూ యాడెడ్ ఉత్పత్తులకు డిమాండ్

గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా పనీర్, థిక్‌షేక్స్ వంటి వేల్యూ యాడెడ్ ఉత్పత్తుల (వీఏపీ) మార్కెట్ గణనీయంగా పెరుగుతోందని గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర సూరి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ వేసవిలో తాము మరిన్ని ఉత్పత్తులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఇప్పటికే అత్యంత చౌకగా రూ. 10 నుంచి ప్రారంభమయ్యే మిల్క్ షాట్స్ లాంటి పలు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. అందుబాటు ధరల్లో చిన్న ప్యాక్‌లను కూడా అందించే దిశగా సామర్థ్యాలను పెంచుకునేందుకు రూ. 20 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు సూరి



చెప్పారు. ప్రస్తుతం తమకు 13 లక్షల లీటర్ల సామర్థ్యంతో మొత్తం 10 పాల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉండగా.. తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఉన్నాయని పేర్కొన్నారు. నిత్యం ఏడు లక్షల లీటర్ల మేర పాల సేకరణ జరుపుతున్నామని, ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే ఏకంగా 2.30 లక్షల లీటర్లు సేకరిస్తున్నామని సూరి చెప్పారు. సుమారు రూ. 5 వేల కోట్లుగా ఉన్న హైదరాబాద్ మార్కెట్లో తమకు దాదాపు పది శాతం వాటా ఉందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం గరిష్ట సింగిల్ డిజిట్ స్థాయి ఆదాయ వృద్ధి సాధించగలమని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ టర్నోవరు సుమారు రూ. 1,500 కోట్లుగా నమోదైంది.

అశోక్ లేలాండ్ కొత్త ప్లాంట్

ముంబై: వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో వద్ద 70 ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రం రానుంది. ఇది కార్యరూపం దాల్చితే



సంస్థ ఖాతాలో మొత్తం ప్లాంట్ల సంఖ్య ఏడుకు చేరుకుంటుంది. ప్రతిపాదిత నూతన ఫెసిలిటీకి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. తొలి దశలో అశోక్ లేలాండ్ ఈ కేంద్రానికి రూ.200–500 కోట్లు వ్యయం చేయనుంది. ప్లాంటు కోసం కంపెనీ మొత్తం రూ.1,000 కోట్లు పెట్టుబడి చేసే అవకాశం ఉంది. లక్నో ప్లాంటులో ఎలక్ట్రిక్ బస్‌లను తయారు చేస్తారు. ఏటా 2,500 వాహనాలు తయారు చేయగలిగే సామర్థ్యంతో నిర్మించనున్నారు.

మూడేళ్లలో 17 బిలియన్ డాలర్లకు!

- దేశీ ఏఐ మార్కెట్‌పై అంచనా
- నాస్కామ్–బీసీజీ నివేదిక

ముంబై: దేశీయంగా కృత్రిమ మేధ (ఏఐ) మార్కెట్ ఏటా 25–35% వృద్ధి చెందుతోంది. కంపెనీలు టెక్నాలజీపై మరింతగా ఖర్చు చేస్తుండటం, ఏఐ నిపుణులు.. ఏఐపై పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో 2027 నాటికి ఇది 17 బిలియన్ డాలర్లకు చేరనుంది. టెక్నాలజీ, లీడర్‌షిప్ ఫోరం 2024 సందర్భంగా సంయుక్త నివేదికలో టెక్ సంస్థల సమాఖ్య నాస్కామ్, బీసీజీ ఈ మేరకు అంచనా వేశాయి. అంతర్జాతీయంగా ఏఐపై పెట్టుబడులు 2019 నుంచి ఏటా 24% వృద్ధి చెందాయి. 2023లో 83 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఎక్కువగా డేటా అనలిటిక్స్, జెన్‌ఏఐ, ఎంఎల్ అల్గోరిథమ్స్ ప్లాట్‌ఫామ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు నివేదిక తెలిపింది.

వినూత్న సొల్యూషన్స్ ..

టెక్నాలజీ సర్వీస్ ప్రొవైడర్లు సాంప్రదాయ ఐటీ సర్వీసుల పరిధిని దాటి ఏఐ ఆధారిత వినూత్న సేవలు, సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు నివే



దిక పేర్కొంది. ఆటోమేషన్ టూల్స్, డేటా అనలిటిక్స్ సొల్యూషన్స్‌తో పాటు హెల్త్‌కేర్, బ్యాంకింగ్ .. ఫైనాన్స్, రిటైల్ వంటి నిర్దిష్ట రంగాల అవసరాలకు అనుగుణమైన ప్రొప్రైటరీ ఏఐ.. జనరేటివ్‌ఏఐ ప్లాట్‌ఫామ్స్ కూడా వీటిలో ఉన్నట్లు వివరించింది.

- ఇతర దేశాలతో పోలిస్తే దేశీయంగా ఏఐ నైపుణ్యాలున్న ప్రతిభావంతులు మూడు రెట్లు అధికంగా ఉన్నారు. గత ఏడేళ్లుగా చూస్తే ఏఐ నిపుణుల సంఖ్య 14 రెట్లు పెరిగింది. ఏఐ నిపుణుల విషయంలో టాప్ అయిదు దేశాల్లో భారత్ కూడా ఒకటిగా ఉంది.
- ఏఐలో పెట్టుబడులు పెరిగే కొద్దీ భారత్‌లో కృత్రిమ మేధ నిపుణుల సంఖ్య 2027 నాటికి వార్షికంగా 15 శాతం మేర వృద్ధి చెందనుంది.

వినోదం కోసం.. ఫైబర్‌కు సై!

- డీటీహెచ్‌కు తగ్గుతున్న ఆదరణ
- ఫైబర్ కనెక్షన్ల వైపు మొగ్గు
- హైస్పీడ్ నెట్, ఓటీటీ యాప్స్ ఆకర్షణ



న్యూఢిల్లీ: దేశీయంగా టీవీ వీక్షకులు వినోదం కోసం క్రమంగా డీటీహెచ్ (డైరెక్ట్ టు హోమ్) సర్వీసుల నుంచి ఫైబర్ కనెక్షన్ల వైపు మళ్లుతున్నారు. బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ స్పీడ్ వేగవంతంగా ఉండటం, అనేకానేక ఓటీటీ యాప్‌లు అందుబాటులోకి రావడం, నెట్‌వర్క్ స్థిరంగా ఉండటం వంటి అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయి. దీంతో లక్షల మంది కస్టమర్లు డీటీహెచ్‌ను వదిలేసి ఫైబర్ కనెక్షన్లు తీసుకుంటున్నారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత త్రైమాసికంలో డీటీహెచ్ కస్టమర్ల సంఖ్య ఏకంగా 13.20 లక్షలు తగ్గడం ఇందుకు నిదర్శనం. ఫైబర్ కనెక్షన్లకు ఆదరణ పెరుగుతుండటమనేది వినోదం విషయంలో ప్రజల అలవాట్లు మారుతుండటాన్ని సూచిస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వాతావరణంలో మార్పులు, సాంకేతిక లోపాల కారణంగా పదే పదే అంతరాయాలు వస్తుంటాయని డీటీహెచ్ సర్వీసులపై విమర్శలు ఉన్నాయి. అదే ఫైబర్ కనెక్షన్లయితే పటిష్టమైన, విశ్వసనీయమైన ప్రత్యామ్నాయంగా ఉంటాయని ధీమా ఉంటోంది. గ్యారంటీగా నిరంతరాయ సర్వీసుతో పాటు పనితీరు కూడా అత్యుత్తమంగా ఉండటంతో ఇవి మరింత ఆకర్షణీయంగా మారుతున్నాయి.

యువత దన్ను..

జియో సినిమా, జియోటీవీ వంటి ఓవర్ ది టాప్ (ఓటీటీ) యాప్‌లు, ప్లాట్‌ఫామ్‌లు ప్రజల ధోరణులు మారడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఫైబర్ కనెక్షన్ల ద్వారా అందుబాటులో ఉండే ఈ ప్లాట్‌ఫామ్‌లు.. భారతీయ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లైవ్ స్పోర్ట్స్, లేటెస్ట్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ షోలు లాంటి బోలెడంత కంటెంట్‌ను హై డెఫినిషన్ నాణ్యతతో అందిస్తున్నాయి. ఇంటర్నెట్ ద్వారా నిరంతరాయంగా వినోద సర్వీసులు అందుబాటులో ఉండటమనేది ఆకర్షణీయంగా ఉండటంతో యువత ఎక్కువగా ఫైబర్ కనెక్షన్ల వైపు మొగ్గు చూపుతోంది. గణాంకాల ప్రకారం ఇప్పటికే 2.23 కోట్ల మంది యూజర్లు ఫైబర్‌వైపు మారారు. సాంప్రదాయ డీటీహెచ్ సేవలతో పోలిస్తే ఇంటర్నెట్ ఆధారిత ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లకు పెరుగుతున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని విశ్లేషకులు తెలిపారు. అదే సమయంలో డీటీహెచ్ సర్వీసులకు డిమాండ్ తగ్గుతుండటాన్ని కూడా సూచిస్తోందని పేర్కొన్నారు.

ర్యాలీతో రికార్డుల మోత

- ఆరో రోజూ మార్కెట్ల దూకుడు
- 75 పాయింట్లు ప్లస్.. 22,197కు నిఫ్టీ
- 349 పాయింట్లు అప్.. సెన్సెక్స్: 73,057



ముంబై: ప్రధానంగా బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ దిగ్గజాలలో కొనుగోళ్ల మార్కెట్లకు జోష్‌నిచ్చాయి. దీంతో మరోసారి మార్కెట్లు లాభపడ్డాయి. నిఫ్టీ 75 పాయింట్లు ఎగసి 22,197 వద్ద ముగిసింది. దీంతోపాటు ఇంట్రాడేలో 22,216కు చేరడం ద్వారా మళ్లీ సరికొత్త రికార్డులను నెలకొల్పింది. మరోపక్క సెన్సెక్స్ 349 పాయింట్లు జంప్‌చేసి 73,057 వద్ద నిలిచింది. తద్వారా 73,000 పాయింట్ల మైలురాయిని మరోసారి అధిగమించడంతోపాటు.. చరిత్రాత్మక గరిష్టం 73,328ను అధిగమించే బాటలో సాగుతోంది. సోమవారం సైతం నిఫ్టీ 22,122 వద్ద రికార్డ్ సృష్టించిన విషయం విదితమే. అయితే మార్కెట్లు తొలుత వెనకడుగుతో ప్రారంభమయ్యాయి. నిఫ్టీ 22,046 దిగువన, సెన్సెక్స్ 72,510 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. తిరిగి మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నాయి. దీంతో ఆరు రోజుల్లో నిఫ్టీ 580 పాయింట్లు, సెన్సెక్స్ 1,984 పాయింట్లు జమ చేసుకున్నాయి.

ప్రయివేట్ స్పీడ్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా ప్రయివేట్ బ్యాంక్స్(1%) జోరు చూపాయి. నిఫ్టీ దిగ్గజాలలో పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఎన్‌టీపీసీ, కొటక్, ఎస్‌బీఐ లైఫ్, బీపీసీఎల్, ఇండస్‌ఇండ్, అపోలో హాస్పిటల్, గ్రాసిమ్, నెస్లే, హెచ్‌యూఎల్ 4.4-1 శాతం మధ్య ఎగశాయి. అయితే హీరోమోటో, బజాజ్ ఆటో, ఐషర్, కోల్ ఇండియా, టీసీఎస్, సిప్లా, బజాజ్ ఫిన్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ 4-1% మధ్య క్షీణించాయి.

చిన్న షేర్లు వీక్

అధిక విలువల కారణంగా ఇన్వెస్టర్లు చిన్న షేర్లలో అమ్మకాలు చేపట్టారు. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.2 శాతం డీలా పడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,967 నీరసించగా.. 1,876 బలపడ్డాయి. ఇక నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 1,336 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 1,491 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

స్టాక్ హైలైట్స్..

- ఇష్యూ ధర రూ. 151తో పోలిస్తే విభోర్ స్టీల్ ట్యూబ్స్ 179% లాభంతో రూ. 421 వద్ద లిస్టయ్యింది. 193% (రూ.291) బలపడి రూ. 442 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 838 కోట్లను దాటింది. ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో 23.3 లక్షలకుపైగా షేర్లు ట్రేడయ్యాయి. ఈ ఐపీవో భారీ స్థాయిలో 300 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది.
- ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల్లో రూ. 656 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించడంతో పవర్ గ్రిడ్ షేరు 4.2% ఎగసి రూ. 288 వద్ద క్లోజైంది.

వర్ల్‌పూల్ వాటా విక్రయం.. రూ. 4,090 కోట్ల సమీకరణ

రుణ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రమోటర్ సంస్థ వర్ల్‌పూల్ మారిషస్ బ్లాక్‌డీల్స్ ద్వారా దేశీ అనుబంధ కంపెనీ వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటాను విక్రయించింది. యూఎస్ హోమ్ అప్లయెన్సెస్ దిగ్గజం వర్ల్‌పూల్ కార్పొరేషన్ మారిషస్ సంస్థ ద్వారా 75 శాతం వాటాను కలిగి ఉంది. కాగా.. బ్లాక్ డీల్స్ ద్వారా రూ. 4,090 కోట్ల విలువైన 3.13 కోట్ల షేర్లు విక్రయించినట్లు బీఎస్ఈకి వర్ల్‌పూల్ ఇండియా వెల్లడించింది. రుణ చెల్లింపుల కోసం వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటాను విక్రయించనున్నట్లు గతేడాది వర్ల్‌పూల్ కార్ప్ వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వర్ల్‌పూల్ ఇండియా షేరు 3.25 శాతం క్షీణించి రూ. 1,288 వద్ద ముగిసింది.

9 ప్రాజెక్టులకు జపాన్ తోడ్పాటు

రూ. 12,800 కోట్ల రుణ సాయం

న్యూఢిల్లీ: భారత్‌లో పలు రంగాలకు సంబంధించి తొమ్మిది ప్రాజెక్టులకు జపాన్ ప్రభుత్వం సాయం అందించనుంది. 232.20 బిలియన్ యెన్‌లను (రూ.12,800 కోట్లు సుమారు) రుణంగా అందించనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. తెలంగాణలో స్టార్టప్‌లు, ఆవిష్కరణల ప్రోత్సాహానికి సంబంధించిన ప్రాజెక్ట్, నార్త్ ఈస్ట్ రోడ్ నెట్‌వర్క్ కనెక్టివిటీ, చెన్నై పెరిఫెరల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్, హరియాణాలో సస్టెయినబుల్ హార్టికల్చర్ ప్రాజెక్ట్, రాజస్తాన్‌లో క్లైమేట్ చేంజ్ రెస్పాన్స్ అండ్ ఎకోసిస్టమ్ సర్వీ



సెస్ ప్రాజెక్టులు జపాన్ ప్రభుత్వ దన్నుతో పట్టాలెక్కనున్నాయి. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి వికాస్ షీల్, భారత్‌లో జపాన్ రాయబారి సుజుకి హిరోషి సంతకాలు చేశారు. తెలంగాణలో ఏర్పాటయ్యే స్టార్టప్, ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ వినూత్నమైందని, మహిళలు, గ్రామీణుల్లోని పారిశ్రామిక నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించేందుకు, ఎంఎస్ఎంఈల వ్యాపార విస్తరణకు ఉద్దేశించిందని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. చెన్నై పెరిఫెరల్ రింగ్ రోడ్ అన్నది వాహన రద్దీని తగ్గించి, రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతాన్ని చెన్నైతో అనుసంధానిస్తుందని వివరించింది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

యూపీఎస్సీ–ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2024

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(యానిమల్ హస్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ) లేదా బ్యాచిలర్ డిగ్రీ(అగ్రికల్చర్, ఫారెస్ట్రీ లేదా ఇంజనీరింగ్) లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. **వయసు:** 01.08.2024 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపిక.
» **ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రాథమిక పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, హైదరాబాద్, వరంగల్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.03.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.03.2024 నుంచి 12.03.2024 వరకు
» **ప్రాథమిక పరీక్ష తేది:** 26.05.2024.
» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఎస్‌బీఐలో 80 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 80
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్)–23, డిప్యూటీ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్)–51, మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్)–03, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(అప్లికేషన్ సెక్యూరిటీ)–03.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.36,000 నుంచి రూ.63,840, డిప్యూటీ మేనేజర్‌కు రూ.48,170 నుంచి రూ.69,810, మేనేజర్‌కు రూ.63,840 నుంచి రూ.78,230, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.89,890 నుంచి రూ.1,00,350.
» **వయసు:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, మేనేజర్‌కు 38 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** దరఖాస్తు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**04.03.2024
» **పని ప్రదేశం:** ముంబై, నవీ ముంబై.
» **వెబ్‌సైట్:** www.sbi.co.in

భారత తీరరక్షక దళంలో 70 అసిస్టెంట్ కమాండెంట్ పోస్టులు

ఇండియన్ కోస్ట్‌గార్డ్ వివిధ విభాగాలకు సంబంధించి అసిస్టెంట్ కమాండెంట్ 2025 బ్యాచ్‌లో ప్రవేశాలకు పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
» **పోస్టులు:**జనరల్ డ్యూటీ(జీడీ)–50,టెక్నికల్–20
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్.
» **అర్హత:** విభాగాన్ని అనుసరించి పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100.
» **ఎంపిక విధానం:** స్టేజ్–1, స్టేజ్–2, స్టేజ్–3, స్టేజ్–4, స్టేజ్–5 పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 19.02.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**06.03.2024
» **వెబ్‌సైట్:** https://joinindiancoast-guard.cdac.in

ఏపీపీఎస్సీలో లైబ్రేరియన్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ మెడికల్ అండ్ హెల్త్‌సబార్డినేట్ సర్వీస్‌లో లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **అర్హత:** మొదటి లేదా ద్వితీయ శ్రేణిలో ఎంఏ/ఎంఎస్సీ/ఎంకాం, ఎంఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ(బయాలజీ), కంప్యూటరైజ్డ్ డేటాబేస్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలి. **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.48,440 నుంచి 1,37,220
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 27.03.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**16.04.2024
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

స్పెషలిస్ట్ ఆఫీసర్ కొలువుల పిలుపు

» 606 పోస్టుల భర్తీకి యూనియన్ బ్యాంక్ నోటిఫికేషన్
» ప్రొఫెషనల్ డిగ్రీలతో పోటీ పడే అవకాశం
» రాత పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక
» వేతనం నెలకు రూ.40 వేల నుంచి రూ.80 వేలు

బీటెక్, ఎంటెక్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులకు ప్రభుత్వ రంగ బ్యాంకు.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వాగతం పలుకుతోంది! మొత్తం 606 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. యూబీఐ స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, విజయానికి ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఇంజనీరింగ్, ఎంబీఏ, సీఏ.. ఇలా ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వ కొలువుల వైపు దృష్టి పెడుతున్నారు. వారు ప్రభుత్వ రంగంలో తమ అర్హతలకు సరితూగే పోస్టుల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. ఇలాంటి అభ్యర్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నోటిఫికేషన్ చక్కటి అవకాశమని చెప్పొచ్చు. యూబీఐ.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి సొంతగా నియామక విధానాన్ని చేపడుతోంది.

మొత్తం 606 పోస్టులు

యూబీఐ.. మొత్తం 606 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఆయా పోస్టులను బట్టి.. వీటిని జేఎంజీఎస్–1, ఎంఎంజీఎస్–2,3; ఎస్ఎంజీఎస్–4 గ్రేడ్‌లుగా వర్గీకరించారు.

అర్హతలు వేర్వేరుగా

ఆయా పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ, పీజీడీఎం, ఎంసీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఏ, సీఎంఏ, సీఎఫ్ఏ తదితర అర్హతలతోపాటు అనుభవం ఉండాలి.

వయసు

ఫిబ్రవరి 1, 2024నాటికి చీఫ్ మేనేజర్ పోస్టులకు 30–45 ఏళ్లు; ఐటీ సీనియర్ మేనేజర్ పోస్టులకు 28–38 ఏళ్లు; సీనియర్ మేనేజర్ (సీఏ, రిస్క్), మేనేజర్ పోస్టులకు 25–35 ఏళ్లు; మేనేజర్ (రిస్క్) పోస్టులకు 25–32 ఏళ్లు; మేనేజర్ (లా) పోస్టులకు 26–32 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 20–30 ఏళ్ల వయసు ఉండాలి.

మూడంచెల ఎంపిక విధానం

స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి మూడంచెల ఎంపిక విధానాన్ని అనుసరిస్తారు. తొలుత రాత పరీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి. ఈ మూడింటిలో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు.

రాత పరీక్ష.. వేర్వేరుగా

- తొలి దశ రాత పరీక్షను ఆయా పోస్టులకు సంబంధించి వేర్వేరు విధానాల్లో నిర్వహిస్తారు.
- చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్ పోస్టులకు సంబంధించిన రాత పరీక్షను సంబంధిత సబ్జెక్ట్‌లో 100 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం 200 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు రాత పరీక్షను నాలుగు విభాగాల్లో మొత్తం 150 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–25 మార్కులు; రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు; సంబంధిత సబ్జెక్ట్ ప్రొఫెషనల్ నాలెడ్జ్ 50 ప్రశ్నలు–100 మార్కులు; ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కును తగ్గిస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు.



గ్రూప్ డిస్కషన్

అభ్యర్థులు రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకొని గ్రూప్ డిస్కషన్‌కు ఎంపిక చేస్తారు. గ్రూప్ డిస్కషన్‌లో నిర్దేశిత టాపిక్‌ను పేర్కొని దానిపై చర్చించమని అడుగుతారు. 50 మార్కులకు నిర్వహించే జీడీలో జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 25 మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 22.5 మార్కులు పొందాలి.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా.. రిజర్వేషన్ వర్గాల వారీగా నిర్దిష్ట కటాఫ్‌లను పరిగణించి.. ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించారు. ఇందులో అకడమిక్ నాలెడ్జ్, పని అనుభవం, భావ వ్యక్తీకరణ, ఆలోచన సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

తుది జాబితా ఇలా

తుది జాబితా రూపకల్పనలో ఆన్‌లైన్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. ఒకవేళ రాత పరీక్ష నిర్వహించకుంటే.. ఇంటర్వ్యూలో పొందిన మార్కుల ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు. జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూలను మాత్రమే నిర్వహిస్తే.. ఈ రెండింటిలో పొందిన మార్కులను పరిగణనలోకి తీసుకుని తుది ఎంపిక చేస్తారు.

ఆకర్షణీయ వేతనం

తుది జాబితాలో చోటు సాధించి.. నియామకాలు ఖరారు చేసుకున్న వారికి ఆకర్షణీయమైన వేతనాలు లభిస్తాయి. చీఫ్ మేనేజర్ పోస్ట్‌లకు ఎస్ఎంజీఎస్–4 హోదాలో రూ.76,010–రూ.89,890; సీనియర్ మేనేజర్ పోస్ట్‌లకు ఎంఎంజీఎస్–3 హోదాలో రూ. 63,840–రూ.78,230; మేనేజర్ పోస్ట్‌లకు ఎంఎంజీఎస్–2 హోదాలో రూ. 48,170–రూ.69,810; అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌లకు జేఎంజీఎస్–1 హోదాలో రూ. 36,000–రూ. 63,840 శ్రేణిలో ప్రారంభ వేతనం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**2024,ఫిబ్రవరి 23
- **రాత పరీక్ష తేదీ:** మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.unionbankofindia.co.in/english/recruitment.aspx

రాత పరీక్షలో రాణించేలా

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్ కోసం అభ్యర్థులు పటిష్ట ప్రిపరేషన్ సాగించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.


ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి.రీడింగ్ కాంప్రహెన్షన్,కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో స్కోర్ కోసం అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్, దానికి సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


SAMSUNG
Galaxy S24 Ultra
Circle it, find it
12:45
100%
Shorts
Google
21 lakh
Dislike
Add to your search
How to make Achappam recipe at home
How to make Achappam at home
Circle to Search
with Google
Own now at ₹ 5417/month*
Zero down payment | 24 months no cost EMI#
Up to ₹ 12000 upgrade bonus**
Samsung Upgrade
HDFC BANK
BAJAJ FINSERV
Samsung Finance+™
samsung.com
Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 1800 5 7267864 for information on e-waste/plastic pick up.
Image simulated for representational purpose, actual may vary. S Pen embedded in Galaxy S24 Ultra. Circle to Search results may vary depending on visual matches. Google is a trademark of Google LLC. Compatible devices and internet connection required. Works on compatible apps and surfaces. Results may vary depending on visual matches. Users may need to update Android to the latest version. Product functionality may be dependent on your app and device settings. Some functions may not be compatible with certain apps. Availability of the service varies by country and language. Accuracy of results is not guaranteed. T&C apply. *EMI computed on zero down payment, 24 months no cost EMI on the price of ₹ 129999 for1 Unit of Galaxy S24 Ultra 12GB | 256GB. Final price at sole discretion of dealer. #Eligibility for EMI at the sole discretion of the financiers, including those listed on Samsung Finance+ (Financier T&C applies). Samsung disclaims any liabilities with the same. **Upgrade bonus offer as per Samsung Upgrade program, provided by brand/dealer at their sole discretion upon exchange of select devices. Upgrade bonus varies model wise and EMI offer taken by the customer. Up to ₹ 12000 upgrade bonus is applicable only where customer does not avail the 24 months no cost EMI offer. The upgrade bonus shall be up to ₹ 5000 only when availed with 24 months no cost EMI offer. Reach out to dealer for more information. Offers may be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company. Samsung promotes responsible use of Artificial Intelligence (AI) features.
Scan and experience Galaxy AI
Or WhatsApp "Hi" to 9870 494949 to buy at Samsung Exclusive Store
Cheil-19146/24